కవిత్వం

చితా భస్మం లోంచి...



అమర్

చితా భస్మం లోంచి...

అమర్

Navya Printers, Hyd.

నన్ను పిరికితనం ఆవరించినప్పుడల్లా అమరుల త్యాగం నాకు ధైర్యాన్నిస్తుంది. అంతా భస్మం అవుతున్నప్పుడల్లా అందు నుండే ఉద్యమ ఫినిక్స్‌పక్షి పుట్టుకొస్తుంది. 'ఆకురాయి' ఆశలకు పదనుపెడుతుంది. విద్రోహం మనసులో గుచ్చుకొని కలుక్కుమన్నప్పుడల్లా విశ్వాసం వెన్ను తడుతుంది. ఆశలన్ని ఖైదుచేయబడ్డప్పుడు ఆలోచన బంధవిముక్తం అవుతుంది. నా ఒంటరితనాన్ని ఛేదిస్తూ ఒక స్వరం వెన్నంటి వస్తుంది. బహుశా మనిషి అంతరంగాన్ని ఆవిష్కరించేది కవిత్వమేనేమో అనిపిస్తుంది. అంతరంగం లోంచి బాహ్యప్రపంచంలోకి, బాహ్య ప్రపంచంలోంచి అంతరంగం లోనికి ప్రయాణిస్తూ సమాజంలోని భౌతిక-బౌద్ధిక సంఘర్షణను కవిత్వం ప్రతిబింబిస్తుంది. ఇదంతా నేను తరచి చూసుకోకుండానే ఒక ప్రవాహంలో కొట్టుకు వచ్చాను. అలా కొట్టుకువచ్చి గడ్డకుపడ్డ కవితలు మీ ముందున్నవి. వీటిని సమీక్షించేది మీరే.

- అమర్.

chithabhasmam lonchi

poetry by amar

వెల : 40/-

artist : Sriram

చితాభస్మం లోంచి...

కవిత్వం

1982-2004

అమర్

విరసం ప్రచురణ

హైదరాబాద్

2008

చితాభస్మం లోంచి.. కవిత్వం 1982 - 2004
అమర్
Chitaabhasmam lonchi... **Poetry 1982 - 2004**
By Amar

January 2008

విరసం ప్రచురణ

వెల : రు. 40

ప్రతులకు :

సహచర బుక్ మార్క్, హైదరాబాద్
దిశ పుస్తక కేంద్రం, హైదరాబాద్
నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్
కుశల పుస్తక నిలయం, హైదరాబాద్
అన్ని ప్రముఖ పుస్తక షాపుల్లో

ముద్రణ :
నవ్య ప్రింటర్స్, ఉర్దూ గల్లీ, హిమాయత్‌నగర్, హైదరాబాద్

విషయసూచిక

ప్రతిఘటనా అక్షరాలు

అమర్ కవిత్వం 2004లోనే పుస్తకరూపంలో వచ్చివుండాల్సింది. ఆలస్యానికి ప్రజలు పాల్గొన్న శాంతి, యుద్ధం, ప్రభుత్వం కొన్నాళ్ళ పాటు పాటించిన కపట శాంతి మూడూ కారణమయ్యాయి. అమర్ తాను 1982 నుంచి 2004 వరకు రాసిన వచన కవితలకు 'చితాభస్మంలోంచి...' అని పేరుపెట్టాడు. ఈ కాలాన్ని బట్టే ఈ కవితలు జగిత్యాల సిరిసిల్ల పోరాటలపై చెన్నారెడ్డి మొదటి ముఖ్యమంత్రిగా అమలుచేసిన మొదటినిర్భంధంతో మొదలై ఎన్.టి.ఆర్. తొలి మలి పాలనలు, మళ్ళీ చెన్నారెడ్డి పాలన, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, తొమ్మిదిన్నర సంవత్సరాల చంద్రబాబు పాలనలోని నిర్బంధ పరాకాష్ఠ ఈ కవితల్లో దెబ్బతిన్నా కోల్పోని విశ్వాసానికి కవి ఇచ్చిన కవితారూపాలుగా శీర్షికను బట్టి ఊహించుకోవచ్చు. ఇంద్రవెల్లి దురంతంతో టంగుటూరి అంజయ్య పాలన, నక్సలైట్ల విషయంలో మార్పుఏమిలేని విజయభాస్కరరెడ్డి పాలనలోని రాజ్యహింసగురించి కూడ ఇందులో కవితలున్నాయి.

ముందుగా అమర్ ప్రస్థానం గురించి మాట్లాడుకుందాం. ఎందుకంటే సి.పి.ఐ.ఎమ్.ఎల్ జనశక్తి రాష్ట్ర కార్యదర్శిగా అక్టోబర్ 11, 2004న సి.పి.ఐ మావోయిస్టు నాయకులతోపాటు తన సహచరుడు రియాజ్‌ను కూడా తోడు తీసుకొని చిన అరుట్ల మార్గంగా ఆయన శాంతి చర్చల కోసం నల్లమల అడవుల నుండి బయటకువచ్చినపుడు వాళ్ళతోపాటు తాను తుపాకి అక్కడవున్న సహచర కామ్రేడ్స్‌కు అందించాడు. తన అమ్ములపొదిలో, వాళ్ళ భాషలో కిట్‌లో, ఈ కవితలు మాత్రం తెచ్చుకొన్నాడు. ఆయన ఆశఅల్లా చితాభస్మం వలన స్మశాన శాంతి ఏర్పడిన తెలుగు నేల మీద స్వేచ్ఛా విహంగాలతో ఎగిరే శాంతి కపోతాలు ఎగరవేద్దాం అనుకున్నాడు. అయితే ఇది సంప్రదాయంగా వస్తున్న జవహర్‌లాల్ నెహ్రూ వంటి దోపిడీ పాలకవర్గాల నాయకులు ఎగరవేసే శాంతి కపోతం కాదు, విప్లవ కారులకు ఇది ఫీనిక్స్ పక్షి. ప్రజల అతి ప్రాచీన విశ్వాసగాథలో రెక్కలు, ఈకలతో పాటు కాలిపోయి బూడిదైపోయాకకూడ ఆ బూడిదలోంచి మళ్లీ రెక్కలు అల్లాడిస్తూ లేచే పక్షి. అది గ్రీకు గాథల్లోది కావచ్చు షెల్లీ కవిత్వంలోని స్కైలార్క్ కావచ్చు, ప్రాకృతకాలపు భరతపక్షి కావచ్చు, చార్వాకం కావచ్చు, పైడిపిట్ట కావచ్చు, తెలంగాణా పల్లెల్లో దసరానాడు జమ్మి చెట్టుమీద అజ్ఞాతంలో దాచిన ఆయుధాలు మళ్ళీ తీసుకోవడానికి వెళ్లే ప్రజలు వెతుక్కొనే పాలపిట్ట కావచ్చు. పక్షి స్వేచ్ఛకు సంకేతం అయినపుడు అది భౌతికంగా అదృశ్యం అయినా చైతన్యంలో బతికేవుంటుంది కనుక మళ్ళీ వస్తుంది. రెక్కలు అల్లారుస్తూ వస్తుంది. నేలనుంచి ఆకాశంలోకి ఎగురుతూ నింగినుంచి నేలమీదకుదిగుతూ మళ్లీ మళ్లీ వస్తుంది. దాని రూపాంతరం కవిత్వంలో కొంచెం గంభీరంగా మెటమార్ఫసిస్ అనుకుంటే దానికోసం కలవరించే అమర్ సిరిసిల్లలో ఒక చేపపిల్ల వలె కళ్ళు తెరిచాడు. కూర దేవేందర్‌గా వేములవాడలో

ఒక బెస్తపల్లెలో పేదరికంలోపుట్టాడు. నేను పరిచయం చేయనక్కర్లేకుండా బహుశా నా పరిచయ పేదరికాన్ని వెక్కిరిస్తూ తన పేదరికాన్ని దీనంగా కాకుండా ఒక అణచివేతగా కుల వర్గ అణచివేతగా, బ్రాహ్మణీయ భూస్వామ్య సామ్రాజ్యవాద అణచివేతగా, పేదరికాన్ని సాంస్కృతిక వెలివేతను ప్రకృతిన్యాయంగా కాకుండా ఒక కృత్రిమ వివక్షగా గ్రహించిన పోరాటంగా ఆయన తన 'అమ్మ' 'నాయిన' అనే రెండు కవితల్లో అద్భుతంగా చిత్రించాడు. బహుశా ఆయన నక్సల్బరీ శ్రీకాకుళ పోరాటాలు వసంత మేఘాలు ఆకురాలు కాలాలు అయిన కాలంలో వేములవాడలో విద్యార్థిగా ప్రారంభమయ్యాడు. అందుకే ఆయన నవయవ్వన హృదయంలో అప్పుడే ఆ పక్షి ప్రవేశించింది. వేములవాడ కరీంనగర్ జిల్లా సిరిసిల్ల పక్కన ఒక శివక్షేత్రం. ఒక బ్రాహ్మణ అగ్రహారం. ఆ అగ్రహారంలో కులవృత్తులతో బతికే వారిని ముఖ్యంగా మాదిగ, మాల, చాకలి, మంగలి, కుమ్మరి, బెస్త వంటి కులాలవారిని బ్రాహ్మణీయవ్యవస్థ ఎలా చూస్తుందో 'అమ్మ' కళ్లకు కడుతుంది. అయితే ఇక్కడే వేములవాడ భీమ కవి పుట్టాడు. ఆయన రచించిన 'మైలమభీముని ఖడ్గ సృష్టి' 1956 నుంచి 66 వరకు గ్రేట్ డిబేట్ కాలంలో సదసత్సంశయంతో మథనపడిన శ్రీశ్రీకి సందేహ నివృత్తి చేసింది. ఆశయాలు సంఘర్షించే వేళ ఆయుధం అలీనం కాదని చెప్పింది. ఆ మైలమభీముని వేములవాడలోపుట్టిన దేవేందర్ మిత్రగా, అమర్‌గా ఎదిగిన క్రమానికి గోదావరి లోయపొడుగునా అడవి నేర్పిన నడకలే కాదు గంగదాక ప్రజాపోరాటాలు నడకలుగా గెంతులుగా సాగిన ప్రస్థాన దోహదం ఉంది. దేవేందర్‌గా ఆయన ఇంకా విద్యార్థిగా జమ్మికుంటనుంచి విద్యార్థులే నడిపిన విద్యుల్లత పత్రికతో పాటలతోనే కవిత్వం ప్రారంభించాడు. ఎందుకంటే ఆ కవిత్వం ఆయనకు బడి నుంచి అబ్బడానికన్న ముందు అమ్మ ఒడినుంచి అబ్బింది. విద్యుల్లత పత్రిక పరిచయంతో ఆయనకు విప్లవ రచయితల సంఘం పరిచయమయింది.

అరుణోదయ ప్రచురణగా కె.దేవేందర్ రాసిన మానేటిపాటకు ముందుమాట రాస్తూ అప్పటి అరుణోదయ అధ్యక్షుడు దివికుమార్ 1994కే ఆయనది ఉద్యమ హృదయగానం అన్నారు. ఆయన మాటల్లోనే "1970లో నక్సల్బరీ శ్రీకాకుళం గోదావరి లోయ ప్రజాపోరాటాల ప్రేరణతో ఏర్పడ్డ విప్లవరచయితల సంఘం తెలుగు సాహిత్యంలో ప్రచండ ఝుంఝూ మారుతమైనిలిచింది. విప్లవోద్యమాలను గానం చేస్తూ వాటిపై ప్రభుత్వ క్రూరమైన అణచివేతని తీవ్రంగా నిరసిస్తూ విప్లవ సాహిత్య వరవడిని సృష్టించిన విరసం ప్రజా పోరాటలతో మమేకమై వందలాది కవులు రచయితలపైన మొత్తంగా తెలుగు సాహిత్యాన్ని ప్రభావితంచేస్తుంది. కామ్రేడ్ దేవేందర్ విప్లవ రచయితల సంఘంలో సభ్యుడే కాక విప్లవోద్యమాన్ని నిర్మిస్తున్న క్రియాశీలకార్యకర్త. ఒక విప్లవపార్టీ నాయకుడుకూడ. కరీంనగర్ ప్రజాఉద్యమం అనేకమంది రచయితలని కళాకారులని సృష్టించుకుంది. 70 వ పడిలో కరీంనగర్ నుండి వెలువడిన విద్యుల్లత సాహిత్యపత్రిక రాష్ట్ర వ్యాప్తంగా తన ప్రభావాన్ని ప్రసరించింది. రచయితలను తన చుట్టూ సమీకరించుకుంది. కొన్నెత్తుటి తైలంతో కొనఊపిరి వత్తులల్లి త్యాగాల పెనుమంటతో నూతన జగతికి పోరుబాటలో నడిచిన అమరవీరులకు ఖ్యాతిగన్న ఆ గడ్డ ఉత్తమ సాహిత్యానికి కూడ జీవంపోసింది. అప్పుడు విజయ్ అనే పేరుతో ఆయన కవిత్వం రాయడం ప్రారంభించాడు. విజయ్ విన్ మిత్ర పేరుతో కొన్ని వందల పాటలు రాసాడు". ఇప్పుడైతే అసంఖ్యాకంగా వెలువడిన అరుణోదయ పాటల క్యాసెట్లు సిడిలలో మిత్రపాటలు వినని తెలుగువారుండరు.

చర్చల కోసం బయలుదేరుతూ చినఆరుట్లలో కలుసుకొన్నపుడు ఇదే మొదటిసారి కాదు మనం 83 శ్రీశ్రీ సంస్మరణలో ఇద్దరము ఒకే వేదికపై మాట్లాడాము అని చెప్పాడు. అప్పటికి ఆయన విరసం సభ్యుడు. ఈ 20, 25 ఏళ్ళ విప్లవోద్యమ ప్రయాణంలో ఆయన కవిత్వం పాటగా ప్రవహించిన పాయలెన్నో. ముఖ్యంగా విప్లవోద్యమ ఆటుపోట్లు ఐక్యత ఘర్షణ చీలికలు సిద్ధాంత చర్చలు అన్నిటిని మించి సహచరుల అమరత్వం ఆయన కవిత్వ వస్తువైంది. విప్లవోద్యమమంత ప్రాణప్రదమైందే ఆయనకు వస్తువుగా తెలంగాణ. అంటే సామ్రాజ్యవాద అసమ అభివృద్ధి విధానానికి ప్రయోగశాలగా మారింది తెలంగాణ. చర్చలకాలంలోని ప్రయణాలలో అది ఒకవేళ శాంతి కాలం అనుకుంటే, రోజూ ఊరూరా సభల్లో తిరిగి నిషేధకాలంలో జైలునుంచి కోర్టుకుపోతూ పోలీసువ్యానుల్లో విన్న మిత్రపాటలు ఇప్పుడు చెవుల్లో గోదావరి వలె హోరెత్తుతూనేవున్నాయి. 2004 అక్టోబర్ 13న మొదటిసారి మణుగూరులో చంద్రపుల్లారెడ్డి తదితర అమరుల సంస్మరణ సభలో అమర్ విమలల యుగళగానం బహిరంగసభవేదిక మీద విన్నాం. తిరిగి అక్టోబర్ 18న చర్చలుముగిసిన రోజు శాంతి చర్చల ప్రతినిధులు అటు ప్రభుత్వం తరఫువాళ్ళు (నిజంగా కోరి పాడించుకున్నది వాళ్ళే), ఇటు విప్లవ పార్టీలవైపు వాళ్లు, ఇటు మధ్యవర్తులు అమర్ పాట పాడించుకొని విన్నారు. ప్రభుత్వంతో శాంతి చర్చలు జరిపిన రెండు విప్లవ పార్టీల్లో ఆయన సి.పి.ఐ. ఎమ్.ఎల్ జనశక్తి రాష్ట్ర కార్యదర్శిగా పాల్గొన్నారు.

అమర్ అప్పటికే విప్లవోద్యమ నాయకుడుగా కాకుండా విప్లవ సాంస్కృతిక నాయకుడుగా కూడ గుర్తింపు పొందాడు. ముఖ్యంగా అరుణోదయ సాంస్కృతిక ఉద్యమ నిర్మాణంలో ఆయన తాతగా పిలుచుకునే కానూరి వెంకటేశ్వరరావుతో పాటు లేదా ఆ తరువాత ఆయన నిర్వహించిన పాత్ర విలువైంది. శ్రీకాకుళ ఉద్యమ సుబ్బారావు పాణిగ్రాహి ఒరవడిని సిరిసిల్లకు తెచ్చినవాడు ఆయన. శ్రీకాకుళం వలెనే సిరిసిల్ల జగిత్యాలలలో అల్లం నారాయణ 'జగిత్యాల కదిలింది జంబాయిరో' పాటతో, గూడ ఆంజయ్య ఎల్ల కాలాలకు విప్లవాన్ని భూమార్గం పట్టించిన అజరామరమైన 'ఊరుమనదిరా' పాటతో ఒక పోరాటపాటల సంప్రదాయం మొదలైంది. దొరల కాళ్ళకింది మట్టి కంటిలోకి ఎగసి 'ఇగ ఎగబడదాంరో ఎములాడ రాజన్న మనం' అని ప్రకటించిన గూడ ఆంజయ్య ఒరవడిలో ఈ వేములవాడ అమర్ రాసిన పాటల గురించిన పారవశ్యాన్ని కాసేపు పక్కనవుంచి ఆయన వచన కవితలో రెండు దశాబ్దాలలో సాధించిన పరిణతి గురించి మాట్లాడుకుందాం.

వస్తువు భాష శైలి రాజకీయ దృక్పథం జీవితం అన్నిటి పరిణతమైన సమాహారానికి అమర్ కవితల శక్తికి ఒక నిదర్శనం చూపాలంటే అది 'అమ్మ' కవిత. తల్లి గురించి కవిత్వం రాయనికవి వుండడు వుండదు. అట్లే ఆ కవి కవితల్లో అటువంటి కవితే బలమైందయికూడ వుంటుంది. మానవీయ అనుబంధం అందుకు కారణం. ఈ కవిత అంత మాత్రమే కాదు ఇది తెలంగాణా కష్టజీవుల 70 ఏళ్ళ ఆత్మకథ మాత్రమేకాదు పోరాటచరిత్ర. ఇది తెలంగాణ్యా రైతాంగపోరాట కాలం కన్న ముందటి తల్లుల బాంచన్ బతుకులకు ఒక ఎట్టికథ కావచ్చు. "ఆ దేవుడు రాత అందరికి చేయితో రాస్తే నాకు కాలితో రాసినట్టున్నాడు. బతుకంతా బండచాకిరే. చేసిచేసి నెత్తురంతా కలికలైంది. పెయ్యి అలుకుపిడసైంది. ఊడ్చి ఊడ్చి చీపురుకట్ట అయింది. ఉతికి ఉతికి మసి పేలికైంది. మంచినీళ్ళ బాయిగిరకైంది.

ఒక్కనాడు నా ఇంట్ల తెల్లారలేదు పొద్దుగూకలేదు. నా యిల్లు చిమ్మన చీకటై బాపనోలిండ్లలనే తెల్లారింది".

ఇది అందరి అమ్మల కథే. ఎట్టికి ఏగలేక సగం గుడిసెలు తాటికమ్మలతో సహా నడిసిపోయినవి. రెక్కలకష్టమే కదా, ఏడ చారెడిత్తులు దొరికితే అదే వాళ్ళ ఊరైంది.

అక్కడ ప్రారంభించి చంద్రబాబు పాలన కాలానికి రైతులు కూడ వలసపోయి వ్యవసాయం మూలన పడిన స్థితి దాకా ఈ ఆత్మకథ నడుస్తుంది.

జోళ్లు తీసి కంకులు గొట్టే కాలం సూద్దామన్నాలేదు
ఆడాడ గుంటూరోల్ల సేన్లల్ల పత్తులు, మిరపల పనీ దొరుకుతుంది.
మాఊరు దుక్కులకు మేము దూరమైనం
మా దుక్కులల్లో గుంటూరు మొక్కలైనయి
మా ఇంటి వాకిల్లన్ని పొక్కిల్లయినయి

ఇంకా ఇట్లా ఎంతో కవితాత్మకంగా తెలంగాణ నుడికారం పలుకుబడులు సామెతలు ఇవన్నీ సహజమైన కడుపు నుంచి వచ్చే వేదనతో చెప్పే జీవితంనుంచి ఆశలు పెంచుకున్న కొడుకులు అవ్వనిడిసి ఆయినిడిసి బాయినిడిసి లోకం లోకం అని పోయారు.

అట్లా పోయిన కొడుకులే కూర రాజన్న కూర దేవేందర్.

అయ్య సచ్చిననాడు రాని కొడుకులకోన,ం కాలం ఆగిందా, కాష్టం ఆగిందా. ఇప్పుడు ఆమెలోకం ఆమె అయ్యింది. ఆమె ధ్యాస ఆమె అయ్యింది. ఇంగ సర్కారు సోలా- మూలా.

పేగులు మాడుతున్నా సూడనోడు
పేగు తెంచుకొని పుట్టిన కొడుకుల కోసం
నేరస్తురాల్ని చేసి ఠాణాల సుట్టు తిప్పుతుంటే
నేను కూడా మీ లోకం కోసం బందీనయినాను

ఈ జీవన్మరణ పోరాటంనుంచి ఆమె విముక్తి పోరాటాన్ని నేర్చుకుంది. ఆకలిలేని రాజ్యమైతే ఆశోలె చిగురించనీ

కష్టజీవులదే కాలమైతే కలకాలం వర్థిల్లనీ

వాళ్ళు చల్లగా బతకాలని చల్లని బతుకులకోసం కణ కణమండే నిప్పులు కావాలని కోరుకుంది. కాని తల్లి మనసుకనుక ఆమె మమకారపు ఆకాంక్ష ఒక్కటే. ఆయితే అవ్వ కండ్లముందు మీరు సావొద్దు. ఇదే నా చివరికోరిక. కన్న తల్లి కోసం కనికరించుండ్రి బిడ్డ అని కోరుకుంది. బహుశా ఇవాళ తెలంగాణలోనే కాదు నల్లమల కళింగాంధ్ర అంతటా తల్లుల ఆవేదన ఇదే ఆకాంక్ష ఇదే. జీవితం పోరాటం కలినేతవల్ల ఇది కవిత్వంగాను ఒక ఆత్మకథగాను, అదే సమయంలో కథగాను వ్యక్తిగతంగాను అదే సమయంలో శ్రమజీవులందరి ప్రతీకగాను సజీవమైన భాష శైలులతో హృదయాన్ని కదిలించే ఒక వాస్తవ సంఘర్షణ శీలమైన చరితగా ఈ కవిత సాగుతుంది. తెలంగాణలో అందరి పోరాటయోధుల తల్లులకు ప్రాతినిధ్యం వహించే ఈ తల్లిని ఒక తాత్కాలిక ఉపశమన ఆనందంలో శాంతి చర్చలకాలంలో అమర్‌ను కలిసినపుడు చూశాను. తీవ్రమైన ఆందోళనలో తన కొడుకుకు ఏమవుతుందోనని ఉత్తరప్రదేశ్‌లో కూర రాజన్న అరెస్ట్ అయినపుడు

హైకోర్టులో చూశాను. మొదటి స్థితి అరుదైంది. రెండవది ఇవాళ అతి సాధారణమైంద. బహుశా చాలా సందర్భాలలో ఇది సుఖాంతంకాదు.

అమ్మ కవితలోనే తండ్రి 93లోనే మరణించినట్లుకూడ అర్థమవుతుంది. అంతే ఆర్ద్రంగా సాగే కవిత. ఆ స్థితిలో రాసిన నాయిన. చేపలుపట్టే వృత్తిలో బురదలో బొర్రి బొర్రి బురదబొంతయిపోయిన దేహం ఆయనది. ఎదురెక్కే చేపలకు ఎడిగొట్టినట్లు బతుకే కిందిమీదైపోయిన బతుకుఆయనది. ఇట్లా ఆయనకు ఉపచిత్రణ జీవితచిత్రణ అంతా ఆయన వృత్తి భాషకు సంబంధించిన పోలికలతో వుంటుంది. నాచువలె గడ్డం క్షౌరం పెరగడం ఛాతీ ఎండుచేపవలె ఎండిపోవడం రెండు కళ్ళు చేపకళ్ళలాగ అయిపోవడం. ఇట్లా ఆయన ఉపచిత్రణ వుంటుంది. ఇది కేవలం రూపాన్ని కాదు ఇది ఇట్లా కావడానికి కారణమైన కష్టాన్ని జీవితాన్ని పట్టిస్తుంది. అయినాసరే అయన కలేజావున్న సిపాయివలె వున్నాడని ఆయన భుజంమీద తోపెల (చేపలు పట్టే సాధనం) కూడ తుపాకీవలె వుంటుందని అంటాడు. ఆయన వేదాంతిలాగా కమ్యూనిస్టులాగా కూడ మాట్లాడతాడు.

పీతుల్ల చాపలు పడ్తున్నవని
పోరగాండ్లంత ఎక్కిరిత్తుండ్రంటె-
ఏంది బిడ్డా మన కడుపుల లేదుర పెండ
బువ్వలేకుంటె ఆదిగూడ రాదని బోదనచేసి
నాయినా... నువ్వు ఏదాంతి లెక్క కనిపిస్తున్నవ్...

ఇది జగంమిథ్య వేదాంతం కాదు. జీవిత గతితర్కం. అందుకే ఆయన కమ్యూనిస్టువలె మాట్లాడతాడు.

మెత్తవడ్డ అరికాల్లకు
సీకిపోయిన ముల్లు కూడా కుచ్చి ఇర్గుతుంటె
మెత్తగుంటే గిదే బాధ బిడ్డా
అడ్డమయినోడు మన మీద నీలుగుతడని
బుద్ధిమాట జెప్పినవు గదనే
మన బతుకెందుకు గిట్లున్నదంటె
సిలుక్కొయ్యకు ఉగులాడుతున్న
అన్న వాడుక బింకిని జూపించి
ఈడ పనికిరానివన్ని గట్ల కొయ్యకెక్కి మూలకు వడ్డప్పుడే
మూలకు వడ్డ మన బతుకులు ముంగట వడ్తయని
నాయినా... నువ్వు కమ్యూనిస్టు లెక్క మాట్లాడినవ్

నిజానికి ఆయన చూసుకుందామంటె నాయిన ఫొటోకూడ లేదు. కాని పల్లెల్లో చెర్లల్లో కుంటల్లో వాగుల్లో సప్తసముద్రాలలో అటువంటోళ్ళ రూపాలు కన్పిస్తూనేవున్నాయి. అటువంటి వాళ్ళంతా నీళ్ల మీద నిలబడి కాళ్ళ మీద నడుచుకుంటు వచ్చి కడుపునిండా మాట్లాడాలనే ఈ పోరాటం.

ఈ కవితలో కాని, అమ్మలో కాని ప్రత్యేకించి చెప్పాల్సింది వస్తువుకోసం ఎంచుకొన్న శిల్పాన్ని, భాషను. శివసాగర్ రెడ్ సిగ్నల్, గద్దర్ గ్యాంగోల్లమండి, వంగపండు యంత్రమెట్ల నడుస్తుందిరన్నా కవితల్లో, పాటల్లో జీవితాన్ని పరిసరాలను పట్టిఇచ్చే భాషవంటిది ఇందులో మనం చూడవచ్చు.

అమర్ మార్క్సిస్టు ఫెమినిస్టు కవి కూడ. ఇటీవల రాసిన సుద్దరోల్ల కోయిల అనేపాట ఇందుకు అద్భుతమైన ఉదాహరణ. ఈ సంకలనంలో పెళ్ళి తర్వాత అప్పగింతల సమయంలో బిడ్డ ఆవేదనను వర్ణించే అప్పగింతల కవితొకటుంది. అభిజ్ఞాన శాకుంతలంలో కణ్వుడు తన ఆశ్రమంనుంచి శకుంతలను పంపించే ఘట్టం నుంచి ఇవాల్టివరకు ఎందరు కవులు ఈ మానవీయమైన సన్నివేశం గురించె చెప్పారో. అయితే ఇందులో శిల్పం కొన్ని అనుబంధాలు కొన్ని వాస్తవాలు కొన్ని అనుభవాలు గుమ్మరించే దు:ఖం గురించి వర్ణించడంలో వుంది.

అమ్మ, అప్పగింత,, స్త్రీ మేధం వంటి కవితల్లో ఆయన మార్క్సిస్టు ఫెమినిస్టుగా కనిపిస్తారు. జెన్ని కోసం రాసిన కవిత ఎంతో ఆర్ద్రమైన గీతం. వైయక్తిక ఘర్షణను ఆత్మహత్య వంటి ప్రయత్నాన్ని ఆయన ఎంత సానుభూతితో అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాడో కిరణ్ కోసం కవితలో చూడవచ్చు.

ఒక ప్రజా సందర్భాన్ని ఒక ప్రజాశత్రు సందర్భంలో గుర్తుచేసుకోవడం కూడ ఈ కవి పాటించిన ఓ కవి సమయం. ఉదాహరణకు కార్గిల్ యుద్ధం సమయంలో ఆయన ఎన్‌కౌంటర్‌లు గుర్తుచేసుకుంటాడు. పాలకవర్గాలకు దేశసరిహద్దులు ఎన్నికల సరిహద్దులు వున్నాయి. కాని కష్టజీవులకు దారిద్ర్యరేఖయే సరిహద్దు. శత్రువు మోహరించే సైన్యానికి పోరాటం సరిహద్దు. శత్రువు యుద్ధనిధికోసం పరుగు పందాలు నిర్వహిస్తాడు. ప్రజలకు జీవించడంఅంటే రోజూ ఒక పరుగుపందెమే. నిర్దిష్టమైన పోరాటంలో వున్నాడుకనుక అమర్ ఎన్‌కౌంటర్‌ల గురించికూడ అస్పష్టంగా రాయడు. కార్గిల్ యుద్ధ సందర్భంగా నిజమాబాద్ జిల్లా పందిమడుగులో ఎన్‌కౌంటర్ అయిన కామ్రేడ్ కిషన్, దేవేంద్ర, శంకర్‌లను తలుచుకుంటూ ఇప్పుడు పందిమడుగు మాచిరునామా అయ్యింది అంటాడు.

అట్లే గుజరాత్ భూకంపం సందర్భంగా పేటెంట్ హక్కులు డంకెల్ ప్రతిపాదనలు నిరసిస్తూ రాస్తాడు. గుజరాత్ భూకంపం లాతూర్ భూకంపం ఈ రెండూ కూడ భూగర్భంలో జరుగుతున్న భారీ తవ్వకాలు నర్మదా డ్యాం గోదావరిపై పుట్టినచోటనే భారీ ఆనకట్టల నిర్మాణంవంటి కారణంగా జరిగినవని పర్యావరణ వేత్తలు చెప్తున్నారు. గుజరాత్ భూకంపం సందర్భంగా సామ్రాజ్యవాద విధ్వంసకర అభివృద్ధి పరిణామంగా ఆయన గుర్తుచేస్తాడు. వేపచెట్టును పేటెంట్ చేయడాన్ని వేపలన్నీ ఇక వాడే వేపుకతింటాడట అని అభివ్యక్తితో ప్రకటిస్తాడు.

వస్తువు పాతదైనచోటకూడ ఆయన అభివ్యక్తి కొత్తగావుంటుంది. నేను కన్నీటి జలాల్లో ఈత నేర్చుకుంటున్నాను. గాలిని బంధించారని గాలే వార్త మోసుకొచ్చింది.

నూలు సరిచేయడానికి ఉడికిన గంజి కూడ
మీ ఆకలిని తీర్చని రోజులు

ఆకలి పేగులు సైరన్ మోతయి కన్నుమూత బడని కటిక రాత్రులు వంటివి.

ప్రభుత్వంతో శాంతి చర్చల కాలంలో కలిసివచ్చిన రెండు విప్లవ పార్టీలు 1989-90 మధ్య కాలంలో మెదక్, కరీంనగర్ జిల్లాలలో తీవ్రమైన ఘర్షణాయుత వైరుధ్యాల మధ్యన పరస్పరం దాడులు, హత్యలు చేసుకున్నాయి. ఇవొక దురదృష్టకరమైన సంఘటనలు. ఈ స్వల్ప కాలంలోనే ఇరువైపులా దాదాపు 30 మంది హతులైపోయారు. ఆరోపణలు నిందలు దుష్ప్రచారాలు అదో దురదృష్ట కరమైన సందర్భం. అప్పుడు అమర్ ఈ రెండు జిల్లాల బాధ్యుడుగా దీనికి సంబంధించిన ఘర్షణ అంతా అనుభవించే వుంటాడు. ప్రజాస్వామ్యవాదుల జోక్యంవల్ల జిల్లాల నాయకత్వానికి రాష్ట్ర నాయకత్వానికి ఆలస్యంగానైనా కలిగిన మెలుకువవల్ల ఆ ఘర్షణ సమసిపోయి క్రమంగా ఆ విప్లవ మైత్రి పార్టీలుగా చర్చలకు కలిసివచ్చే ఫలితాన్ని సాధించాయి. ఈ సందర్భం గురించి ఘర్షణ జరుగుతున్న కాలంలో రాసిందొకటి ముగిసినాకొకటి ఐక్యతను ఆహ్వానిస్తూ ఒకటి మూడు కవితలున్నాయి ఇందులో. సైద్ధాంతిక ఘర్షణలను చర్చలను పొలిమిక్స్‌ను కవిత్వీకరించడం కష్టమైనపని. అమర్‌జీత్ చందన్, శివసాగర్ వంటి కొద్దిమంది కవులే అది సమర్థవంతంగా చేశారు. ఇందులో అటువంటి కవితలు కొన్నివున్నాయి. మెదక్ జిల్లాలో పీపుల్స్‌వార్ బలవంతంగా తుపాకులు లాక్కోవడం తప్పని తీర్మానించి అప్పగించిన రోజుల్లో దళంతో వున్న రాత్రి రాసిన ఆశ అనే కవిత చదివితే విప్లవోద్యమం అంటే తెలియనివాళ్ళు రాజకీయ కవిత్వం అంటే భయపడేవాళ్లు ఆశ్చర్యపోతారు. మామిళ్ల పగులుతున్నాయి అని మొదలవుతుంది ఈ కవిత.

పున్నెమి వెన్నెల్లా పూలగుత్తులు పరుస్తూ
నిదురరాని కండ్లల్లో నిగ నిగలాడుతూ
ఊరంతా సద్దుమణిగి ఉన్నప్పుడు
కదిలే ఊహల నిండా
కాళ్లూ - చేతుల్ల మధ్య కదలాడుతున్నట్లు
మామిండ్లు మహా సరదాగా ఊగుతున్నాయి

దారి తప్పిన చోటే దారి వెతుక్కున్నాం కదా. కొన్నికోటలు పగిలి బీటలు వారుతున్నా, కొన్ని కోటలు కలుస్తున్నాయి. కొన్ని మాటలు కలుస్తున్నాయి. కొన్ని బాటలు కలుస్తున్నాయి.

అమర్ కవిత్వంలో మూల ధాతువు ఈ ఆశావాద దృష్టి. అయితే ఇది నినాదంగా ఒక రాజకీయ పరిభాషగా వుండదు. ఉద్యమమే జీవితం అయిన ఒక సంస్కృతిగా వుంటుంది. ఆ సంస్కృతి అవసరమైన సుకుమారమైన వ్యక్తీకరణ నేర్చుకుంటుంది.

సుదీర్ఘకాలం విప్లవోద్యమంలో వుండటంవల్ల ముఖ్యంగా చంద్ర పుల్లారెడ్డి నాయకత్వంలో ప్రారంభమై ఇప్పుడు జనశక్తి నాయకత్వంలో కొనసాగుతున్న ముఖ్యమైన పోరాట ఘట్టాలన్నీ ఈ కవిత్వంలో చోటు చేసుకున్నాయి. 80 నుంచి ఆ విప్లవ పార్టీకి ఎన్‌కౌంటర్‌ల వల్ల, శత్రుదాడులవల్ల, కొన్ని సందర్భాలలో మిత్ర వైషమ్యాలవల్ల జరిగిన దాడుల్లో జరిగిన నష్టాల ప్రస్తావన కూడ వుంటుంది. ఆయన సహచరులు కృష్ణారెడ్డి, బాబన్న, రంగవల్లి, సుభాష్, శంకర్ మొదలైన వాళ్ళ అమరత్వం గురించి స్మృతి చరణాలు వుంటాయి. ఉద్యమ త్రినేత్రుడుగా బాబన్నను రెండు సార్లు గుర్తుచేసుకుంటాడు. బాబన్న, కృష్ణారెడ్డి, రంగవల్లి వంటి వాళ్ళతో నాకుకూడ వుండే పరిచయం వల్ల ఈ సందర్భాలు రాజకీయ సారూప్యం

వల్లనే కాదు ఆత్మీయంగా కూడ కనిపిస్తాయి. బాబన్న వరంగల్ జిల్లా ఏటూరు నాగారం అడవుల్లో 70లలో విప్లవోద్యమంలో పనిచేసిన కార్యకర్త. అంధుడు. పొడగరి. మంచిగాయకుడు. అట్లూరి రంగారావు గారి ద్వారా పరిచయం అయ్యాడు. ఆయన దగ్గరకు వచ్చినపుడల్లా మా యింటికి వచ్చేవాడు. ఓ ఉద్యమ చలనంగా వుండేవాడు. ఆయన అమరత్వం తరువాత మా విరసంలోను పిడిఎస్‌యు లోను చాలా మంది ఆయనపై కవితలు రాసారు. హెచ్.ఆర్.కె. రాసింది నాకు బాగా గుర్తుంది. అట్లాగే కృష్ణారెడ్డిని విమోచన ఆఫీసులో కలుస్తుండేవాడిని. పిడిఎస్‌యు తొలి నాయకత్వం. ములుగు అడవుల్లో కడుపు నొప్పితో సమయానికి చికిత్స అందక మరణించాడట. భావుకుడు, సున్నితమనస్కుడు. రంగవల్లి కూడ ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి ఉద్యమం నుంచి పరిచయం అయ్యింది. ఆర్ట్స్ కాలేజ్ 80లో విప్లవోద్యమ కృషిలో ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి, వీరన్నలతో పాటు రంగపల్లి పేరు చిరస్మరణీయం అయ్యింది. అమర్ కవిత్వంలోని ప్రత్యేకత ఏమిటంటే రంగవల్లిని ఏనుమాముల సందర్భంలో గుర్తుచేసుకుంటాడు. జూలై 28, 2004న సిపిఐఎమ్ఎల్ పీపుల్స్‌వార్ చారుమజుందార్ వర్ధంతిని అమరవీరుల సంస్మరణ దినంగా వరంగల్‌లో నిర్వహించింది. నిషేధం తొలిగి శాంతి చర్చలకు వాతావరణం ఏర్పడిన సందర్భం. మొగిలిచర్లలో సుదర్శన్ రెడ్డి మొదలైన అమరుల స్థూపాన్ని ఆవిష్కరించి ఏనుమాముల మార్కెట్ స్థలంలో లక్షలాది మందితో మహాసభ నిర్వహించారు. ఆ సభ అనంతరం ప్రభుత్వం కేసు పెట్టింది. అక్కడి ప్రసంగాలు రెచ్చగొట్టేవిగా వున్నాయని. దీని స్పందనగా అమర్ రాసిన కవితలో అటుసుదర్శన్ రెడ్డిని ఇటు రంగవల్లిని తల్చుకుంటాడు. విప్లవోద్యమ ఐక్యతకు దోహదం చేసే ఏ కవితా అవకాశాన్నీ ఆయన వదులుకోలేదు.

ఇటువంటిదే సముద్రుడుపై రాసిన కవిత. సముద్రుడు కౌముదికన్న ముందు మెదక్ జిల్లా విప్లవోద్యమం నుంచి వచ్చిన అద్భుతమైన విప్లవకవి. భూమి నా తల వెల నిర్ణయించు అని సవాల్ విసిరినవాడు. ఆయన కనకరాజుగా మెదక్ జిల్లా పీపుల్స్‌వార్ ఉద్యమానికి బాధ్యతవహించినవారిలో ఒకడు. 89-90 ఘర్షణల కాలంలో ఆయన నాయకుడు. రెండు పార్టీల మధ్యన ఐక్యత కృషిలో స్వయంగా పాల్గొన్నాడు. ఆయనను స్మరించుకోవడం అమర్ నిర్వహించిన ఒక ఐక్యతా చైతన్య కర్తవ్యం.

1980లలో సిరిసిల్లా తాలుకా కొండాపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ అమర్ కవిత్వంలో చాలా సందర్భాలలో ప్రస్తావనకొస్తుంది.తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడి వసంత నాగేశ్వరరావు హోంమంత్రిగా వున్నప్పుడు ఎన్‌కౌంటర్‌ల పరంపర ప్రారంభమైంది. కొండాపూర్‌లో పొలాల్లో నిద్రిస్తున్న దళసభ్యులను కాల్చి చంపారు. అప్పుడు నేనుకూడ పొలాలు మేల్కొన్నపుడు అనే కవిత రాసాను.

బాణమై బ్రతికినోడు

ప్రాణమాయెను ప్రజాపోరుకు అని చిన్నదే అయినప్పటికి ప్రాణం అనే పేరుతో చంద్ర పుల్లారెడ్డి స్మృతిలో ఒక కవిత వుంది. మన దేశ విప్లవోద్యమ నిర్మాతల్లో చారుమజుందార్, తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, కొండపల్లి సీతారామయ్యలతో పాటు ఆ తరానికి చెందిన విప్లవోద్యమ చిరస్మరణీయుడైన నాయకుడు సిపి.

కాల్పనిక ఆశావాదంతో పాటు అమర్ కవిత్వంలో చెప్పుకోదగింది వస్తు వైవిధ్యం. నీరు-మీరు, పేటెంట్ హక్కులు, నెహ్రూ జూపార్కులో సాకీ మృతి ఇట్లా ఆయన కవిత్వానికి వస్తువు కానిది లేదు.

విప్లవరచయితల సంఘంలో తనతో పాటు తనకన్న ముందు కవులుగా వుంటూ తనవలెనే విప్లవోద్యమంలో పనిచేసిన రిక్కల సహదేవరెడ్డి, నూతన్ వంటి వాళ్ళను చెరబండరాజును స్మరించుకోవడం కూడ ఈ సంకలనంలో వుంది.

1982-2004 మధ్యకాలంలో రాసిన ఈ కవితలకు అదనంగా 2006 జూలైలో కానూరి వెంకటేశ్వరరావుగారి కథగాని కథ చదువుతూ మధ్యలోనే కన్నీళ్లు తుడుచుకుంటూ రాసిన ఆత్మీయమైన కవిత కూడ ఇందులో వుంది.

శాంతి చర్చల కాలంలో తెలుగునేల నాలుగుచెరుగుల చాలా సభలు సమావేశాలు జరిగాయి. వేలనుంచి లక్షల సంఖ్యలో కూడ ప్రజలు వచ్చారు. అరవై వేలమందితో సెప్టెంబర్ 11, 2004న వేములవాడలో జరిగిన కామ్రేడ్ జె.పి. ఆరవ వర్ధంతి సభకు అమర్ రాసి పంపిన కవిత చితాభస్మంలోంచి... ఆయన ఈ కవితాసంకలనానికి శీర్షికగా ఎంచుకున్నాడు. ఈ ఎంచుకోవడంలో ప్రత్యేకించి చంద్రబాబు పాలనలో తొమ్మిదిన్నర సంవత్సరాల విధ్వంసమే కాకుండా చెక్కపెల్లి నుంచి నూకల మర్రి దాకా మాదాపురంనుంచి పద్మక్కలదాకా ఎన్‌కౌంటర్‌ల నుంచి కోవర్ట్‌లదాకా రాజ్య హింస విధ్వంసాల ప్రస్తావన వుంది. అయితే ఇంతటి హింసా విధ్వంసాలనుంచి చితాభస్మం అయిపోయి కూడ పునర్నవిస్తామని చెప్పడమే ఈ సంకలనంలో సందేశం.

జంపన్న చెరువులో ఊటలై
దుమాల బడిలో పాఠమై
దసరా నాటి పాలపిట్టలై కనబడ్తాం
నిమ్మపెల్లి దొరల భూముల్లో విత్తిన విత్తనాల్లో
అభావం చెంది పచ్చని పంటలమవుతాం
తరాలుగా ఇంకిపోయిన మా చెమట చుక్కల్లో భూగర్భ జలాలై
పొంగి
సనుగుల మాటు కాల్వగుండా నీటిధారలై పారుతాం
నిలువెత్తు నిజాల వెలుగుల్ని నీవు ఆర్పాలనుకున్నప్పుడల్లా
మేము కొయ్యూరులోఉదయిస్తాం

పాతికేళ్ళుగా తూట్లుపడుతున్న గుండె గాయాలను మాన్పుకుంటు కన్నీళ్ళతో తడిసిన పాటలన్నీ కలిపి ఏకరాగంలోపెట్టిన పొలికేక ఇది . అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ కొనసాగుతు పురోగమించే పీడితుల పోరాటమిది. పుడుతూ పోరాడుతూ గెలుస్తూ ఓడిపోతూ చితాభస్మాన్ని మట్టి దేహాలమీద దిద్దుకున్న ప్రతిఘటనా అక్షరాలు ఇవి.

– వరవరరావు

హైదరాబాద్
13-12-2007.

నా కవిత్వ నేపథ్యం

నా కవిత్వ కృషి-నేపథ్యాన్ని పుస్తకంలో కొన్ని పరిచయ వాక్యాలుగా రాసిమ్మని కొందరు సాహితీ మిత్రులు సూచించారు. ఒక విప్లవ కార్యకర్తగా 'నేను-నాది' అనే అస్థిత్వాన్ని ఎలా గుర్తించాలో తెలియని మీమాంసలోనూ, పాతికేళ్లుగా రాస్తూ వచ్చినవేవీ తిరిగేసుకోవడానికి అందుబాటులో లేకుండానే నేనిది రాయాల్సి వస్తుంది. దీన్ని నాస్వంత స్తోత్కర్షగా భావించరాదని సవినయంగా మనవి చేస్తున్నాను. విప్లవోద్యమ అవసరాల కోసం నావంతుగా స్పందించిన పాటలు, కళారూపకాలు, చరిత్ర రికార్డులు, వ్యాసాలు (రాజకీయ విశ్లేషణలు కాకుండానే) మొదలగునవి కొన్ని ముద్రితంగానూ, చాలావరకు అముద్రితంగానే ప్రజల్లోకి వెళ్లాయి. ఇవి నా విప్లవ రాజకీయ జీవితానికి ప్రతిబింబాలే గాకుండా ఒక్కొక్కసారి ఇవే నన్ను ఉద్యమంలో నిలబెట్టిన ఊతకర్రలు కూడా. ఈ అవినాభావ సంబంధమే నేనూ-నా కవిత్వం. అయితే నేను పాటలుగా స్పందించని అగాధాన్ని పూడ్చుకోవడానికే కవిత్వం రాసుకున్నాను. అయితే చాలాకాలం వరకు నాకు ఇది కవిత్వమని చెప్పుకునే ధైర్యమే చాలలేదు. ఇది కవిత్వమో! కాదో? పాఠకులే తేల్చి చెప్పాలి. విప్లవ సాహితీ ఉద్యమంలో దీని ప్రయోజనమెంతో విమర్శకులే నిర్దేశించాలి. మీ విమర్శనాత్మక వ్యాఖ్యానానికి నేను ఎళ్లవేలలా బద్దుడిగా ఉంటాను.

నేనొక సాదా-సీదా జాలరి కుటుంబలో చివరి సంతానంగా పుట్టాను. కాయ కష్టాన్ని, నిజాయితీని, ఇరుగు-పొరుగును, మంచితనాన్ని ప్రేమించడం నాకు కుటుంబ వారసత్వంగా అబ్బింది. ఎడ తెరిపిలేని దగ్గును, తీవ్రమైన కడుపునొప్పిని లెక్కజేయకుండా ఎముకలు కొరికే చలిలోనూ, కుండపోత వర్షంలోనూ మా నాయిన చేస్తున్న కష్టం, రెక్కలు ముక్కలు జేసుకుంటూ మా అమ్మ పడ్తున్న ఆరాటం మా ఇంటిల్లిపాదికి అబ్బింది. అన్న రాజన్నతో సహా మా కుటుంబమంతా పని చేస్తూనే చదువుకునేటోల్లం. నాకు ఊహ తెల్సినప్పటినుండి పదవతరగతి పూర్తయ్యేవరకు (అప్పుడు మా ఊర్లో కాలేజీలేదు) మా నాయినకు తోడుగా షికారికి (చేపల వేటకు) పోయేవాడిని. చేపల వృత్తి మెలకువలన్నీ నేర్చుకున్నా "సదువుఖరాబుగావద్దు బిడ్డా" అని మా నాయిన నాకు గోస (కుల వృత్తిలో ఇచ్చే మొదటి వాటా ఇది 1/4) కూడా పెట్టలేదు. చదువుకోసం పుట్టిన ఊరును విడిచిపెట్టేవరకు మా అమ్మను వదిలిపెట్టి ఒక్కరోజు కూడా ఉండలేని అనుబంధం మాది. మొదటినుండి నాకు కులపోళ్లు, కుటుంబం, స్నేహితులనుండి దొరికిన ప్రేమ ఆదరాభిమానాలు ఉద్యమ సహచరులనుండి కూడా లభించాయి. ప్రజలు

తమలో ఒక్కడిగా చూసే ఎల్లలేవు. ఇవే నన్ను-ప్రపంచాన్ని పరస్పరం దగ్గరకు చేర్చాయి. బహుశా ఇదే నన్ను ప్రతి ఉద్యమ మలమలుపుల్లోను, నిర్బంధాల్లో, త్యాగాలోనూ, ప్రేమ-ఆర్తితో స్పందించే సాహిత్య కార్యకర్తగా కూడా మలిచిందనుకుంటాను. అయితే నా కవిత్వంలో సాదారణ పదప్రయోగాలు తప్ప సాహిత్య మెలకువలు ఉండవని నేను అంగీకరిస్తున్నాను. ఇది విప్లవోద్యమంలోనూ, నాలోనూ చెలరేగిన సంఘర్షణల రికార్డుగా, ఒక చారిత్రిక క్రమానికి ప్రతిబింబంగా మిగిలినా, దీని ప్రయోజనం నెరవేరినట్లేనని నేను భావిస్తున్నాను.

నక్సల్బరీ-శ్రీకాకుళం ఉద్యమాలు బద్దలయ్యే నాటికి నేను చిన్న వయసులో ఉన్నాను. అయితే వీటి ప్రభావం తాలూకు ప్రేరణ, పాఠకరూపంలో, మాటల రూపంలో అన్న ద్వారా నా చెవులకు సోకింది. దీంతో అత్యవసర పరిస్థితికి ముందే మా ఊర్లో ఉచిత పాఠశాలల్లో పాఠాలు, పాటలు నేర్పించడానికి దారి తీసింది. సిద్ధాంతాలు తెలియకున్నా పాటలకు పోరాట యోధులపై వీరోచిత అభిమానాలకు (Hero worship) ఆకర్షింపజేసింది. ఆ తర్వాత గ్రామా స్నేహితులమంతా కలిసి ఆదర్శకళాసమితి పేరిట ప్రతిఏటా సెలవుల్లో నాటకాల ప్రదర్శన చేసేవాళ్లం. 'జనం మేల్కొన్నారు జాగ్రత్త' లాంటి అభ్యుదయ నాటకాలు వేసినా, అత్యవస పరిస్థితి చివర్లోనే పార్టీతో రాజకీయ సంబంధం ఏర్పడ్డది. అప్పటివరకు పక్కనే మాదిగవాడలో చిందు భాగోతాల ప్రదర్శన, పీరీల అల్వాముందు దూలా ఆట, దసర పండుక్కు కోలాటం, బతుకమ్మ పండుగకు పూలసేకరణ, గొట్టాలాట అని పండుగుకి దేవుని సేవ (పల్లకి) మోయడం, దేవుని రథం లాగడం లాంటివ్వన్నీ మా ఊరు దాటే వరకు నాలో విడదీయరాని భాగాలు.

దేశమంతా ఎమర్జెన్సీ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా వెల్లువెత్తిన ప్రజాస్వామ్య ఉద్యమాల నేపథ్యంలో బద్దలైన సిరిసిల్ల, జగిత్యాల ఉద్యమాలు చారిత్రక ప్రాముఖ్యతను సాధించుకున్నాయి. పిడికెడుమంది భూస్వాములను ఏకాకులను చేసి విశాల జనాసామాన్యాన్ని ఏకతాటిపై నిలిపిన వర్గ పోరాట ఉదృత్తి సరైన ప్రత్యామ్నాయంగా ముందుకొచ్చింది. శ్రీకాకుళం గోదావరి లోయల ఉద్యమాల కొనసాగింపుగా ముందుకువచ్చిన ఈ రైతాంగ పోరాటాలు కల్లోలిత ప్రాంతాల ప్రకటనతో ప్రారంభం నుండి రాజ్యం దమనకాండను ఎదుర్కొన్నాయి. భూస్వామ్య పీడనను రాజ్యం అణచివేతతో ప్రారంభం నుండి ప్రజారాశులతో ప్రకటిస్తూ నిలదొక్కుకున్న ఈ పోరాటం దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా అన్ని రంగాల్లో స్పష్టమైన విభజన రేఖను గీసింది. ప్రజాసాహిత్యం, కళారంగాలకు కూడా ప్రజాస్వామీకరించింది. విప్లవ రాజ్యకీయాలు, వర్గపోరాటాల్లో సానదేరడంతో అటు ఉద్యమంలోనూ, ఇటు స్వీయాత్మక శక్తులైన పీడితవర్గ-కుల ప్రజల్లోను గొప్ప ముందడుగును సాధించింది. తెలంగాణ సాయుధ పోరాటంలో మొగ్గతొడిగిన కళారూపాలన్ని నిర్దిష్ట రాజ్యాధికారసాధన లక్ష్యంతో పదునెక్కినాయి. ఆనాటి 'భూమి భాగోతం' నాటిక వాస్తవరూపంలో ఊరూరి భాగోతమై కళ్లకు కట్టింది. ప్రతి నోటా పోరాట పాట ప్రవాహమైన పరవళ్లు తొక్కింది. సిరిసిల్ల, జగిత్యాల ఉద్యమాలలో వెల్లువలో

నేను విద్యార్థి కార్యకర్తగా ఉన్న వందలాది గ్రామాలతో ప్రత్యక్ష అనుబంధం ఏర్పడింది. వందలవేల ప్రజలతో, వందలాదిమంది రైతాంగ యోధులతో ఆత్మీయ సంబంధాన్ని సహచార్యాన్ని తెచ్చిపెట్టింది. కల్లోలిత ప్రాంతాల ప్రకటన నుండి 1985 ఏప్రిల్ 1లో కొండాపురం సామూహిక ఎన్‌కౌంటర్ వరకు అన్ని ఉద్యమమూల మలుపుల్లోను నన్ను సాహిత్యపరంగా కూడా పెనవేసుకుంది. కామ్రేడ్ ముదాం రామన్న, నట్ట రాజ్యం, జీవన్ (భూపతి రెడ్డి), విఠల్ అన్న, ఎస్సార్ (రాజమల్లు) లాంటి ఎంతోమంది వీరయోధులతో ఆత్మీయ సంబంధాన్ని, సహచర్యాన్ని తెచ్చిపెట్టింది. ఇదే నన్ను 1978లో సిరిసిల్ల, జగిత్యాల కల్లోలిత ప్రాంతాల పక్కన, 1980 జనవరిలో సిరిసిల్ల పోలీసు కాల్పులు, 1985 ఏప్రిల్లో కొండాపూర్ సామూహిక ఎన్‌కౌంటర్ హత్యాకాండ లాంటి అన్ని ఉద్యమ మలుపుల్లో స్పందించే సాహిత్య కార్యకర్తగా పెనవేసుకుంది. ఉద్యమ విస్తరణలో భాగంగా మెదక్, ఉత్తర తెలంగాణ, సింగరేణి, బీడీ కార్మికోద్యమ బాధ్యతలో వెళ్లినా, గోదావరి లోయ తదితర రాజకీయ బాధ్యతలతో పాటు సాహిత్య కృషి - అనుబంధం దండంలో దారంలా అల్లుకుంది. ఈ కృషిలో మెదక్ జిల్లా ప్రత్యేక కార్యస్థానం అయ్యింది. సింగరేణి ఉద్యమంలో అయితే ప్రజాకళలు విడదీయలేనంతగా ముడివేసుకున్నాయి. కామ్రేడ్ నీలం రామచంద్రన్న, బొల్లవరం ప్రజా కళలో సైతం ఒక వరం లాంటిదే.

నాకు రాజకీయంగా గురుతుల్యులు అయినవాళ్లు, నా సమకాలికులు, నాకంటె చిన్నవాళ్లు కూడా ఉద్యమంలో నేల రాలుతున్నప్పుడు వారందరిని స్మరిస్తూ చిన్న చిన్న కవితలు కూర్చి అమరుల చరిత్ర రాస్తు 1987 లో "కొన్నెత్తుటి దారుల్లో" అని కరీంనగర్ అమరువీరుల చరిత్రను రాశాం. ఆ తరువాత ఉత్తర తెలంగాణ అమర చరిత్రతో "ఆకురాయి" అనే పుస్తకాలు వెలువరించాం. కామ్రేడ్ రంగవల్లి అమరత్వం తరువాత ఒక చిన్న నృత్య రూపకం తెలంగాణపై మరో రూపకం, ఎన్నికల పై రాసిన వ్యంగ్య నాటకాలు చాలా వరకు ప్రజల్లోకి వెళ్లలేకపోయాయి. గోదావరి లోయ అమరుల చరిత్ర 'గోగు పూలు' మధ్యలోనే ఆగిపోయింది. 1992 తర్వాతే "మానేటి పాట" అనే మొదటి పాటల సంకలనం వెలువడ్డది. 1/70 చట్టం రద్దుకు నిరసనగా "అడివంటుకుంది" అనే బ్యాలే రాసివ్వగా అరుణోదయ వాళ్లు వివిధ ప్రదర్శనలిచ్చాము. సారా ఉద్యమం సందర్భంగా రాసిన "స్త్రీ విముక్తి", నృత్య నాటిక అచ్చురూపంలోనే రావడమే కాక వందలాది ప్రదర్శనలు ఇవ్వబడ్డాయి. 'సారాబంద్' అనే నృత్యగానం తిరుపతి మహిళా కాన్ఫరెన్స్‌లో ప్రదర్శించిన తరువాత మహిళా కార్యకర్తలు దానిని ఎక్కడో పోగొట్టారు. 'ప్రతిఘటనా స్వరాలు', 'ఆకురాయి'లతో మొదలై అమరుల త్యాగాలు స్మరిస్తూనే సమకాలీన రాజకీయ సామాజిక అంశాలన్నిటిపై అరుణోదయ వెలువరించిన సుమారు 50 క్యాసెట్ల లోనూ నాపాటలున్నాయి. 'స్నేహం', 'మోదుగపూలు', 'శినుకూ - శినుకూ' లు కేవలం మిత్ర పాటల ప్రత్యేక క్యాసెట్లుగా అరుణోదయ సాంస్కృతి సమాఖ్య వెలువరించింది. 'త్యాగాల

చిరునామ', 'నేలకొరిగిన మహేంద్రతనయ', 'రగల్‌జెండా రంగవల్లులు', 'షహీద్ చౌక్' లతో పాటు 'తెలంగాణం' లాంటి చిన్న చిన్న పాటల పుస్తకాలు అరుణోదయ ప్రచురించింది. ఈ సందర్భంగా అనేక మంది కార్యకర్తలు రాయడం, పాడటం అనే కృషితో ఉత్సాహంగా ముందుకొచ్చారు. ఆర్.ఎస్.ఎస్., ఎ.బి.వి.పి హిందూమతోన్మాద గూండా దాడుల నేపథ్యంతో పి.డి.ఎస్.యు. రాష్ట్ర కమిటీ ఒక సైద్ధాంతిక రాజకీలియ విశ్లేషణ రాయమని నాకు నిర్దేశించింది. ఇది 1984లో "వేయి పడుగల విషపు నీడలు"గా వెలువడ్డ చీలికలు, పేలికలు, విప్లవ సంస్థల మధ్య భౌతిక ఘర్షణలు, రాజ్యం నిరంతర దాడుల మధ్య సైద్ధాంతిక కృషి ముందుకు సాగలేదు. ఇదంతా పోరాట సాహిత్యం. సుద్దాల హనుమంతుల నుండి కానూరి తాతల వరకు సుబ్బారావు పాణిగ్రాహి నుండి దివాకర్ సముద్రుడు, నూతన్, సాహూ, సహదేవ్, గోపి (తోటమల్లేషం) లాంటి వాళ్లే కాక నాకు పేర్లు సైతం తెలియని ఎంతో మంది కలం యోధుల కృషి ఉద్యమంలో సజీవ శక్తిలా అల్లుకొనే ఉంది. ఈ కృషిలో అమరులైన వారందరికీ నా వినమ్రపూర్వమైన జోహార్లు తెలుపుతున్నాము. అయితే ఉద్యమ ఆటుపోట్లు, నాలో అంతస్సంఘర్షణ, కుటుంబ నేపథ్యం, తెలంగాణ జనజీవనంలోని ప్రత్యేకతలు, విద్రోహం, జనశక్తి నిమజ్జనం (పోలీసులు చేసిన కర్మకాండ), ప్రభుత్వంతో చర్చలు, చర్చల సహచరుడు, రియాజ్ దారుణహత్య, విప్లవకారుల మధ్య సంబంధాలు ఇలా పాటలుగా నేను స్పందించని చోటనే కవిత్వంగా రూపు దిద్దుకుంది. సమష్టిగా మరో పార్శ్వమైన ఒంటరి ప్రయాణంలో కవిత్వమొక చిన్న మజిలీ. గుండె చెరువయినప్పుడల్లా నేనిక్కడ సేదదీరుతున్నాను.

కరీంనగర్, మెదక్ జిల్లాలతో ప్రత్యక్షంగా ముడిపడ్డ ఉద్యమ సాహిత్య జీవితంలో అమరులు కామ్రేడ్ నూతన్ (పవన్, జనన్న), రిక్కల సహదేవ రెడ్డి (రిసారె) లు ఆత్మీయ సహచరులు. వారి విప్లవ జీవితమంతా అనువనువునా నేను పెనవేసుకుని ఉన్నాను. ఉద్యమ విజయాలు- అపజయాలు, కష్టసుఖాలు, కవిత్వం, మాండలికం మొదలగు అనేక విషయాలు జనన్న నేను కలబోసుకునేటోల్లం. చాలా కాలం పనిచేస్తూ సాహిత్య అభిరుచులు కూడా కలిసి మా మధ్య ఉద్వేగపూరితమైన స్నేహం ఏర్పడ్డది. అలమరికలు లేకుండా కలగలిసిపోయే ఇలాంటి సహచరుడు ఇక దొరకడేమో! కామ్రేడ్ సహదేవ రెడ్డి నాకు కలవాల్సిన కంటే ఒక రోజు ముందే ఒక విద్రోహి సమాచారంతో పోలీసులకు చిక్కాడు. కత్తుల బోనులో సంచరిస్తు విద్యార్థి ఉద్యమ బాధ్యతను చూస్తున్న సహదేవును సుతిమెత్తని కథ చదవడం కోసం ఎదురు చూస్తుండగా భయంకరమైన ఎన్‌కౌంటర్ వార్తను వినాల్సివచ్చింది. వీరిద్దరూ అమరులైన తర్వాతనే వారి సంకలనాలు 'వెదురు వనాల గానం' (నూతన్), 'రక్త చలన సంగీతం' (సహదేవ రెడ్డి) లను విరసం ప్రచురించింది.

అవకాశవాదాలను అటుపోట్లను ఎదుర్కొంటూ నూతన్, సహదేవరెడ్డి, శ్రీను తదితర ఉద్యమ సాహితీ సహచరులమంతా కలిసి 'నూతన్ సాహితి' అనే పత్రికను కొంత కాలం నడిపాము. 'జనసాహితి' కరీంనగర్ జిల్లా పోరాట ప్రత్యేక సంచికను వెలువరించాం. మిత్రుడు

శశితో కలిసి రాసిన పాటలు, పాండవుల కథ బాణీలో కామ్రేడ్ సి.పి. పై రాసిన రూపకం మరిచిపోలేని ఘట్టాలు. పసితనంలోనే తల్లిదండ్రులు దూరమై ప్రజల ముద్దుబిడ్డగా పేరు గాంచిన కామ్రేడ్ గోపి (తోట మల్లేషం) బూటకపు ఎన్‌కౌంటర్ తర్వాతనే అతని 'అనాథ జనగానం' సంకలనం వెలువరించాం. మెదక్ అమరవీరుల చరిత్ర, పలువురి నూతన కవుల సంకలనాలు, సాహిత్య కృషి ప్రత్యేకంగా సాగింది. గోదావరిఖని కేంద్రంగా వెలువడ్డ 'సింగరేణి' 'నల్లకలవలు' క్యాసెట్ల పాటల పుస్తకం, తెలంగాణ జనజీవనాన్ని గళమెత్తి పాడే కళాకారులు, ఇదంతా ప్రజా ఉద్యమ అపార సంపద. కొయ్యూరు మృతవీరున్ని తలచినా, కడివెండి పోరాటపు వారసులు కామ్రేడ్ సంతోష్ - యాదగిరిలను ఎలుగెత్తి చాటినా, కృష్ణమ్మ గలగలల్లో సామన్న - ఎంకన్నను వీక్షించినా, గోదావరి లోయ వీరులు భరత్, రంగవల్లి, చంద్రంలను కొలిచినా, గోదావరి దాటి సిరివంచి చేరిన కొమురన్నను పిలిచినా, గోరుకొయ్యగా పొడిచిన వీరన్నను ముద్దాడినా, రాయలసీమ రత్నాలను దోసిల్లకు ఎత్తుకున్న గెరిల్లా యోధులు వడకాపురం చంద్రమౌళి, రాజమౌళి (ప్రసాద్), దగ్గు రాజలింగంలకు జై కొట్టినా ఇదంతా పోరాటానికీ - త్యాగానికీ - పాటకూ ఉన్న పరస్పర సంబంధమే. ఆ సంబంధమే అనేక మందిని ఉద్యమ కవులుగా మలిచింది. అందులో నేను ఒక్కడిని.

తొలినాళ్లలో నా పాటలను ప్రోత్సహించిన హెచ్‌ఆర్కెగారు, సదా ప్రేమాభిమానాలు చూపిన నారాయణస్వామి, విమలక్కలు, ఇంకా సుధాకిరణం, లెల్లె సురేష్‌లు, గోరా సంపత్‌లు, విరసం కరీంనగర్ సభ్యుడు అమరుడు అనిశెట్టి ప్రభాకర్ వీళ్లే నా విరసం సహచరులు. చర్చలకు వచ్చే సందర్భాగాన్నే గద్దర్, వరవరరావు, కళ్యాణ్‌రావు గార్లతో, వేణుతో పరిచయం ఏర్పడ్డది. ఆ సందర్భంగానే మైనారిటీల సమావేశంలో ప్రొఫెసర్ జయదీప్, తిరుమల రావు, పాశం యాదగిరి గార్లతోనూ, గౌరీశంకర్‌లతో మాటా మంతి కలిసింది. ఆంధ్రప్రభ జర్నలిస్టుగా నన్ను ఇంటర్వ్యూ చేస్తూనే మిత్రులు గౌరీశంకర్ కవిత్వ సంకలనం ప్రతిపాదన చేశారు. నా మాతృ సంస్థ విరసం, ఈ బాధ్యతను స్వీకరించింది. అయితే గూడా అంజన్న, గోరెటి ఎంకన్నల పాటల్లోని జనజీవితాన్ని పూర్తిగా అందుకోలేని, వందలాది అమరుల కొలుపులు, ప్రజల బాధలు-పోరాటాలే నా పాటలు. చారెడు కన్నీళ్లతో పాటు మునిగి తేలితే కవిత్వం నాకు ఓదార్పు నిచ్చింది. అయితే నిత్యం నెత్తురోడుతూ నేడు ఎదుర్కొంటున్న సమస్యలకు, సవాళ్లకు తిరిగి ఉద్యమమే కాదు విప్లవ సాహిత్యం కూడా సరికొత్త దారులు వెతకాలే. ఆలోచనతో గెంతువేస్తు నవతరం నడుంకట్టాలే.

నేను ప్రజాయుద్ధంలో నిరంతర సైనికుడ్ని కాలేని ఒక విప్లవ రాజకీయ కార్యకర్తను. ఆర్థికాంశాల కేంద్రీకృత వ్యక్తీకరణయే రాజకీయాలని, రాజకీయాల కొనసాగింపే యుద్ధం అని నమ్ముతున్నవాణ్ని. విప్లవాత్మక మార్పులకు, సాయుధ పోరాటం, సాధన తప్ప అదే ఆశయం కాదు. నా ప్రస్తానపు తొలిదినాల్లో కమ్యూనిజాన్ని శాశ్వత శాంతి-సమానత్వ

స్వరూపంగా గుండెల్లో ఆవిష్కరించుకున్నాను. యుద్ధం తరువాతే శాంతి అనే గతితార్కిత సత్యం కళ్ల ముందున్న అలాంటి శాశ్వతమైన శాంతే నన్ను కట్టిపడేస్తుంది. అత్యుత్తమ మానవ సమాజపు విలువలను ప్రతిబింబిస్తూ, కమ్యూనిస్టు విప్లవకారులు అనివార్యమైన సామ్రాజ్యవాదపు యుద్ధాన్ని, దోపిడీవర్గ రాజ్యహింసను ప్రజాయుద్ధం ద్వారా ఓడిస్తు ప్రజారాజ్యాధికారాన్ని నెలకోల్పాలి. అందుకే శాశ్వత శాంతి సమానతలకు ప్రతిబింబంగా కరుణరసం నాకు తెలియకుండానే నా సాహిత్యంలో వచ్చి చేరిందని నన్ను నేను తరచి చూసుకుంటున్నాను. నేను అలిసిపోయినప్పుడల్లా అలసటెరుగని సిపాయిలా నాయిన తోపెల (చేపలుపట్టే సాధనం) భుజానవేసుకుని వస్తాడు. నాకు కోపం వచ్చినప్పుడల్లా శాంతమూర్తిలా గరుకు అరచేయితోమా అమ్మ తల నిమురుతుంది. నాకు పిరికితనం ఆవరించినప్పుడల్లా అమరుల త్యాగం నాకు ధైర్యాన్నిస్తుంది. అంతా భస్మం అవుతున్నప్పుడుల్లా అందునుండే ఉద్యమ ఫినిక్స్‌పక్షి పుట్టుకొస్తుంది. 'ఆకురాయి' ఆశలకు పదును పెడుతుంది. విద్రోహం మనసులో గుచ్చుకొని కలుక్కుమన్నప్పుడల్లా విశ్వాసం వెన్నుతడుతుంది. ఆశలన్ని ఖైదుచేయబడ్డప్పుడు ఆలోచన బంధవిముక్తం అవుతుంది. నా ఒంటరితనాన్ని ఛేదిస్తూ ఒక స్వరం వెన్నంటి వస్తుంది. బహుశా మనిషి అంతరంగాన్ని ఆవిష్కరించేది కవిత్వమేనేమో అనిపిస్తుంది. అంతరంగం లోంచి బాహ్యప్రపంచంలోకి, బాహ్యప్రపంచంలోంచి అంతరంగం లోనికి ప్రయాణిస్తూ సమాజంలోని భౌతిక-బౌద్ధిక సంఘర్షణను కవిత్వం ప్రతిబింబిస్తుంది. ఇదంతా నేను తరచి చూసుకోకుండానే ఒక ప్రవాహంలో కొట్టుకు వచ్చాను. అలా కొట్టుకువచ్చి గడ్డకుపడ్డ కవితలు మీముందున్నవి. వీటిని సమీక్షించేది మీరే.

విప్లవకవిగా విప్లవోద్యమ పురోగమనమే నా సాహిత్య కృషికి-అభివృద్ధికి కొలమానంగా ఉంటుంది. నేనుగా మనిషిని, మనుసును, జీవితాన్ని, సమాజాన్ని, ఉద్యమాన్ని చదువుకోవడంలో ఇంకా ఓనమాలే పూర్తి చేయలేదు. వీటన్నింటి సమష్టి వ్యక్తీకరణయైన వర్గపోరాటపు ఒక పార్శ్వం దగ్గర నిలబడ్డాను. అందుకే నా కవిత్వం పాక్షికమైనది. వర్గ పక్షపాతమే కాదు, బ్రాహ్మణిజం విధించిన సాంఘిక కట్టుబాట్లలో నల్లోడు(నలుపు) అనే ముద్ర వేసుకుని పరిమితుల్లో భిగించవడ్డటువంటిది. అంతేకాదు నేను పుట్టిపెరిగిన ఉద్యమం దిగుడును, తాత్కాలిక స్థబ్దతను దిగుడును తద్వారా వచ్చే తప్పుడు ధోరణులను ఎదుర్కొంటుంది. ఇలాంటి స్థితిలో అటు ఉద్యమపరంగానూ, ఇటు కవిత్వపరంగానూ, ప్రామాణికతను పొందడానికి సంఘర్షించాల్సి వస్తుంది. విప్లవోద్యమం ఎగుడు-దిగుడులగుండా పయనిస్తూ అంతిమంగా గుణాత్మక పరివర్తనకు ఎదగనప్పుడు, చీలికవాదం సినిసిజం, స్థబ్దత సహజ పరిణామంగా ముందుకు వస్తున్నాయి. దీనిని బద్దలు గొట్టేవిప్లవ ప్రవాహంలోనే విప్లవ సాహిత్యం తిరిగి కొత్తపుంతలు తొక్కగల్గుతుంది. అన్ని అస్థిత్వ ఉద్యమాలను ప్రజాస్వామ్యీకరించి వర్గపోరాటంతో దాని అత్యుత్తమ రూపమైన సాయుధ పోరాటంతో అనుసంధానం చేసే కొత్త శక్తిని, శైలిని విప్లవోద్యమం

పుణికిపుచ్చుకోవాలి ఆకాంక్షిస్తున్నాను. ఎన్నో పోరాటాల తర్వాత కూడా భేతాలుని లాగ చెట్టుకు వేలాడుతున్న కులాన్ని, అది వేలాడుతున్న చెట్టును కుల్లబెరికే శాస్త్రీయ కార్యక్రమం కవిత్వంలోనూ ప్రతిబింబించాలి. ఆకాశంలో సగం పోరాటంలో భాగమయ్యేలా మన కృషి సాగాలి.

వస్తుగత స్థితియే చైతన్యాన్ని నిర్ణయిస్తుంది. ఆ చైతన్యమే తిరిగి వస్తుగత స్థితిని కూర్చే భౌతిక శక్తి అవుతుంది. ఈ మార్పు గుణాత్మక మార్పుగుండా గెంతువేయకుండా, విప్లవ సాహిత్యం కూడా నూతన గెంతు వేయలేదు. ఆ గెంతుకోసం ఆంగలుసాచే స్థితిని రిహార్సల్ చేస్తూ భవిష్యత్తును వెతుక్కుందాం. ఆ మార్పుకోసమే తమవిలువైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి, నాకూ నా పాటలకు కవిత్వానికి ప్రాణం పోసిన అమర వీరులకు ఈ కవితా సంకలనాన్ని అంకితమిస్తున్నాను.

విప్లవాభినందనలతో
అమర్

అధికారపు మంచుపల్లకి

వాడి అధికారపు మంచుపల్లకి
పార్లమెంటుకు అధ్యక్ష భవనానికి చుట్టూ
ఒక్క ప్రదక్షిణైనా చేయకముందే కరిగిపోయింది.

నిన్న చలిలో గడ్డ కట్టుకున్న ఈ అధికారం
నేడు పొడి ఎండకే కరిగి ఆవిరై పోయింది

ఐదేండ్ల ప్రజాస్వామ్య పంట ఏడాదిలోనే
పండీ పండక ముందే పరిగ్గైపోయింది

ఇక రేపు ఏ ఓట్ల భూమిని దున్నాలో
ఎన్ని సారా కాల్వలు కట్టాలో
ఎన్ని నోట్ల ఎరువులు చల్లాలో

పండబోయే పది పిచ్చి కాయలకు
ఎన్ని ప్రాణాలు బలిపెట్టాలో....

(1991 మార్చిలో పార్లమెంటు రద్దు వార్త విన్న తర్వాత..)

పదిపిచ్చికాయలు = పదవ పార్లమెంటు

అమ్మ

నా ఆత్మకథ విన సొంపుగా ఉండదయ్యా
నా జీవితమెవరికీ ఖండకావ్యం కాలేదయ్యా

బండయిపోయిన గుండెలనుండి
కారవయ్యా కన్నీళ్లు
అవి కారికారి ఆవిరయిపోయి
కర్తవ్యమొక్కటే మిగిలిందిప్పుడు

ఆత్మలేని లోకంలో అమ్మను నేను
అమ్మలేని లోకమే లేదనే నమ్మకస్తురాలను

కాళ్లు రెక్కలనే నమ్ముకున్న నేను
ఎవరి కాళ్లు కడుపులు మొక్కలేను
ఈపుకు గట్టుకున్న బిడ్డల గురించి
ఈది గడ్డకు పడ్డ కన్నీళ్ల గురించి
ఎన్ని ఆత్మకథలు చెప్పాలి?

ఏ ఆకలి పోరాటం వివరించాలి?
కన్నీళ్లు పిండుకుని
కష్టాలు ఆరేసుకున్న దాన్ని

అయ్యా...
బిడ్డల్ని గన్న తల్లినిరా! నేను తల్లిని!!

పాణమంతా ఆశ జేసుకుని
కండ్లల్ల వత్తులేసుకుని జూత్తున్న బిడ్డా
పోంగ దక్కినోల్లు మీరు
మీరే నా ముందూ ఎనుకా
మీరే నా రేపు – మాపు
బుద్ధి తెల్సినప్పటి నుండి కష్టమే గదా బిడ్డా
ఒక్కనాడు ఒంటినిండ బట్ట గట్టింది లేదు
కంటినిండ నిద్రపోయిందీ లేదు

ఓ భూమా జాగా
గీ రెక్కల కష్టం ఎంతజేస్తె ఏం మొదలైతది
ఈ జన్మకు సుఖమంటే ఏందో ఎరుగకపోతి
ఎట్లా రాసిండో ఆ దేవుడు రాత
అందరికీ చెయ్యితో రాస్తే నాకు కాలుతో రాసినట్టున్నాడు

ఆ దేవుని గుల్లో మన్నుబొయ్య
ఎట్లడుక్కచ్చుకున్నమో గిన్ని బాధలు

ఓ తల్లిగారింట్ల తప్పదాయె
అత్తగారింట్ల తప్పదాయె
బతుకంతా బండ సాకిరేగద బిడ్డా
చేసి చేసి నెత్తురంతా కలి కలయి
ఇగేం మిగిలింది బిడ్డా

గీ అలుకు పిడుసయిన పెయ్యిదప్ప
ఊడ్సి ఊడ్సి సీపురకట్టయిన దానికి
ఉతికి ఉతికి మసిపేల్కయి పోయిన దానికి

ఓ పండు గెరుకలేదు పబ్బ మెరుకలేదు
మంచినీల్ల బాయి గిరుకోలె
రికాం లేకుంట గిర్ర గిర్ర తిరుగుడే బిడ్డా –
ఒక్కనాడు నా ఇంట్ల తెల్లారలేదు పొద్దుగూకలేదు
మూలసుక్కకంటె ముందే లేసి
ఊడ్సి సల్లినమంటె ఇల్లు పరాయిదయితది
సంటిపిల్లలు కూడా పరాయోల్లవుతరు
బాల సంతోడు నన్ను తిట్టని దినం లేదు
ఆడెన్నడూ ఈ వాకిలి సానిపి దొక్కలేదు
నా పాడు చేతుల తోటి బిచ్చం ముట్టలేదు –

నా ఇల్లు చిమ్మంజీకటయి
బాపనోల్ల ఇండ్లల్లనే తెల్లారింది
ఆల్లిండ్లల్లనే సగం బతుకు అరిగిపోయింది బిడ్డా
పనోల్లంటె బాంచెగాల్లనుకుంటరు
చాయ్ తాగిన గిలాస తీయటానిక్కూడా
ఎల్లీ మల్లీ అని కేకలు
ఆల్ల చేతులకు జెట్టవుట్టిందేమోగానీ
నోరుమాత్రం మోరిలాగ పారుతూనే ఉంటది

బండెడు బాసండ్లు దోమి
అద్దం లెక్క కడిగేవరకు
అరచేతులు చూడు బిడ్డ
అడుగంటుకున్న గిన్నె లెక్క
మసిబారి పలిగిబర్కులు బర్కులయి
ఎట్లా రాయి చిప్పోలె మారినయో...
ఏళ్లే కొబ్బరి పీసులయి

సందులు గొందులు తిర్రేసి మర్రేసి
ఆల్లపూజ సామాన్లు తోమికడిగితే
అంటూ ముట్టని నీల్లు జల్లి తీసుకుంటరు
ఆల్లదేవుడు గూడ అయ్యగారిలెక్క ఎర్రగ బుర్రగనే ఉన్నడు
ఎంతమంది తోమితే తెల్లగయ్యిండో...?

లంకంత కొంపలు ఊడ్సి కడ్గి తూడ్సేవరకు
కండ్లు బైర్లు గమ్మి పెద్దలు యాదికొస్తరు
వాల్ల వాకిల్లూడ్సేటాల్లకు నడుములు ఒంగుమంటయి
పెండగలిపి పదిగోళాల నీల్లు జల్లి
ఆల్ల వాకిల్లు పచ్చగయ్యే వరకు
ఈ జబ్బలు పచ్చి పుండయి పోయినయి బిడ్డా
బాయిలనీల్లు మీదికన్నా లేవు
చేది చేది చేతులిరిగి పోయినయి
గాయిది పనిబిడ్డా గాయిది పని
బతుకు గానుగెద్దు లెక్క తిరుగుతూ
రోజూ గిదే గాయిది పని బిడ్డా
ఇంకా ఎనుకటి నుంచి గడీలల్ల దొరలకు సేవలు జేసి
పల్లకీలు మోసి, పయనాలు దీసి
అరొక్కపనులు మీదవడి నల్గి నారపీసయి
ఎట్టికి ఏగలేక ఎంతమంది దెంకపోయిండ్రనుకున్నవు
సగం గుడిసెలు తాటి కమ్మలతో సహా నడ్సిపోయినయి
పిల్లలో తెర్లు – తల్లులో తెర్లు
రెక్కల కష్టమేగదా బిడ్డా
ఏడ శారెడిత్తులు దొరికితె
గదే ఆల్ల ఊరయ్యింది

ఏం బతుకులో బిడ్డా
అటున్న పుల్ల ఇటు పెట్టరు
ముద్దపప్పు మంచినెయ్యి నాలుకూర్రలు....

మంచంల పండి ఆయాసమని అటూ ఇటూ బొర్రుతరు
తింటే ఆయాసం తినకుంటె నీరసం
ఏన్గసొంటి పీన్గులాల్లు
ఎట్లా ఇముడ్తదో తెల్వదుగని
మిట్టమిట్ట జూడంగా చిక్కటి చాయ
లొట్టెడు తాగుతరు
ఒక్కసుక్కనన్నా పట్టుమని పొయ్యరు
బాపనార్థమని బండిగీరంత ఇస్తార్లు గుట్టి
గుమ్మిదొడ్డున్న అయ్యగార్లకు
పదితీర్ల వండి పెడితే
ఆల్లు దినంగ మిగిలిందే మాకు ప్రసాదం
ఆల్లు జుర్రంగ మిగిలిందే మాకు తీర్థం
లగ్గాలు మూర్తాలయితే జూడాలే
ఉన్న కాడ్నించి కదలకుండానే ఆగమాగం జేస్తరు
మాకైతే ఇంటి పెండ్లికన్నా ఎక్కువ
ఎక్కువోల్లన్నట్టే గానీ
ఓ రీతుండదు రివాజుండదు
ఏడదిన్న దాడనే, ఏడ దాగిందాడనే
అవ్వన్నీ ఏరికడిగి సర్ది పెట్టాలె
ఇడ్సిన బట్టలు
గుట్టలకు గుట్టలుతికి సావాలె

మా బొక్కలు తెల్లగయితెనెగదా...
అల్ల బట్టలు మల్లెలయ్యేది
రికాం లేకుంట పనిజేస్తే సుదురాయించుతాది బిడ్డా
మూలకు వడితే మూడొద్దుల దాకా లేవం
కిందవడ్డమంటె అకానెటోల్లే లేరు
మందా మాకా ఇంత కలోగంజో దాగి
మా ఉగతోటి మేమే లేవాలె
కప్పు కన్నీల్లు పా2ముకుముద్దా బిడ్డా
కండ్లు పెయ్యి తిర్గుతుందని చెప్పినా
అల్లకేమన్న కనికరమా బిడ్డా
పొక్కిల్లువడ్డ ఆకిండ్లతోని
మూలకు వడ్డ బాసండ్లతోని
జిడ్డువట్టి మసి పేల్కలయిన బట్టలతోని
"మూడు రోజులనుండి మురికితో చస్తున్నాం
అప్రాచ్యపు అవస్థ"లంటూ
ముక్కుమూసుకుని ఎదురొచ్చి పిలుస్తారు
తొడమీద అగ్గివడితే
తోట రాముడా తీసిపోరా అనే బాపతు
ఈ కొవ్వెట్లా అరుగుతదో
ఈ కావురమెట్లా తగ్గుతదో
బతికుంటె కండ్లతోనే చూడాలనుంది నాయినా

మాకు రికామెక్కడిది బిడ్డా
పొద్దుమాపు బోల్లు దోమితే సరిపోతాది
ఆల్లేమన్నా వందలిస్తరా వేలిస్తరా

సలిదో బులిదో ఇంత బువ్వ దొర్కతదనే ఆశ తప్ప
ఉప్పుతోని తొమ్మిది కొనుడేనాయె
ఊకెనే ఎల్తాది బిడ్డా
పుల్లేరబోవాలె పెల్లేర బోవాలె
నాటెయ్య బోవాలె
వంగిన నడుములు దించకుండా పనిజేత్తె
ఏం కైకిలి గిడ్తది బిడ్డా
గుత్తకు పోకుంటె చేసిన కష్టమంతా ఉట్టిదే
కల్పులు కోతలు మోతలు
కాలం మీద నాలుగిత్తులో కొత్తలో సంపాయించుకుంటేనే
కూలినాలి బతుకుతం బిడ్డా
కాలం కాలుమర్రేత్తే
సేసుకొని బతికెటోల్లకు చేతులిరిగినట్లే
తవ్వెడలికితే సోలెడు పండితే రైతెట్ల బతుకాలె కూలెట్లా
గతుకాలే

జోల్లు దీసి కంకులు గొట్టే కాలం సుద్దామన్నాలేదు
ఆడాడ గుంటూరోల్ల సేన్లన్ల పత్తులు, మిరపల పనీ
దొరుకుతుంది
మా ఊరు దుక్కులకు మేము దూరమైనం
మా దుక్కులల్లో గుంటూరు మొక్కలైనయి
మా ఇంటి వాకిల్లన్ని పొక్కిల్లయినయి
దొరలు దాతల ఇండ్లు పచ్చబడ్డయి
జీవితమంతా తారుమారయిన చోట
కొత్త కొత్త పనులకోసం కోసులదూరం నడవాలె
రాగల్లలో సాల్లు పట్టుకుని ఎండల్లో ఏగుతుంటె

గొడుగు కింద నిలబడి అడుగుతియ్యని ఆంధ్ర పటేలమ్మ
"కోయండమ్మ కోయండి ఏరండమ్మ ఏరండ"నే కేకలు
బాకులోలె కుచ్చుకొంటున్నాయి
పనిచేయించుకునేటప్పుడు నోరొస్తుంది కానీ
కైకిలేసేటప్పుడు మాత్రం చేతులు రావు
కూలి ఒడి నిండకున్నా పనికి పోకుంటె
బతుకు తెల్లారుతాది బిడ్డా

ఏం పనులు లేనప్పుడు పొయిల కట్టెలకు పోవాలె
పిడుకలేర పోవాలె
వాగుల సుర్ర, సుర్ర కాల్లు గాలుతుంటె
పబ్బలకు పోయి కోసి రాసిబోసి
నిలువెత్తు మోపుగట్టుకుని
దించకుండా ఇంటికొచ్చేటప్పటికి
సుట్ట బట్టకూడా మాడపట్టుకంటుకు పోయింది
మెడలిరిగి నడుములు ఠింగుమన్నాయి
మోపు దించంగనే గాలిలో లేసినట్లుంది
గొండ్లోల్లు కొట్టేసిన తాటిమట్టలన్ని ఏరుకుని
ముండ్లు కుచ్చుకుండ పేర్చి మోపుగట్టుకుని
రోజు మూడుసార్లు తాళ్ళకు ఈదులకు ఇంటికి
బండోలె దిర్గకుంటె
కండ్లనిండ కట్టెల రాశి ఏడుంటది బిడ్డా
ఏది లేకున్నా పాణానికి తురితి ఉండదాయె
పొయిలకట్టె కదులకుంటె
పొయిమీద కుండేం పనిచేస్తది

కందెనవెట్టి వడ్లు దంచుకుంటిమి
కంచుడు నిండా కారం నూరుకుంటిమి
మక్కలో జొన్నలో గట్కిసురుకుంటిమి
పెసర్లేంచి పోటు వెట్టుకుంటిమి
కట్టెలు, పిడుకలు చేతుల కష్టమేనాయె
గింత ఉప్పు, నూనె, బట్టలు కొనెటాల్లకే
యాడాది కష్టమంత ఊడ్సుకుపోతంది
కాల్లు చేతులు ఆడిచ్చెటోల్లకు
మూడొద్దులద్దిన్నా ఇముడిచ్చుకుంటున్నాము
కష్టం జేసి తెచ్చింది పారెయ్య బుద్ధవుతదా బిడ్డా

ఆశలు వెంచుకున్న కొడుకులు అవ్వనిడ్సి
ఆయినిడ్సి బాయినిడ్సి
లోకం లోకం అనిపోతే
ఇప్పుడు నాకే లోకం పెడుతుంది బిడ్డా
అన్నీ అయిపోయినంక నాలోకం నేనయిన
నేను రెక్కలు దెగిన పచ్చినే
నేను నెత్తురుడిగిన మనిషినే
కానీ గూట్లె గూకుంటె నాకు రెక్కలు రావు
గుండెలు బాదుకుంటె నెత్తురూ రాదు

అయ్యసచ్చిన్నాడు రాని కొడుకుల కోసం
కాలమాగిందా? కాష్టమాగిందా??

మీ తండ్రి కాటికి అగ్గిపెట్టిన తల్లినిరా
ఆనాడే నా ఆశలన్ని కాలిపోయినయి

ఇప్పుడు నా ఆశలు నేనే అయినాను
నా ద్యాసలు నేనే అయినాను
ఇక సర్కారుకు సాలా – మూలా
పేగులు మాడుతున్నా సూడనోడు
పేగు తెంచుకొని పుట్టిన కొడుకుల కోసం
నేరస్తురాల్ని చేసి ఠాణాల సుట్టు తిప్పుతుంటె
నేను కూడా మీ లోకం కోసం బందీనయినాను

మీ రాజ్యాన్ని ఈ అవ్వ కాదనదు
ఆకలిలేని రాజ్యమైతె ఆశోలె చిగురించనీ
కష్ట జీవులదే కాలమైతే కలకాలం వర్ధిల్లనీ

ఏడ్సి ఏడ్సి ఎండిన కండ్లతోటి దీనంగా వేడుతున్నా
ఎక్కడున్నా సల్లగా బతుకుండ్రి
సల్లని బతుకుల కోసం నిప్పులు కండ్రి
ఐతే అవ్వకండ్లముందు మీరు సావొద్దు
నేను కట్టెనై మట్టిలో కల్సిపోతే
మీ ఆపతిని సంపతిని సూడలేను
మీ ఆశలను శ్వాసలను తాకలేను
ఇదే నా చివరి కోరిక
కన్నతల్లి కోసం కనికరించుండ్రి బిడ్డా

పూల మీద రాల్లు మొలిచి
రాల్ల మీద పూలు పూయాలి బిడ్డా!

అరెస్టు

గాలిని బంధించారని
గాలే వార్త మోసుకొచ్చింది

గాలిలో వాలువైన నిన్ను
సుడిగాలి చుట్టేసిందని కబురొచ్చింది –
నేనింకా ఆ గాలినే
పీల్చుకుని బ్రతుకుతున్నాను
చిరుతాకిడికే వర్షించే మేఘం
వెలుగును బంధించిందని తెల్సింది –
నేనింకా ఆ వెలుగులోనే
లోకాన్ని చూస్తున్నాను
వాడి ఆలోచనలకే గ్రహణం పట్టింది
అందుకే వాడి బుద్ధి వక్రంగా ఆలోచిస్తూ
గతించడానికి సిద్ధమవుతుంది
వర్తమానంలో వాడు ఎగిసిపడ్డా
భవిష్యత్తంతా వాడికిక అంధకారమే
చివరికి వాడి ఉనికి
రాహువు కేతువుల్లా
ఏడిదికొకసారి గ్రహణంలా దర్శనమిస్తుంది

(1987లో అరెస్టులు ఎన్‌కౌంటర్ల వార్తల పరంపర తర్వాత...)

అప్పగింత

కొన్ని అనుభవాలు దుఃఖాన్ని గుమ్మరిస్తాయి
పేగు తెంచుకుని పుట్టిన బిడ్డ గడప దాటుతున్నప్పుడు
పుట్టిన ప్రతి చోటునుండి పరాయికరించబడుతూ
పుట్టుకే పరాధీనమయి దీనంగా రోదిస్తున్నప్పుడు
కొన్ని అనుబంధాలు దుఃఖాన్ని గుమ్మరిస్తాయి

చెట్టును బోసిగ మార్చి పూలన్ని తెంపుకుని
జన్మ బంధాన్ని బంధించి తరలించుకుపోతున్నప్పుడు
పండిన పంటంతా మూటగట్టుకుని పోతున్నవానికి
మూట పదిలమంటూ బిడ్డా నీ మాట పదిలమంటూ
కొన్ని అనుభవాలు గొల్లు గొల్లున దుఃఖిస్తాయి

అప్పగింతల ఆఖరి సరిహద్దుల దగ్గర నిలబడి
గుండె తెగిపోయి కడుపు తోడుతున్న బాధను ఓర్చి ఓర్చి
శ్వాస భారమయి ముక్కు పుటాలదిరిపడగా
కనురెప్పల ఆనకట్టలు దాటి
ఫక్కున పగిలిన నీళ్ల తిత్తిలాగ
వెల్లువెత్తిన కన్నీళ్ల మధ్య వెక్కి వెక్కి ఏడ్చి
బిడ్డా నీ హద్దుల్లో మసలుకో బాధ్యతలు తెల్సుకోమంటూ
కొన్ని వాస్తవాలు దోసిళ్లనిండా దుఃఖాన్ని గుమ్మరిస్తాయి

మొక్కులన్నీ ముడుపుగట్టినట్లు
హక్కులన్నీ మగరాయుడికే అర్పించి
'ఈడ బిడ్డవు కావు 'ఆడ' బిడ్డవనే
సగటు 'నీతి' తో గుండె నతికించుకుని
కడుపు నదిమిపట్టుకుని
అప్పగింతల క్షణిక దుఃఖాన్ని
కనీస బాధ్యత పేర తుడిచేసుకుని
నమ్ముకున్న 'ఆనందాన్ని' దక్కించుకోవడానికి
జీవితాంతం చేతుల్ని చాపడం, జోడించడం నేర్చుకుంటూ
కొన్ని అనుబంధాల్ని అర్థాంతరంగా తెంచుకుని
అప్పగిస్తూనే ఉంటాం...

6-5-1993

అనంతయానం

నేను కన్నీటి జలాల్లో
ఈత నేర్చుకుంటున్నాను
చెక్కిళ్లు దాటి కన్నీళ్లు
గుండెల్లో ఆవిరవుతున్నాయి
మనసులోని మంచుగడ్డ
ఒక్క డిగ్రీ సెంటిగ్రేడ్‌కే కరుగుతుంది
అది గుండె మంటల్లో తగిలి
మళ్లీ వేడి జలమై ఉబికి వస్తుంది
ఒక్కొక్కప్పుడు
నా గుండెకే కళ్లు అతికించబడ్డున్నాయి
కారుతున్న రక్తం
రాలుతున్న కన్నీళ్లు
కలిసే ప్రయాణిస్తున్నాయి

ఈ ప్రవాహంలో లీనమవుతూ
ఈత నేర్చుకుంటున్నాను
అనంత ప్రయత్నంలో
దరిచేరడానికి శతవిధాలా
ప్రయత్నిస్తూనే ఉన్నాను

జూన్, 1994

అందుకోండి మా వీలునామా

ఈ దేశంలో చొరబాటుదారున్ని కాదు
దేశ పౌరసత్వం నాకిక్కడ రక్షణ గోడ కాలేదు
యుద్ధం రేపోమాపో ముగియడానికి
నేనిప్పుడు ఎన్నికల సరిహద్దుల్లో లేను
దారిద్ర్య రేఖపైన్నే కదా మా పోరాటం

వడగళ్ల వానలా
అమ్మా!
ఆపదల మధ్యనే సదా ఆత్మ రక్షణ యుద్ధం
జీవాలు కాసి కాసి తోడేళ్లను తరిమిన అనుభవమే

ఆరు చిరు యుద్ధాల్లో ఆరితేరి
జీవితమే రణరంగమయిన వాన్ని
లేతపాదాల్లో లేడికాళ్లున్నాయని మురిసావు కదూ!

ఇప్పుడు జీవించడమంటే
రోజూ ఒక పరుగు పందెమే!

ఏరుబోసి పంచిన ఆస్థిపాస్థులు కాదు
ఆరబోసిన త్యాగాల వేడి నెత్తుర్లే జీవితం!!

నీకూ నాకు మధ్య కూతవేటు దూరమే ఉన్నా
మన మధ్య పలుకులు పరామర్శల నిషేధం

దేశం నడిబొడ్డున 'శాంతి భద్రతలు' కబళించగా
నా దేశభక్తి ఏ పత్రిక పతాక శీర్షిక కాలేదు
పితృస్వామ్యం నా చెల్లి ఆకాంక్షల్ని కుప్పబోసి
ముప్పయి మూడు శాతం ఆంక్షల్ని దాటి అణిచినప్పుడు
ముక్కుపచ్చలారని అంటరాని తమ్ముని
గుర్తు తెలియని శవంగా దహించినప్పుడు
మీ కడుపులో ఎన్ని కత్తివేట్లు దిగబడ్డాయి
మీ కండ్లల్లో ఎన్ని సుడిగుండాలు చెలరేగాయి

'పందిమడుగు' మా చిరునామా అయ్యింది
ఆంక్షలముళ్ల కంచె దాటుకుని ఎవరైనా కదలిరండి

అక్కడి నెత్తుటి మడుగుల్లో రాటుదేలిన రణభూమి
యుద్ధంలో గెలుపోటముల అనుభవాన్ని
మా విలునామాగ మీ కందిస్తుంది.

8 జులై 1999

(నిజామాబాద్ జిల్లా పందిమడుగులో కామ్రేడ్స్ కిషన్, దేవేంద్ర, శంకర్‌లు అమరులయినారు. కార్గిల్ యుద్ధం సందర్భంగా ఈ హత్యలపై స్పందన)

ఆకలి చావులు

మీ ఎముకల రాట్నాలు వడికిన దారంతోనే
మిమ్ము కాష్టానికి కట్టేసిన పాలకులు
మీ జనావాసాలను శ్మశానాలుగా మార్చేశారు

ఆ పూరి పాకల్లో మిగిలిన కొన ఊపిర్లను
మీ సమాధులపై రాజకీయరంగులుగా దిద్దుతున్నారు

బ్రతికున్నప్పుడు బ్రతికీ బ్రతుకలేక చస్తున్నప్పుడు
మీ ఆకలి పేగులు దారాలై ఆఖరి గుడ్డను నేసినప్పుడు
ఆ మగ్గంపైన్నే మీకు ఉరితాడు బిగించే
పగ్గం అల్లుకుంటుందని ఏనాడైనా ఊహించారా

వేల ఏండ్లుగా వెండిపోగుల్ని వడికి
లోకానికి ఉడుకునిచ్చిన మీ ఉనికి
ప్రస్తుతం మీ శవాలపై కూడా ముతక గుడ్డను కప్పలేని
దారిద్ర్యంగా దర్శనమిస్తుందని ఏనాడైనా అనుకున్నారా?

అగ్గిపెట్టెల్లో చీరల్ని మడిచిన ఘనత
నాగరికతా ఒరవడిలో చరిత్రకెక్కిన తీరు
సజీవంగా చంపేసి చరిత్ర సృష్టించడం ఎంత విషాదం

విదేశీ గుత్త సంస్థల చేతుల్లో చిక్కి ఏనాడో
చేనేత వెన్నెముక విరిగింది
ఇక వాడిచ్చే 'చేయూత' మిమ్ము పూడ్చి పెట్టడానికి మాత్రమే

మగ్గాలు నాగళ్లై దుక్కులు దున్నుతున్న నేపథ్యంలో
ఎక్కడో మూలకు విసిరివేయబడి
చీకట్లో మిణుకు మిణుకు మంటున్న చేనేత
సహకార సంఘాల్లో చిక్కి శల్యమైపోయింది
రంగులు నూలు పెట్టెల ధరల్ని ఆకాశానికెక్కించిన సర్కారు

ఎముకల గూడును తునాతునకలు చేసింది
ఆప్కోవారి దయా దాక్షిణ్యాల్లో నలిగి
మీ ఆశ ఆఖరి శ్వాసను విడిచిపోయింది

అన్నపూర్ణలో
ఆకలిచావులు సర్కారుకు ఎంత అవమానకరం
అందుకే అవి అనారోగ్యం చావులంటుంది
నూలు సరిచేయడానికి ఉడికిన గంజి కూడా
మీ ఆకలిని తీర్చని రోజులు
ఆకలి పేగులు సైరన్ మోతయి కన్నుమూత బడని కటిక రాత్రులు
పడుగుపేకల బడుగు బ్రతుకులు
ఏవికూడా ఈ అన్నపూర్ణకు కళంకం కావా!

జీవితాన్ని కబళించిన ఆకలి మీతోనే పోలేదు
చావులకు సాక్ష్యంగా మా మధ్యే సజీవంగా ఉంది
మీవి ఆకలి చావులనీ...
"అన్నపూర్ణ"కు ఆకలి ఆరవ ప్రాణమనీ...
సంస్కరణల ఆకలితో చంపిన పాలకులే హంతకులనీ...

డిసెంబర్ 21, 1991

(పి.వి.ప్రభుత్వం 'సంస్కరణ'లతో మొదలైన చేనేత ఆత్మహత్యలు, ఆకలిచావులపై స్పందన)

15 ఆగష్టు 1987

జెండా రంగులు మారిన గానీ
దండన పీడన మారని రోజు
చీకట్లో చిక్కి తెల్లవారని
ఆకలి బతుకు కాలిన రోజు

తెల్లవాడితో తెగని బంధం
నల్లదోపిడై మొలిచిన రోజు
కల్లాకపటం ఎరుగని భారతి
కన్నీళ్లతో మిగిలిన రోజు

నెత్తురొలికిన త్యాగమూర్తుల
శక్తికి ఘోరీకట్టిన రోజు
నాల్గు పక్కలు నాలుగు తలల
నాగుబామై నవ్విన రోజు

మూడురంగులు తోడుదొంగలై
ఎర్రకోటపై ఎగిరిన రోజు
కదులుతున్న జనవాహిని కళ్లల్లో
కారం జల్లి మురిసిన రోజు

15 ఆగష్టు 1987

ఆశ

మామిండ్లు పలుగుతున్నాయ్
పూసే పూతల సాక్షిగా
సువాసనలు వెదజల్లుతూ
మామిండ్లు పలుగుతున్నాయ్

పున్నెమి వెన్నెల్లా పూలగుత్తులు మెరుస్తూ
నిదురరాని కండ్లల్లో నిగ నిగలాడుతూ
ఊరంతా సద్దుమణిగి ఉన్నప్పుడు
కదిలే ఊహల నిండా
కాళ్లూ – చేతుల్ల మధ్య కదలాడుతున్నట్లు
మామిండ్లు మహా సరదాగా ఊగుతున్నాయి

గాలి వీచిన చోటుకల్లా గల గల కదులుతూ
మనసందిన చోటల్లా మధురంగా వీస్తూ
మామిండ్లు గుభాళిస్తున్నాయి

వెన్నెల సెంట్రీగా
సేదదీరిన దళం దాపుగా
ఇప్పలు పలుగుతున్నయి
ఆకాశం నుండి చుక్కలు రాలినట్లు

ఇప్పపూలు రాలుతున్నాయి
చడిచప్పుడు కాకుండా పలుకుతున్నాయి

మాట్లాడుతుంటె మూటలవుతున్నాయ్
నిదురిస్తె పక్క జేరుతున్నాయి
ఇది పూతల కాలం
లేత చిగురుల కాలం
ఇది పంటల కాలం
చలిమంటల కాలం
చలిని మోసుకుంటూ
వేడికోసం మండేకాలం
చలిని తోసుకుంటూ
వేడి అందేకాలం

కొన్ని కోటలు పగిలి బీటలువారుతున్నా
కొన్ని కోతలు కోటలు దాటకున్నా
కొన్ని కోటలు కలుస్తున్నాయ్
కొన్ని మాటలు కలుస్తున్నాయ్

కొన్ని బాటలు కలుస్తున్నాయ్
గుండె పగిలిన చోట చిందిన రక్తం
గూడు చెదిరిన చోట కూలిన పెంకులు
ఊరు కదిలిన చోట చీలిన ప్రజలు
అన్నీ సమపాళ్లలో పంచుకుంటూ
కొన్ని మాటలు కొన్ని బాటలు కొన్ని కోటలు
అన్నీ కలుస్తున్నాయ్
ఒక ఘర్షణ ఐక్యతయై
ఒక చీలిక సమూహమై
ఒక యుద్ధం శాంతియై
ఒక గతం గతించి వర్తమానమై

ఒక కల ఫలించి వాస్తవమై
ఒక కన్నీరు తుడుచుకుని చిరునవ్వై
అన్నీ కలిసి మళ్లీ మాటలై కోటలై
క్రొంగొత్త బాటనిండా కలుస్తున్నాయి
సెంట్రీమామ కనుసైగ జూడు
శతృవెవడో వెన్నెలకన్నుల్లో జూడు
పూతలపైకే వాని తుపాకి
చిగురులపైకే వాని గురి
దారితప్పిన చోటే దారి వెతుక్కున్నాం కదా!
దారి పక్కలో బల్లెమయి వాని తుపాకి
కలల కడ్డమై ఫలానికడ్డమయి
చిరునవ్వు పక్కనే వాని వికృతహాసం
చిరుగాలి పక్కనే వాని వడగాలి

ఒక సుడిగాలి సవాలై వీస్తుంటె
ఒక సాగరం తుపానై లేస్తుంటె
ఒకడు వాలీతలో గజ ఈతగాడు
చెలికాడే కానీ విలుకాడు కాదు
చివరిదాకా పోరాడే వాళ్ల సహచర్యంలో
ఒక నిరాశ శిశిరమై రాలుతూ
ఒక ఆశ చిగురులై తొడుగుతూ
మామిండ్లు పూస్తున్నాయ్

వీస్తున్న గాలులు గుస గుసలుగా
మనసుతో మాట్లాడుతున్నాయ్

(మెదక్‌జిల్లాలో పీపుల్స్‌వార్ బలవంతంగా తుపాకులు లాక్కోవడం తప్పని తీర్మానించి అప్పగించిన రోజుల్లో దళంతో ఉన్న రాత్రి ...)

ఆహ్వానం

గత సంవత్సరపు మృత్యు రేఖలపై నిలబడి
కత్తి సాముల్లో నేలకొరిగిన కామ్రేడ్స్ సాహసంతో
నేను నూతనత్వాన్ని ఆహ్వానిస్తున్నాను -

అమరత్వం ఎగిసే గగన సీమలో తాకిన మేఘాలు
కురిపించిన కన్నీటి జల్లును
అరుణాక్షరాలుగా మండించ ప్రయత్నిస్తున్నాను

అక్షరాల్ని పొడుచుకు తినే నర రాబందుల్ని కూల్చే
సుడిగాలుల్ని సృష్టించడానికి లక్షలాది శ్వాసల్ని
ఆవాహన చేసుకుంటున్నాను

గత కాలపు చేదు మాత్రల్ని మింగి కక్కిన
ఎంగిలి అజీర్ణ పదార్థాల్ని షోకేసులో పెట్టి
తాజ్‌మహల్‌గా చిత్రించే వైనాన్ని అసహ్యించుకొంటున్నాను.

సంక్షోభ భారంతో పగిలిన భారతి గుండెల్ని
వేర్పాటు వాదంతో ముడిపెట్టే పాలకుల కుటిల నీతిని
ఓడించడానికి నేను ఉద్యమిస్తున్నాను

ఆకలి చావుల్లో ఆత్మహత్యల్లో లాకపు మరణాల్లో
ఎన్‌కౌంటర్ కుట్రల్లో కులం-మతం మంటల్లో
కనిపించే ప్రగతిని నేను ఈసడిస్తున్నాను -

మాట్లాడే నోటికి తాళం వేసే చట్టాలపై
ధిక్కార స్వరమై మ్రోగుతున్నాను

జీవించే హక్కుపై మరణ శాసనాన్ని వ్రాసే నిర్బంధ వైరస్‌కు
ఆంటిబయాటిక్‌ను అన్వేషిస్తున్నాను

పడమటి చీకట్లను ఒక తన్ను తన్ని వేసే గంతులో
ఉదయించే వెలుగురేఖలు రేపటి వత్సరం నిండా పరుచుకోవాలని
కొత్త భవిష్యత్తును ఆహ్వానిస్తున్నాను.

1 జనవరి 1999

ఆంధ్రనాటకం

త్రిశంకుస్వర్గం సంగతి విన్నావా సోదరా
అధ్యక్ష తరహా పాలన కంటావా కండ్లారా

నేతి బీరలో నెయ్యి రుచి తింటుంటే బహుమధురం
పార్లమెంటు 'ప్రజాస్వామ్య' పద్ధతే అతిరమ్యం

అమ్మ చలువతో తమ్ముడు 'అన్న' కాళ్లిర్వలేద
అధికారం అసెంబ్లీలు ధనం చుట్టు తిర్గలేద

పదవుల పోటీ వేటలో మతం చిచ్చు రగిలితే
వందల మానవ రక్తం అధికారమై పారితే

రామన్నలు సోమన్నల రాజ్యాంగం ఏమిచేసె
జనం రణంతోటే గదా ఆంధ్ర నాటకం ముగిసె

(1985లో 'వెల్లువ' పత్రిక కోసం రాసింది)

ఉద్యమ త్రినేత్రుడు

ఏ కన్నుల గురించి నీనిప్పుడు వాగుతున్నది
రెటీనా పొరలు కమ్మి దృశ్యాల్ని చూడలేక
నిజాల్ని కాటేసే కనుచూపుల గురించా...?
ఒళ్లంతా కళ్లు చేసుకుని చూస్తున్న నిజాల గురించా

ఏ ఉన్మత్త నయనాలతో నీవిప్పుడు జోగుతున్నది
తన కడుపును కత్రుతో చీల్చినా
గొర్రుతో రొప్పినా
నీకు కడుపారా బువ్వనిచ్చిందే...
ఆ భూతల్లికి కన్ను లెన్నో చెప్పగలవా..?

నేలనాటిన విత్తు తాను మరణించి
వేలకోట్ల ఫలరాశుల్లో జీవిస్తూ నిటారుగా పెరగడానికి
ఏ కళ్లతో చూస్తుందో చెప్పగలవా...?

ఈ చెట్లూ గుట్టలు ఏ కండ్లతో పహారా కాసి
నిన్ను ఇన్నేండ్లు కాపాడోయో వివరించగలవా?

గోదావరి ప్రతిఘటనను
గోరువెచ్చని నెత్తుటి త్యాగాలను
కేవలం కండ్లతోనే కొలుస్తావా...
వెలుగుల్ని రవిచంద్రుల్ని చిదిమేసి

ఏ కన్నుల గురించి మాట్లాడుతున్నావు
చీకట్లో తడుముకుంటున్న రేచీకటి కళ్ల గురించా!
తాను ఒళ్లంతా కళ్లయి చూస్తున్న నిజాల గురించా!!

పరిస్థితుల వేడితో గుడ్లు పొదగడం గాక
కండ్లతో గారడి చేయగలనన్న నీ మూర్ఖత్వం
గొంతుతో చూసేవాడిని
చైతన్యంతో సాగే వాడిని కబళిస్తుంది

బాబన్నా!
గుడ్డి కన్ను మూసినా తెరిచినా
ఒకటేనన్న కండ్లున్న కబోధులకు
నీవు ఉద్యమ త్రినేత్రుడవని
చరిత్రే నిరూపిస్తుంది.

1988

(కాబాబన్న (గుడ్డి బాబన్న) - అమరత్వంతో అతడు కన్న కలలను పరామర్శిస్తూ అతని మూడో కంటిని స్పృశిస్తూ...)

ఊపిరైన ఒక పాట

మస్తిష్కం
మోయలేని దేహమై ఉంది

కంటితో చూసినా ఆలోచనే
చేయితో తడిమినా ఆలోచనే
నోరు విప్పి పిలుద్దామంటె
పిలుపునిండా ఆవేదనే...

కదిలే కాలంతో కదుల్దామంటే
కాళ్లు రావటం లేదు
కొలమానంతో కొలుద్దామంటే
చేతులాడటం లేదు

ఒక విశ్వాస హృదయాన విప్పారిన పుష్పం
రెక్కలు రెక్కలుగా విడిపోతున్న అనుభూతి

ఒక విషాదమేఘం తెప్పలు తెప్పలుగా వర్షించినా
నేల తడవని అనుభూతి

అనంత ఆకాశం కింది విశాల జన సమూహంలో
ఒంటరి వాడినవుతానన్న భయం

పలుకరించే వారు లేనప్పుడు

మనస్సు మౌనాన్ని వీడి
నన్ను చూసి నవ్వుతుంది
ఈ పరిహాసాన్ని ఆపే వారెవ్వరు
పూరెక్కలనతికే వారెవ్వరు
ఈ నేలను తడిపే వారెవ్వరు
ఈ ప్రశ్నల మాలనెవరికి వేయగలను
ప్రసన్నమవు జాబిల్లికై ఎక్కడికి వెళ్లగలను!
నా హృదయ సంతకాన్ని ఎక్కడని వెతకగలను!

నేను నాలో తరచి తరచి
వెతుక్కున్న జవాబును
మనస్సు నుండి తీసి మస్తిష్కం ముందు పెడ్తున్నాను

నా ప్రశ్నలకు జవాబు ఇద్దరే
ఒకటి నా ఉద్యమం...
మరొకటి నా ఊపిరైన పాట

25 ఆగష్టు 1994

ఎనుమాముల

అమరులారా
మీ గుండె చప్పుళ్లలో నక్సల్బరి నగార వినిపిస్తుంది

ఆకాశమంతా నేలరాలినట్లు
మహాజన ప్రభంజనంలో మీ ఆనవాలు కనిపిస్తుంది

మొగిలిచెర్ల మోదుగుపూల వనమైనప్పుడు
ఆర్.కె. చిరునవ్వుతో ఎగసిపడ్డ పుష్పమై
ఎనుమాముల ఎదపై మెరుస్తున్నాడు

కౌ కొండలు, కరెంటు తీగలు కసిని రగిలిస్తున్నాయ్
సరసనపెల్లి, జగ్గన్నగూడేల ముంగిట్లో
రక్త రంగవల్లులు మెరుస్తున్నాయి

సమ్మక్క గద్దె సుట్టూ కొలుపుల జాతరోలె
ఎనుమాముల గద్దె కాడ ఎదలు ఎన్నో రగుల్తున్నాయ్

తొమ్మిదేండ్లు గడ్డ కట్టుకున్న కన్నీళ్ళు
కరిగి కరిగి ప్రవాహమైనప్పుడు
రగిలి, రగిలి ఉప్పెనయి ఎగుస్తున్నప్పుడు
ఉద్వేగం, కసి, దుఃఖం, ప్రేమ, ఆత్మీయత

కోపం, శాంతిల సంగమమై
ప్రతిఘటనల సరిగమలు వినిపించాయి

ఎనుమాముల పోరాటాల కూడలి
ఎనమాముల యుద్ధం - శాంతిల లక్ష్య ప్రకటన

రాజ్యం - హింసా 'దయ్యమై' వెంటాడుతున్నప్పుడు
ఎనమాముల 'బహిరంగ కుట్ర'
ఎనుమాముల ఎవరూ చెరుపలేని చరిత్ర

సెప్టెంబర్, 2004
(ఎనుమాముల కుట్ర కేసు తర్వాత)

ఎవరు హింసావాదులు?

ఖాకి జులుం
ఎన్‌కౌంటర్ హత్యలతో
నెత్తు టేరులు సృష్టించెను -

దోపిడి పాలక నీతి
ప్రజా బాహుళ్యపు శిరస్సులపై
అణచివేత ఖడ్గం వేలాడదీసెను -

మొన్నటి కొండాపురం
నిన్నటి కమ్మర్‌పేట
హింసాకారుడెవరో నిరూపించెను-

ఎవడి దౌర్జన్యం -
పల్లెలకు సంకెళ్లువేసి
టెర్రరిస్టు భయోత్పాతం కలిగించెను -

ఎవడు శాంతిభద్రతల రక్షకుడు
రాజ్యాంగ విధేయుడు
పౌరుల్ని నడిబజార్లో కాల్చిచంపెను -

ఎవడు మధ్య యుగాల
భూస్వామ్య కోరలకు
సైనెడ్ విషాన్ని తెగబూసెను -

ఎవడు మత ఛాందస భావాల
కాషాయ ధ్వజాలను
ప్రజల తలలపై బలవంతంగా పాతెను -

ఎందుకు పొలాలు దున్ని
వరాలు పండిస్తున్న
రైతు చెమట నెత్తురు మట్టి పెల్లలకు ఇంకెను -

ఎందుకు గుండె కవాటాలు
ఆయిల్ గొట్టాలు చేసిన
శ్రామిక సౌభాగ్యం అభాగ్యమయ్యెను

ఎందుకు మన సస్యశ్యామల
సుజలాం - సుఫలాం విఫలమై
విదేశీ విఫణిలో చిక్కి విలవిల్లాడెను

(1985లో కొండాపురం, కమ్మరిపేట తదితర ఎన్‌కౌంటర్ హత్యలు, ఎబివిపి-ఆర్ఎస్ఎస్ దాడుల తీవ్రత తర్వాత)

కదలిక

చూపుకు కదలికకు మధ్య
వెసలుబాటు స్తబ్దత కాదు నిశ్శబ్దమూ కాదు

ఆక్రోషం ఆటంబాంబై పేలుతుంటే
చూపులు పసిగట్టే వారికి
ఆక్రోషమే కదలిక

ఆకాశం మబ్బులు కమ్మి దిగులు పడ్డట్లున్నా
ముసిరిన మబ్బులే కురిసే వర్షానికి సూచన

2 జూలై 1994

కలం దొంగ

ఎర్ర కలాన్ని నీవెత్తి పట్టానంటున్నది
పచ్చదనాన్ని దోచి మింగడానికి కాదు
దోపిడికి చరమగీతం రాస్తానంటున్న నీరాతలు
తెల్ల పేపర్లను చెరపడానికి కాదు

కాళ్లిరిగిన ముక్కాలి పీట అడుగులేని కడుముంత
తమాయించుకుని నిలబడ్తాయేమోగానీ
బారెడు పొడవు రెండు కాళ్లున్నా
అరి చేతంత పెద్దనోరున్నా
ఈ రెంటిమీద నీ వెన్నడూ నిల్చింది లేదాయె

సూర్యోదయం నుండి అస్తమయందాకా
అస్తమానం అబద్దాల కబుర్లేనా
అభాగ్యుడి కన్నీళ్లను చిత్రిస్తానని నమ్మించి
కలాన్ని కవిత్వాన్ని అంగట్లో వేలం వేసావు

కవిత్వం సరుకు కాదంటే
విప్లవాన్ని వ్యాపారం చేయొద్దంటే
సద్విమర్శను స్వీకరించకుండా
మిన్ను విరిగి మీద పడ్డదని

సముద్రం ఇంకి పోయిందని
సూర్యుడు పడమటి కుడాయించాడని గగ్గోలు పెట్టావు

కొన్ని బాయిలో కప్పలు
నువ్ 'సై' అంటె సై, జై అంటె జై అంటున్నాయి
నీ నక్క జిత్తులకు తోకాడిస్తున్నాయి
ఏం స్ఫూర్తో చెప్పలేం గానీ
కొండకే తలలేసి గుద్దుకుంటున్నాయి

సత్యమెవరిదో, పతనమెవరిదో
కొండంత ఆచరణనే చెబుతుంది

పెంట కుప్పలపై పుబ్బలో మొలిచేవి
పుట్ట గొడుగులు మాత్రమే

మూన్నాళ్ల ముచ్చటైన పుట్టగొడుగు
శాశ్వతమైన మహా వృక్షాన్నని మురుస్తుంది

కానీ ఉద్యమ వెల్లువలో
నీ ఉనికి మైక్రోస్కోప్‌లో కూడా కానరాదు జాగ్రత్త:..!

(1984 చీలికలో అవకాశవాద కవి ఒకరు పార్టీపై బురద జల్లడాన్ని నిరసిస్తూ)

ఖండాల హిల్‌స్టేషన్

కొండలపై వెండి తెరలు
బండలపై పొగమంచులు
కొండ చివర అంచులపై
తేలియాడు మేఘాలు

కొండకోనల మధ్యన
ప్రవహించెడి సెలయేరులు
పసిపిల్లల చిరునవ్వులు
వెదజల్లే పూబంతులు

పచ్చని ముత్తయిదువుల్లా
దీవించే అడవి తల్లి
గుండెపొంగి ప్రవహించే
ఖండాల పశ్చిమ కనుమలు
అతి రమ్యం ఆనందం!

ప్రకృతి అందాలను
వర్ణించు టెవరితరం?
ప్రకృతి గుండెలకి
పుట్టిన రక్తనాళాలు

గిరిజనుల రూపంలో అక్కడ
గతిలేక జీవిస్తున్నాయి
రక్తనాళాలను నోటితో జుర్రి
ఖండాలకు మొండి కిరీటంలా
మెరుస్తున్నాయ్ మహలులెన్నో!

గాలి నీరు నేల అడవి
ఏవి కూడా ప్రకృతివి
ఆమె బిడ్డలవి కాదంటూ
పెట్టుబడిదారుల సౌఖ్యం
అశుద్ధపు పురుగులా మెరుస్తోందక్కడ

ప్రకృతిని తెగమింగే వికృతి
ఆ గుండె కొండలను తొలుస్తుంటే
అసహనంగా అవి శ్రాంతంగా
గుడిసెల్లో గోచీ గుడ్డల కదలికలు

(ఖండాల హిల్ స్టేషన్‌లో బొంబాయి, పూనా ధనస్వాముల మేడలు, గిరిజనుల వాడలూ - వాలకాలు చూసి)

కాసుల కాయం

జీవం లేని కాయానికి
బొమ్మా బొరుసయి
జీవితాన్ని నాణేలతో
కొలుచుకునే వాడొకడు
రక్తమాంసాలను వాడు అంగట్లో అమ్మి
కాయాన్ని కాసులతో నిర్మించుకుంటాడు

డి వాల్యుయేషన్ మార్కెట్లో
పడిపోతున్న పైస విలువలా
తిరోగమనంలో పోటీ పడ్తుంటాడు

ఎంత ఊపినా గల్లగురిగిలా
గల గల మంటాడు తప్ప
పల్లెత్తి మాట్లాడడు
కాలయముని వద్ద మోకరిల్లి
మరయంత్రంగా మారుతాడు

వాడు 'కీ' ఇచ్చినప్పుడల్లా తిరగడమే
గాల్లో ఎగుర్తున్నట్లు భ్రమించి
రెక్కలూడిన పక్షిలా కింద పడ్తుంటాడు

వాడు అలారం పెట్టినప్పుడల్లా
గణగణ మోగుతూ
'స్వేచ్ఛాగానం' చేస్తున్నట్లు గర్వపడ్తాడు
ఉక్కిపోయిన మామిడి కాయలా రాలి
చెట్టును వెక్కిరిస్తాడు

పాడెపై పడుకుని
ప్రశాంతతను వెతుక్కుంటాడు
మొండి తనమంతా
ఎండిన పుల్లయి విరిగిపోతాడు
కాళ్లులేని నిచ్చెన వేసుకుని
కాలంపై ఎగబాకబోతూ
కాలుజారి పడిపోతాడు

నిచ్చెన సరిచేసుకుని
కాలాన్ని గురిచూసి నడువకుండా
విశ్వాసంపైన్నే విశ్వాసం కోల్పోతాడు
వెలసిపోయిన జెండొకటి పట్టుకుని
కాలం కల్సిరాలేదంటూ
విమర్శించడానికి బయలుదేరబోతూ
కాసుల దేహం మొరాయించే సరికి
పైసలయి పలుకుతుంటాడు
పంజరంలోనే కులుకుతుంటాడు

16.7.1993

(ఆర్థిక నేరాలతో దిగజారిపోయిన మిత్రుడిని గురించి విన్న తర్వాత)

కిరణ్‌కోసం

గతుకుల దారిలో నడిచిన
పాతగుర్తులన్నీ ఇప్పుడే చూస్తున్నాను
అవి సుతిమెత్తని హృదయపు
పాదాల ప్రతిబింబాలుగా కనిపిస్తున్నాయి
నడక పూర్తిగాకుండానే
అవి పాదరసంలా జారిపడ్తున్నాయి
జీవితం గురించి కన్న కలలన్నీ తిరగేస్తే
జీవితమే కలలా కరిగిపోయి తిరగబడ్డది
జీవితం ఎక్కడ దారితప్పిందని వెతుకుతుంటే
దారే జీవితాన్ని మరణం వైపు నడిపించిన దాఖలా కనిపించింది
ఆశల కళ్ళతో వెతుకుతుంటె
గుండెలు పిండే వీలునామా
చంటిపాప నొసటిపై ఇలా రాయబడ్డది
"నేను భ్రమించిన జీవితపు పొరలు
నాకు ఉరిత్రాడును పేనిచ్చాయి"

1997

(ఉరికొయ్య ఊగిన భానుప్రకాశ్ తన
వ్యక్తిగత సంఘర్షణలో ఉద్యమం నుండి వెనక్కు పోయి మధ్యతరగతి
కుటుంబపు ప్రతిష్ఠల మధ్య ఇముడలేక ఆత్మహత్య చేసుకున్నాడు)

గండి

పండుగలు ఊయల లాంటివి
ఈ ఊయల లెక్కి ఊహల కందేంతవరకు
తనివి తీర ఊగేవారంతా గొప్పోళ్లు -

ఊయలలో ఊగలేక
ఊరకనే ఉండలేక ఊగామనిపించుకొని
సగం వరకు ఊగేవాళ్లంతా సగటు మనుషులు -

ఊయల ఛాయలు తెలియక
ఊగే ఊతం తెలియక
ఊపిరాడని కష్టాల్లో ఉన్నోళ్లంతా పేదోళ్లు -

ఉన్నోళ్ల కుండ ఎప్పుడూ నిండుగానే ఉంటుంది
సగటు మనిషి బతుకు పండీపండకనే పడిపోతుంది

లేనోడి బతుకు ఎప్పుడూ ఎండమావే
వాళ్ల కడుపులకు ఎప్పుడూ గండే
గండిపడ్డ నీళ్ళే గడగడలాడిస్తాయి

18-1-1982

గ్రహణం - గమనం

శ్వేత చంద్రుడు - ఎరుపు సూర్యుడు
నిరంతర తేజో నేస్తాలు
రెండు వేర్వేరు సామ్రాజ్యాలకధిపతులు
వెలుగు వారి సమష్టి లక్షణం
మబ్బులు మసకలు క్షణకాల అంతరాయాలైనా
వారి వెలుగుకు ప్రతిబంధకాలు కావు -

కోట్లాది నక్షత్ర 'కుటుంబ' పరివారంతో
చంద్రుడు వెలుగై కొలువు తీరుతాడు
తన చలువతో కలువల్ని పూయించి
చకోర పక్షులకు జీవితాలనిచ్చి
ప్రతిరేయిని తన శ్వేతాంబరంతో చుట్టి
ప్రేమోపమానాలకు పలుకులు కూర్చి
కవుల కలాల్లో కదలాడుతుంటాడు
నిశ్చల జలాల్లో నివాసముంటాడు
తన ఉనికి లేని రేయి చీకటి చికాకు తప్ప
తాను వెలిగిన ప్రతి రేయి కలికితురాయే!

సూర్యుడందుకు బద్ధ విరుద్ధుడు
లోకంతో సన్నిహితమయ్యే స్వీయాత్మక వంటరితనం
కమలాల్ని పూయించినా

కవుల కలాల్లో జ్వలించినా
చీకటి తలపై ఉదయించి జీవన చర్యల్ని నిర్దేశించినా
లేతనవ్వుల చిరుకిరణాల నుండి
కణ కణ మంటలతో కస్సు బుస్సులాడుతాడు
తన ఉనికి ఎల్లకాలం అవసరం ఉన్నా
అన్ని కాలాల్లో ఆదరించని జనం
మెచ్చుకోలు ఈసడింపుల పర్వంలో
అలిసిపోయి అస్తమించడం పరిపాటి!

వెలుగుతో సహచరులు పరుగులతో నడిచినా
ఒకరి కొకరు చిక్కరు దొరకరు
మబ్బుల మేలి ముసుగులో దాగుతూ
అదృశ్య జాతకులయి తిరుగుతారు -
అయినా వీరిరువురు వెలుగై ఉన్నారు
రేయి పగలుగా దినంలో కల్సే ఉన్నారు

ఒకరి వెలుగు మరొకర్ని కనబడకుండా చేసినా
వారు అనంత ప్రకృతిలో కలిసే ఉంటారు
వారి కలయిక ప్రచ్ఛన్న మయినపుడు
అది గ్రహణంగానే దర్శన మిస్తుంది
లిప్తకాలపు చీకటి మళ్ళీ విడిపోతుంది
ప్రకృతి సిద్ధమైన అనంత కాలచక్రం
తిరిగి యథావిధిగా పరిభ్రమిస్తుంది

జనాకాశంలో ఉద్యమ జనన చంక్రమణంలో
గ్రహణం ఒకటే గమనం వేలరేట్లధికం!

జులై, 1994

గుండె కురిపించిన వాన

నెత్తిపై గంగమ్మ లేకున్నా
ఉబికి వచ్చే జల దృశ్యం
ఊపిర్లలో ఆవిరవుతుంది
గాలి వీచి వీచి ఆగినట్లు
రాలి పడిన చెట్లు సాక్ష్యమిస్తున్నాయి

రాలిన చెట్టు పూల వాసనలు
భూమాతనే ఆఘ్రాణిస్తున్నవి
అడివి నడ్సీనడ్సి అలిసిపోయి
సేద దీర్చుకుంటున్నది
అలిసిన అడివి కూడా
భూమాత ఒడినే ఆశ్రయిస్తున్నది

వాన కుర్సీ కుర్సి
కాల్వలై ప్రవహిస్తుంది
కురిసిన వానంతా
భూమాతనే పదును పెడుతుంది

గుండెనెత్తుర్లను శరీరానికందించినట్లు
కుర్సిన వాన అడివికంతా కొత్త శక్తి నిచ్చింది

రాలిన పూలను కడిగి దోసిల్లలో పోసింది

విరిగిపడ్డ చెట్టంతా వేర్లయి చిగురించి
వేల మొలకలై మొగ్గ తొడిగింది

గుండెలోతుల్లో పొంగి చెక్కిళ్లపై రాలిన
కన్నీటి చారికలను కూడా ఆ వానే కడిగింది

అక్కడ కుర్సిన చిట పట చినుకులే
గుండె బరువును దించే
మేలుకొలుపుల గీతం పాడింది

ఒక విషాదాన్ని తడిపి కర్తవ్యంగా మలిచేవరకు
ఆ వాన ఎడ తెగకుండా కురిసింది
అక్కడ కురిసీ కురిసీ ఆగిన వాన
కనుచూపు కందనంత జలసముద్రమైంది

జలం నెత్తి నుండి భూమిపైకి ప్రవహించిన తర్వాత
గుండె వర్షించడం ఆపి ఈదడం ప్రారంభమైంది

చితాభస్మం లోంచి...

మా చితాభస్మం నుండే మేము మళ్లీ పుడతాం
మట్టి దేహాల మీదే విప్లవ ఓనమాలు దిద్దుకుంటాం
మా ఆశయాలను నీ "జన జీవన"
మురికికాలువలో కలపాలనుకున్నప్పుడల్లా
సజీవ ప్రవంతిగా వీచి నీ కుట్రలన్నీ బూడిదపాలు జేస్తాం
త్యాగాల అమృతధారను తాగి ఫినిక్స్ పక్షిలాగా
మా చితాభస్మం నుండే మేము మళ్లీ మళ్లీ పుడతాం
నిమజ్జనాల పాడెలు మోసిన మీ నాజూకు భుజాల బరువులోంచి
రాలిపడుతూ
మీ చచ్చుపుచ్చు ఆలోచనలను బద్దలుగొడుతూ
శత్రు విద్వేషంనుండి ప్రేమగా
నిత్య అణచివేత నుండి ప్రతిఘటనగా
పడుతూ లేస్తూనే మేము పెరుగుతుంటాం

పాతికేండ్లుగా తూట్లుపడ్తున్న గుండె గాయాలను మాన్పుకుంటూ
కన్నీళ్లతో తడిసిన పాటలన్నీ కలిపి ఏకరాగంతో పొలికేక పెడ్తున్నాం
మంథని పెద్దన్న నుండి సిర్సిల్ల గుట్టన్న దాకా
అమన్ బాయి నుండి అమరత్వం అంచులదాకా చేరి
మీ కుటిల ఆశలన్నీ అడియాశలు చేస్తూ
అప్పుడూ - ఇప్పుడూ - ఎప్పుడూ మేం కొనసాగుతూనే
పురోగమిస్తాం

జంపన్న చెరువులో ఊటలై
దుమాల బడిలో పాఠమై
దసరా నాటి పాలపిట్టలై కనబడ్తాం
నిమ్మపెల్లి దొరల భూముల్లో విత్తిన విత్తనాల్లో
అభావం చెంది పచ్చని పంటలమవుతాం
తరాలుగా ఇంకిపోయిన మా చెమట చుక్కల్లో భూగర్భ జలాలై
పొంగి
సనుగుల మాటు కాల్వగుండా నీటిధారలై పారుతాం

నిలువెత్తు నిజాల వెలుగుల్ని నీవు ఆర్పాలనుకున్నప్పుడల్లా
మేము కొయ్యూరులో ఉదయిస్తాం
మీ ఆరుతున్న పెదవులు ప్రమాదంగా పలవరించే
దగ్గురాజలింగం, ముదాం రామన్నలమై కనబడ్తాం
నీ కోవర్టు వలను తెంపిన భూపతన్నలమై వచ్చి
పవనమై వీస్తూ వందలు వేల నూతన రాగాలను పల్కుతాం
మున్యాలలో ఉరికొయ్యలూగిన తిరుపతి చెట్టుకొమ్మను
వెదురు బాణంగా మలిచిన విఠలన్నలమై గర్జిస్తాం

ప్రాణహితై ప్రవహించిన చంద్రన్నను
సింగరేణి నిప్పుకణికల్ని చేతిలో పట్టుకుని
చల్లార్పకుండా గోదావరి ఈదిన ఎస్.ఆర్.ను
గుండ్లకు గుండెలు జూపిన సహదేవ్‌ను ఆవాహన చేసుకుంటాం
అక్కలు అన్నల ఒంట్లో చుక్కయినా మిగులకుండా నెత్తుర్లను
జుర్రుకున్నానని
విర్రవీగిన వాని నోటి నిండా పురుగులను పుట్టిస్తూ

కొత్త నెత్తురై పరిమళించిన
వీరులారా వీర నారులారా ఎర్రెర్ర దండాలు

ఆకులు రాలిన చోటే చిగురిస్తూ
చరిత్రకు నూతన అధ్యాయాలను అందిస్తున్న - కరీంనగరమా
అడవినే అమ్మ ఒడిగా చేసుకున్న వీర సైనికుల మీద ప్రేమతో
రాస్తున్నా
మాదాపురం నుండి పద్మక్కల దాకా కనిపించేవన్నీ నెత్తుటి చారికలే
మేం శాంతించిన చోట కూడా వాళ్లు ఊసరవెల్లులై
మాఫియాలు, నల్లదండ్లు, కోవర్టుల అవతారాలెత్తుతున్నారు
నిద్రించిన కొండాపురం నుండి నినదించిన రంగారావుపేట దాకా
చెక్కపెల్లి తిరుగుబాటునుండి నూకలమర్రి పెను మంటలదాకా
కళంకితమైన తన చేతులతో వాడు హింసా-విధ్వంసాలనే
లిఖిస్తున్నాడు
తడిగుడ్డతో గొంతులుకోసే 'ప్రావీణ్యతలు' బయటపడకుండా
శాంతి చర్చలను అశాంతిమయం చేస్తున్నాడు
రాజన్నపేట, మొగిలిపాలెంలో నింగికంటిన ఆశలను
భూపతన్న నిత్యనూతన ఎత్తుగడల్లో రక్తికట్టిస్తాం.
పరుపుబండ గోపాలులు, పల్లె పల్లెన రాల్చిన రక్తాలను
రత్నాలుగా దోసిళ్ల కెత్తుకుని నా తల్లులు ముద్దాడుతుండగా

సిరిసిల్లా, జగిత్యాల జైత్రయాత్రలై బైలెల్లి
మేము దండకారుణ్యంలో తేలుతాం
నీవు కోరుకుంటున్న మా చావు నుండే
నీకు మరణశాసనాన్ని తిరిగి రాస్తూ

మేము పుడుతూ పోరాడుతూ గెలుస్తుంటాం
మా చితాభస్మాన్ని మట్టి దేహాలమీద
ప్రతిఘటన అక్షరాలుగా దిద్దుకుంటాం

(11 సెప్టెంబర్ 2004న వేములవాడలో కా॥ జె.పి. 6వ వర్ధంతి సభ సందర్భంగా)

చిరంజీవి

చావు నీ కళ్లముందు
కరాళ నృత్యం చేస్తున్నా
బ్రతుకు పోరాటంలో
చావునే ఆహ్వానించి
చంపేవాడి స్థైర్యాన్ని గెలిచేసావు

బ్రతికున్న శవాలను
అవహేళన చేస్తూ
మరణించికూడా
మా మధ్య జీవిస్తూనే ఉన్నావు

1985

(చెక్క పెల్లి పోరాట పాండవుల్లో ఒకడైన కా॥ రామాస్వామి (నరేందర్) - సెప్టెంబర్ 1985 బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపబడిన స్మృతిలో...)

చెమట చుక్కల అమరత్వం

చీకటి బతుకుల్లో పొడిచిన నెలవంకను
మింగిన రాహువు లెవరు?
చలువ కిరణాల్లో వికసించిన కలువ కౌమార్యాన్ని
నలిపేసిన నరకాసురులెవరు?

పేదల కన్నుల కొలనుల్లో విప్పారిన కమలాన్ని
తెంచేసిన దుర్మార్గులెవరు?
బడుల్లో అలజడుల ఆందోళన ఊపిర్లను
గొంతుపిసికి ఆపిందెవరు?

సత్యాన్ని నడిబజార్లో హత్యచేసిన
అసత్యపాతకు లెవరు?
అర్ధ ప్రపంచం అంగాంగాలతో
ఆటలాడిందెవరు?

నెత్తురు చెమటయి నేలనింకిపోయిన శరీరాలనుండి
కాళ్లూ, చేతూలు, తలా - మొండాలు వేరు చేసిందెవరు?
నూనూగు మీసాలకు నూరేళ్లు నింపి
పాలబుగ్గల నుండి నెత్తుర్లు పిండిందెవరు?

మానేరుకు - మంజీరకు మధ్య జనవారధిని చీల్చి
ప్రవాహాలకడ్డు నిలిచిందెవరు?

ఇవి ఏ వర్గం చర్యలు? ఏ లక్ష్యానికి దారులు?
తమ వసంతాన్ని శిశిరం కబళిస్తున్నప్పుడు
కోకిల గానాల్ని కొంగొత్త కలల్ని కాలరాస్తున్నపుడు
తమ పచ్చని పైరులకు సోకిన చీడపురుగుల పీడను
విరగడ చేసుకుంటుంటే
చీడలకు జోహార్లు చెప్పే వానిదే వర్గం

పంట పొలాలు శ్మశానాలవుతున్నపుడు
చేన్లు చెలుకలవుతున్నప్పుడు కనిపించని రాబందులు
నేడు ఎడారుల్లో వాలి
క్షతగాత్రుల్ని పొడుచుకు తింటున్నాయి
శాంతి భద్రతలంటూ చెమట చుక్కల్ని బంధిస్తున్నాయి

ఎన్నిగూళ్లు చెదిరి ఎన్ని గుండెలాగి పోయినా
ఎన్ని పల్లెలు వల్ల కాడయి మిగిలినా
భాతృవర్గ సంహారమంటూ భావదారిద్ర్యమంటూ
చేతులు దులిపేసుకోగలమా..?

కన్నుల్లో కాపాడుకోవల్సిన 'అన్నల్లో' కొందర్ని
కటికవాళ్లలాగా జనం చూస్తున్న నిజాల్ని కాదనగలమా..?
ఏ 'స్వేచ్ఛా' మాయలమరాఠి నీ తుపాకిని
ప్రజలపైకి మరల్చిందని ఏనాడైనా ప్రశ్నించామా...?

ఏ జిత్తుల మారి కుట్రలు నిన్ను భస్మాసురున్ని చేశాయని
ఏనాడైనా హెచ్చరించామా...
ఏ పెత్తనం కోసం ఈ కత్తులు దూయబడ్డాయని భావిద్దాం

వర్గ పెత్తనాన్ని కాక మరొక పెత్తనాన్ని
ఏ మార్క్సిజంలో వెతుక్కుందాం

కత్తుల మెరుపు కండ్లు మూసుకున్నామంటే
తెగిపోయిన తలలు మనల్ని క్షమించవు

చెమట చుక్కలకు జోహార్లు చెప్పకుంటే
ఏ అమరత్వం గురించీ రాయలేము..
ఏ భవిష్యత్తును గురించీ పాడలేము.

(1989 జూన్‌లో 'విప్లవ' ముసుగులో భూస్వామ్య గూండాల నరమేధం తర్వాత, పోలీసుల అరెస్టులు, కాల్పులు, కేసులతో అట్టుడికిన మెదక్‌జిల్లా పరిస్థితుల్ని చూసి...)

చెరబండరాజా!

నరనరాన్ని వెలికి తీసి
ఈ దోపిడి వ్యవస్థపై ఎక్కుపెట్టిన
విల్లమ్ములకందించి
యుద్ధ కవిత సృష్టించావు

చెరబడ్డ పీడితుల విముక్తికై
కలమెత్తి గళమిప్పి
కాలంతో పరుగెత్తావు
చెదపురుగు బర్రె జలగ ఈ వ్యవస్థ
నీ మెదడు తొలిచి
నీ శక్తుల్ని పీల్చి
బలి తీసుకోవడం కంటే
ఇంకేం కానుకందిస్తుంది...!

చెమట చుక్కలదే
సమస్త సంపదన్న వాడా
కోట్లాది బాధిత గుండెల్లో
నీవు చిరంజీవివే
సమస్త కళలు ప్రజలకేనన్న వాడా
నీవెప్పుడూ వెలుగు కలానివే – వేగుచుక్కవే

29 జూన్ 1984

(1984లో 'వెల్లువ'లో ప్రచురితం)

జయం

చల్లని చూపుల కొలువులో
మానవీయ ప్రేమకోసం తపించిన మనిషికి
నీవేమిస్తావు నేస్తం!

నిరీక్షించే కన్నుల సాక్షిగా చెబుతున్నాను
నాకు జాబిల్లి వద్దు తారలూవద్దు
నిజాలై కాంక్షించే చూపుల్లో
నేను జాబిల్లి వెలుగును తారలకాంతిని దర్శిస్తాను
పరిమళించే హృదయాన్ని శ్వాసిస్తూ
ఈ ప్రపంచాన్నే జయిస్తాను.

10 మార్చి 1995

జీవితం

జీవితం నిశ్చల సముద్రమే కాదు
అది ఎడతెగని ఆటుపోట్ల ప్రవాహం కూడా

జీవితం ఎండిన ఎడారి మాత్రమే కాదు
తడి తడి ఓయాసిస్సు కూడా

జీవితం నిశ్చలన చలనాల మధ్య సంధానం
జీవితం మంచీ చెడులమధ్య సంబంధం

జీవితం గడ్డకట్టుకున్న మంచే కాదు
ఇనుమును కరిగించే వేడిమి

జీవితం కరుగుతుంది మరుగుతుంది
జీవితం కనుమరుగై ప్రత్యక్షమవుతుంది

జీవితం రోదనలో నవ్వవుతుంది
జీవితం వేదనలో సైతం సంవేదనవుతుంది

జీవితం పరస్పర విరుద్ధాల సమ్మేళనం
జీవితం సంఘర్షణల శాశ్వతం

జీవితం పురోగమనాల ప్రయాణం

ఫిబ్రవరి, 1991

జీవిత ప్రకృతి

నేస్తం...
నీ వెక్కడ పుష్పించలేవో
నేనక్కడ ఫలించలేను
నీవెక్కడ గీతం కాలేవో
నేనక్కడ సంగీతం కాలేను
గీతానికి సంగీతం కలిస్తేనే కదా
పాట జీవించి రవళిస్తుంది...
నేను వసంతమై చిగురించాను
నీవు కోకిలయి పలికావు
నేను చినుకయి రాలాను
నీవు సాగరమై ఉప్పొంగావు
విడదీయలేని జీవిత ప్రకృతి ఇది
విడివిడిగా చూడకు నేస్తం

పొదగబడ్డ గుడ్డులో
జీవితం ఎగదన్నుకువస్తుంది
పసుపు తెలుపులు కలిసి
రంగు రూపమై రూపాంతరం చెందుతుంది
జీవితం అంటె నీవొక్కరే కాదు
నేను కూడా నేస్తం...

నీవు నాకు స్ఫూర్తివేకానీ
కీర్తివి కాదు
నేను నీకు అశేషన్నే కానీ
శేషం కాదు
'నేను' 'నీకు' కంటె
'నీవు' 'నాకు' కంటె
నీవూ నేనైన జీవితం ఎంతో గొప్పది
ఆశయాలతో సానపెట్టబడి
అది మరింత పదునవుతుంది

పదునైన జీవితాన్ని
బలోపేతం చేసుకోవడానికే గానీ
బలి తీసుకోవడానికి కాదు
ఎండిన కట్టెపుల్ల సైతం మండుతూ
తన జీవితాన్ని పండించుకుంటుంది

నేస్తం...
జీవితం సజీవం – చలనం పురోగమనం
జీవితమే సంఘర్షణా మార్పు అభివృద్ధి
జీవితాన్ని ద్వేషించకు నేస్తం ప్రేమించు
జీవితాన్ని విపులీకరించుకుని విప్లవీకరించు

జీవితమంటే నీవూ నేనే కాదు
మనం గెలుచుకోవాల్సిన ప్రపంచం
మనం జీర్ణించుకోవాల్సిన ప్రకృతి

20.3.91

జీవితం నుండి జీవితానికి

ఒకే మూసలో పోయబడ్డ జీవితంలో సైతం
మరో జీవితం కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుంది

ఒక జీవితం అంతం తర్వాత
మరో జీవితం ఆరంభమవుతుంది

ప్రతిపాదం అనేక మజిలీలు దాటుతున్నప్పుడు
ఆ పాదమే ఒకరి ఆఖరి మజిలీ అవుతుంది

జీవితాన్ని జీవితాంతం ప్రేమించే వాడు
ఆ పాదం జడత్వాన్ని అసహ్యించుకుంటాడు

జీవితపు ఊహాస్వర్గాన్ని తేటతెల్లం జేసి
యాంత్రిక జీవితాన్ని, కృత్రిమ మరణాన్ని తూచి
జీవితపు సహజత్వానికందిస్తాడు

విత్తు మరణించడానికి
మొలకెత్తడానికి మధ్యనున్న సంబంధాన్ని
ఆకలితోనూ పోరాటంతోనూ అనుసంధానిస్తాడు

ప్రతి ఆటుపోటులో రాటుదేలుతూ
సజీవశైలిలో ఎదగడం నేర్చుకుంటాడు

కడకు జీవితం ఆనందమయమై
అనంతంగా సాగడానికి
ఒక జీవితం నుండే మరొక జీవితం
కొత్త శక్తితో ఎదుగుతుంది.

29.4.93

జెన్నీకోసం ....

జెన్నీ...
ఈ తరం పాపవు నీవు
మా స్మరణీయ రూపం నీవు
మా వర్గానికి బంధువువే కానీ
అనుబంధాల బందీవి కావు.

సుడులయి తిరిగిన ఉప్పు కన్నీళ్లను
కడుపులోనే తాగిన పాపా
పేగుతెంచుకున్నాక కూడా
నిన్ను కడిగింది కన్నీళ్లతోనే...

మా కన్నీళ్ల దోసిళ్లల్లో నింపుకుని
ఏ రవికి అర్ఘ్యమిస్తావు
ఏ భువిని పదును చేస్తావు
చెప్పు పాపా చెప్పు
మా ఆశలకు జవాబు నీవు

కన్నులు చెరువులు కాకముందే
కర్తవ్యం నీకు పాలిస్తుంటే
వెన్నలా కరగాల్సిన మమతలు
కాఠిన్యమై నిన్ను లాలిస్తుంటె

ఉప్పొంగుతున్న సముద్రం మధ్య దీవిలా
ఎంత నిర్మలంగా ఉన్నావు పాపా
నీ నిష్కల్మష సొగసులు
మాకు ముద్దొస్తున్నాయి
నీ చిన్నారి నవ్వులు
ఒంటినిండా ఎర్రపూలయి పూస్తున్నాయి

ఉంగా అనే ఏడ్పుల్లో కూడా
నీ లేత పిడికిల్లు బిగుసుకుంటున్నాయి

గతిస్తున్న తరం చుట్టూ
తరగని జీవనదిలా ప్రవహిస్తూ
ఉగ్గుపాలతో ఉద్యమాన్ని రంగరించుకుని
అన్న ఆశలయి ఎదుగు జెన్నీ...
మా బాసలయి పెరుగు చిన్నీ...

28 సెప్టెంబర్ 1991

(అమరుడు కాిరవన్న అమరుడవడం అతని బిడ్డ జెన్నీ జన్మించడం - ఒకరు కన్నుమూసి మరొకరు కనులు తెరిచిన ఘట్టానికి అక్షర రూపం)

త్యాగం

వాడు
మన త్యాగం పగిలిన అద్దం ముక్కల్ని
వృధా అని నిందిస్తాడు

కానీ
విత్తనం అభావం చెంది
ఫలించడమొక్కటేగాదు
పగిలిన గాజు ముక్కల్లో కూడా
వేన వేల జీవితాలు ప్రతిబింబించడం
వాడికేం తెల్సు...

ఒక్కోముక్క
వాడి కరుకు పాదాలకు సవాళ్లు విసుర్తుంటే
అప్పుడు కదా తెల్సేది...

అవి పగిలిన ముక్కలు కాదు
పదునైన ఆయుధాలని

1990 చివర్లో

(కేంద్ర మాజీమంత్రి ఒకరు త్యాగాలు వృధాయని బహిరంగ సభలో ప్రకటించినప్పుడు)

దశ కోసం దిశ మార్చి...

'దశ' పలికించుకోవడానికి
ఏకంగా 'దిశనే' మార్చలేను

సాపేక్షిక సత్యం సాపేక్షిక అసత్యం
అనే రెండు వాస్తవాలను
రెండు అర్ధ సత్యాల స్థాయికి దిగజార్చలేను

సత్యమొక్కటేనన్న సత్యాన్ని మరిచి
గతి తర్కాన్ని అవహేళన చేయలేను

కష్టాల కడలిలో కడలు వెతుక్కోవడానికి
కన్నతల్లినే పరాయిదాన్ని చేయలేను

భూతకాల వ్యర్థ గీతాలను
వర్తమానంలో పలికి
భవిష్యత్తును తుచ్ఛ జీవితానికి అంకితం చేయలేను

గుండె పిండకుండానే రక్తం ఒడుపకుండానే
నెత్తురోడిన త్యాగాన్ని 'బలి' గా వర్ణించలేను

గులాబి పూల సువాసన గూర్చి
దానికున్న ముళ్ల గూర్చి

ఇప్పుడు చర్చించాలా నేస్తం

బ్రహ్మజెముడు పూల వాసనేం చూస్తావ్
ముల్లు గుచ్చి బతుకు సెప్టిక్ కావడం తప్పితే...

భూమ్మీద నిలబడి చూస్తూ
భూమే సూర్యుని చుట్టూ తిర్గుతుందంటావు

నీ చుట్టూ నీవు తిరుక్కోవడానికి
సిద్ధాంత రాద్ధాంతాలు
ఎందుకు నేస్తం వృధా ప్రయాస

1984

(1984 చీలిక తర్వాత ఒక సాహితీ గవాక్షం ఉన్నట్టుండి మూసుకుపోయిన తర్వాత)

దృశ్యం ఎర్ర బారింది

భూమ్యాకాశాలే కనురెప్పలుగా
చూపు చూపంతా మధ్యంతర ప్రపంచం

నిన్న పొడిసిన సూర్యుడు
నేడు విరిసిన చంద్రుడు
మధ్య మధ్య పొడసూపిన చీకటి ఉంది

పొగమబ్బుల్లో చిక్కిన అమాయకపు చూపుల నుండి
మేఘగర్జనల వేల మెర్క్యురీ దీపాల వెలుగువరకు
మూడవ కన్ను పురివిప్పగా
చూపు దృశ్యమై ఎర్రబారింది

చూపు మానవ క్షేత్రంలో
సూర్య చంద్రులు మొలచినంత తేజం

చూపు మనో ఫలకంపై
రణధ్వని మోగించిన ఉత్తేజం

మార్చి, 1993

దుఃఖం కాదు దిక్కులన్నీ పిక్కటిల్లాలి

నిశ్చయంగా ఒక్కనీటి బిందువూ రాలదు

కన్నుల్లో నీలి మేఘాలు ఆవరిస్తున్నా
చూపుల్లో చలివేంద్రాలు కనబడుతున్నా
గుండెనిండా సుడిగుండాలు ఆవిరవుతున్నాయి

గుర్తులన్నీ తాపంతో దహిస్తున్నాయి
అందుకే ఒక్క కన్నీటి బిందువూ రాలదు –
ఎప్పటికీ ఎండిపోని సముద్రానికి
మన కన్నీళ్లెందుకూ ....
కెరటాల దగ్గరే ఘనీభవించే చూపులెందుకు
ఆటుపోట్లను లెక్కగట్టడానికి
కన్నీళ్లు కాదు కనుచూపు సజీవం కావాలి

చూపును పదునెక్కించిన ఆకురాయి ముందు మోకరిల్లి
ససేమిరా కన్నీళ్లు కార్చకూడదు

కొండాపురం నుండి రాజన్నపేట వరకు
ఇక్కడ త్యాగం కిల కిల నవ్వడం నేర్చుకుంది

ప్రతిఘటనలో ఆగక, అలవక, వెరవక
మానేరు గల గల పారడమే నేర్చుకుంది

నిన్ననే కదా కరీంనగర్ నడిబొడ్డున
వాడి ప్రజాస్వామ్య మడి మైలబడి పోయింది
పురాణాల సాక్షిగా 'పవిత్ర' స్త్రీని
వాడు తొక్కుడు బిళ్లగా ఆడుకున్నాడు
అక్కడ 'స్వేచ్ఛ' అల్లిబిల్లి ముళ్ల కంపలయి
వార్తలపై, వాస్తవాలపై బలవంతంగా గుచ్చుకుంటున్నాయి –

మన కలలపై, తలలపై వేలాడుతున్న కత్తిగుచ్చి
లోకమంతా కోడై కూస్తూనే ఉంది
కోడి కూతలను నిషేధించాలని
వాడు నిద్రిస్తున్న వాళ్లను వధించడం నేర్చుకున్నాడు
ఈ జీవన్మరణ పోరాటానికి
ఒక సానుభూతో, ఓదార్పో, సహకారమో సరిపోదు

చావును జయించడానికి
మరొక యుద్ధభూమి నివ్వండి

శత్రువు స్తంభించేలా వాడినరాల్ని సలిపే
సంఘీభావమై పొంగండి

'ఎన్‌కౌంటర్లు' కాదు
మనుషుల్ని కృత్రిమంగా కాల్చిచంపే
కట్టుకథ రాజ్యమేలుతుంది

మానవ బాంబులు కాదు
పోలీసు బాంబు మూటలకే మానవుల్ని కట్టి

మాంసపు ముద్దల్ని వెదజల్లుతున్న చోట
కోపమో, వేదనో, రౌద్రమో ఏదయినా
ఒక్క కన్నీటి బొట్టు రాలకుండా
దిక్కులన్ని పిక్కటిల్లేలా నినదిద్దాం
ఒక్క కనుచూపు మందగించకుండా
ఎదురీదుతూ ముందుకే పయనిద్దాం

15 ఏప్రిల్ 1994

(రాజన్నపేట 'ఎన్‌కౌంటర్' తర్వాత కరీంనగర్ పట్టణంలో జరగాల్సిన "ప్రజలు - ప్రజాస్వామికహక్కులు - రాజ్యాంగ యంత్రం" అనే సదస్సును వేలాది పోలీసు బలగాలతో విచ్ఛిన్నం చేసిన తర్వాత...)

నగరమా!

ఎన్ని పల్లెలు చేరిన పట్నం నీవు
ఎన్ని వల్ల కాదులపై మొలిచిన స్వప్నం నీవు
ఎన్ని దారులు కల్సిన కూడలి నీవు
ఎన్ని పాయలు కూడిన కడలి నీవు

ఎన్ని తరాల తల్లివి నీవు
భిన్న స్వరాల గానం నీవు
కనిపించని గాయం నీవు
పచ్చదనాల నీ పాత గురుతులన్నీ
పొగజూరి పోయాయా
కల్లా కపటం ఎరుగని నీ కన్నులు
దుమ్ము రేగి పోయి
నిన్ను మనసులేని మందిరంగా
హృదయంలేని సాగరంగా మార్చాయా

అంగాంగం వ్యాపారమైపోగా
తడిలేని గొంతుతో పాడుతున్నావా
కళలేని ముఖంతో నవ్వుతున్నావా
కండ్లు లేని వాడికి ఎన్ని మెర్క్యురీ బల్బులుంటే

నగరమా!
చార్మినార్ సాక్షిగా చెప్పు
ఈ చార్ సౌలుగా ఏ చార్ సౌ బీస్ గాళ్ళు
నిన్ను శాసిస్తున్నారు
బాగ్‌లను బస్తీలుగా చేసి
బౌలీలను పూడ్చివేసి
అద్దంలా చేసిన భూముల్లో గద్దల్లా వాలి
ప్లాట్లేసిన వాడు ఎవడు?

లేచీ లేవగానే పాత చింపులు తగిలించుకొని
సంపాదనంతా సద్దిగట్టుకుని
పాచినోటి తోనే అడ్డాల మీద నిలబడి
ఒల్లంతా కళ్ళుచేసి పనికోసం చూసి
అద్దాల్లాంటి మేడలు కడితే
తోళ్ళు ఒలుచుకుని తివాచీలు చేస్తే
ఎండల్లో మరిగి రోడ్లుపోస్తే
వాటి నేలుతున్న వాడు చార్ సౌ బీసా? కాదా?

నగరమా!
ఉన్న వాడికి తరగని భాగ్యానివి
నిరుపేదల కందని ద్రాక్షవి
నిన్నటి కాళరాత్రులు కర్ఫ్యూనీడలు
అధికారానికి మెట్లవుతున్న శవాల గుట్టలు
సమ్మెలు లాకౌట్లు ధరల సమ్మెట పోట్లు
ఇన్ని వైవిధ్యాలకు బురఖాలు గప్పి
ఎన్ని ఏకత్వాల గారడీలు చేస్తున్నావు

మా మూపులపై మొలిచిన భవనాల మధ్య
మా వీపులను పరుచుకున్న రోడ్ల మీద
పూటకో సంబరమంటూ
లయలేకుండా నర్తిస్తున్నావు
స్పృహనెందుకు నియంత్రిస్తున్నావు

నాగరికతని మార్వాడి కాట్లో
తాకట్టు పెట్టిన నగరమా నీకో నమస్కారం
ప్రతి విషాదానికి స్పందించే గుండె మాది
ఈ గుండెల్లో రగిలే విశ్వాసమే
నీ గుండె కవాటాలకడ్డంగా పెరిగిన కొవ్వును వదలగొట్టి
ఎప్పటికైనా
మనసున్న మందిరంగా నిర్మిస్తాం
హృదయమున్న సాగరంగా ప్రవహింపజేస్తాం
శ్రమజీవుల సౌందర్యంగా వెలుగొందిస్తాం
పరాయికరణల బంధవిముక్తి చేస్తాం

1.8.1991

నలుపు

తరతరం గడిపిన భూతల్లి ఒడిలో
మన్ను బుక్కి మన్ను గక్కిన ఆనవాలే నా దేహం
ఎవడి కోసమో పండి
ఎవడి కోసమో ఎండి
ఎవడి కోసమో మండి బొగ్గులయిన దేహాలు
నలుపుగాకుండా తెలుపెలా అవుతాయి -

నలుపయి నలిగిన దేహాలు
బూడిదగా రాలిపోతున్నాయి
మా బూడిదను మా చేతుల్లోనే అరిగించి
మీరేసిన బండెడు బోళ్లను తోమి
మల్లెల్లాగా తెల్లగా కడిగిన వాళ్లం
తోమి తోమి మసిబారిన చేతులు
నలుపుగాక తెలుపెలా అవుతాయి

బతుకు బండ చాకిరయి
ఎండలో మాగిన వాళ్లం
ఎండలో మాడిన వాళ్లం
ఎండలో వేగిన మా దేహాలు
నలుపుగాక తెలుపెలా అవుతాయి

చాలీ చాలక సగం కడుపుకే తిన్న
పిడికెడు మెతుకులు
కాయకష్టానికి కరిగి
అణువణువు మండి చెమట ధారలై కారిపోగా
అట్టలట్టలుగా మట్టిగట్టిన దేహాలు
నలుపుగాక తెలుపెలా అవుతాయి

మా కాళ్ళు నాగళ్లయి
మా చేతులు పలుగుపారలై
మా వేళ్లు నాటిన మొక్కలై
మా అరచేతులు గొర్రు దిండులయి
మా దేహాలు దుక్కిలో ముక్కలు చెక్కలై
మా తనువుల్ని తరి భూములుగా
నల్లరేగడి నేలలుగా మార్చి
గుత్తులు, గుత్తులుగా పత్తుల్ని పండించాము
ఆ పత్తులు పూజా వత్తులయితే
అల్లిన నరాల దారాలై తెల్లటి వస్త్రాలయితే
మా తనువులు మాత్రం నాసిరకం
నలుపు రంగుగా ముద్రవేయబడ్తున్నాయి –

అయ్యా!
ఎండమావు లెరుగని
ఏ అసహజ పండు మొఖాలు మాకొద్దు
అరువు తెచ్చుకున్న నాజూకు దేహాలు అసలే వద్దు
ఈ నలుపే మాకు సహజమైంది

చెమటతో కట్టుకున్న ఈ గూడులో
మా తాతా ముత్తాతలు నలుపే
మా అవ్వ నలుపే
మా అయ్య నలుపే
మంచిని, మానవత్వాన్ని పులుముకోవడానికి

శ్రమైక్య సౌందర్యాన్ని అందుకోవడానికి
నేనూ... నా కొడుకూ ఇద్దరమూ నలుపే..!?
నలుపు... నలుపు... నలుపు...
మేము బొగ్గులమే కాదనలేం
ఇక మా గురించి మేం మాట్లాడటానికి
నిప్పు కణికలమై రాజుకుంటున్న వాళ్ళం

సెప్టెంబర్ 8, 1993

నాయినా ....

నాయినా బాగున్నావే ...

బురదలో బొర్రీ బొర్రి
బురద బొంతయిపోయిన తోలు ముడతలువడి
ఎండి ఇర్రిర్రు మంటుంటె
పట్టన పల్గి రవుతాలు కారుతుంటె
నాయినా పాణమెట్లుందే..

సీము బట్టిన పుండు లెక్క సలుపుతున్నాదే...
ఎదురెక్కే చేపలకు ఎడెగొట్టినట్లు
బతుకే కింది మీదయి పోయింది గదనే...
పాసి పోయిందో, పూసిపోయిందో
బుక్కెడంత సల్లపడకుంటె
బొక్కలన్న నిలబడయి గద నాయినా -

నాసులెక్క గడ్డం, సౌరం బెరిగింది
కాల్లు చేతులు కట్టెలకంటె కడీన[1] మైనయి
బొచ్చె[2] నేము అట్టి చాపలెక్క ఎండిపోయింది
బొండిగల మిగిలిన కొన పాణంతోటి
నాయినా... జెర్ర లేసి అటీటు తిర్గుతున్నావే -
కండ్లెక్కడో పాతాళంలో చిక్కి

బాయిల వడ్డోడు ఆరాటపడ్తున్నట్లున్నయి
పొద్దుమాపు చాపలు పట్టీ పట్టి
ఇగ నీకు నిద్రెక్కడిది ఆగారమెక్కడిది
నీ రొండు కండ్లు చాపకండ్లయి
నీ కడుపు కష్టంతోటే మిగిలిపోయింది గద నాయినా...
ఎగిల్లార[3] కముందే లేసి
సలికి వణుకువట్టీ సస్తవన్నా వినకుండా
పెయ్యికి జోరబొంత లాంటి చెద్దరుగట్టి
నెత్తికి రుమాల్ సుట్టి
కాల్లు చేతులు కొంకుర్లువడ్తున్నా నువు షికారికి[4] పోతుంటె
నాయినా... నీకు కండలు లేకున్నా
కలేజా ఉన్న సిపాయి లెక్క ఉన్నవే
తోపెల[5] గూడ నీ భుజమ్మీద తుపాకి లెక్క గొడ్తుంది -

తూంకాలువకటుదిక్కు పోకే

పీతుల్ల చాపలు వడ్తున్నవని
పోరంగాండ్లంత ఎక్కిరిత్తుంద్రంటె -
ఏంది బిడ్డా మన కడుపుల లేదుర పెండ
బువ్వలేకుంటె అదిగూడ రాదని బోదనవ్‌చేసి
నాయినా... నువ్వు ఏదాంతి లెక్క కనిపిస్తున్నవ్ ...

కడుపు నొప్పికి వాటు కుదరక
గడ్డమీద కూలవడి
నువ్వు చాపలెక్క తండ్లాడుతుంటె
నాయినా నాకు చాపలుగాదే...

బుట్టినిండా కన్నీల్లు కనిపించినయి
నీల్లల్ల నాని నాని చెడిపోయి
మెత్తవడ్డ అరికాల్లకు
సీకిపోయిన ముల్లు కూడా కుచ్చి ఇర్గుతుంటె
మెత్తగుంటే గిదే బాధ బిడ్డా
అడ్డమయినోడు మన మీద నీలుగుతడని
బుద్ధిమాట జెప్పినవు గదనే

మన బతుకెందుకు గిట్లున్నదంటె
సిలుక్కొయ్యకు ఉగులాడుతున్న
అన్న వాడుక బింకిని జూపించి
ఈడ పనికిరానివన్ని గట్ల కొయ్యకెక్కి మూలకు వడ్డప్పుడే
మూలకు వడ్డ మన బతుకులు ముంగట వడ్డయని
నాయినా... నువ్వు కమ్యూనిస్టు లెక్క మాట్లాడినవ్

నీ మీసాల్లో రోషాన్ని
నీ కండ్లల్లో ప్రేమను
నీ గుండెల్లో తెగువను
సూసుకుందమన్న నువ్వు లేవు
నీ పోటువ కూడా లేకున్నా
చెర్లల్లో, కుంటల్లో, వాగుల్లో
సప్తసముద్రాల్లో
నీ అసంటోల్ల రూపాలను జూసుకుంట
మేమింకా బతికే ఉన్నం

మీరు నీల్లమీద నిలబడి
కాళ్లమీద నడుసుకుంటా వచ్చి
కడుపు నిండా మాట్లాడాలనే గదా నాయినా...
మేమింకా సాగిపోతూనే ఉన్నాము...

1.7.93

(కన్నతండ్రి స్మృతిలో...)

(1. కడీన = కడుహీనమైన; 2. బొచ్చె = ఛాతీ; 3. ఎగల్లార = వేకువ; 4. షికారు = వేట; 5. తోపె = చేపలు పట్టే సాధనం)

నిత్యసత్యం

అధికారం మీ గొంతుకు
ఉరిత్రాళ్ళే బిగియించిన

భూస్వామ్యం ధనస్వామ్యం
జమిలి దాడులు జరిపిన

పోలీసులు మీ కీళ్ళను
లాఠీలతో లెక్కించిన

మితవాదం అతివాదం
ముంచేయగ వెంటాడిన

పిరికోడు పోరునిడిచి
శత్రువుకి తలవంచిన

సమలోకం నవలోకం
సాధించగ నడుంగట్టి

ప్రతిఘటనా పోరులోన
ప్రాణాలే త్యజించినవారం

మడమ తిప్పని వీరత్వం
పోరుబాటే నిత్యసత్యం!

నీ కోసం నా కోసం – మనందరికోసం

నీకూ నాకు మధ్య ఉన్న సంబంధం
బంధనమై బిగుస్తున్నప్పుడు
కొన్ని అనురాగాలు వినపడవు
కొన్ని ఆత్మీయతలు కనబడవు

మన మధ్య గాలి కూడా
కనిపించని ఉక్కుతెర అవుతుంది
గొయ్యి కూడా పూడ్చలేని అగాధమవుతుంది
పోట్రాయే కొండరాయై వెక్కిరిస్తుంది
మౌనం కూడా అణువణువును చీల్చే
విస్ఫోటనమై పేలుతుంది

నీకూ నాకూ మధ్య ఉన్న సహచర్యం
సహజీవనం చేయనప్పుడు
విమర్శ కూడా విచ్చుకత్తి దూసినట్టే ఉంటుంది
మందలింపు తల తెంపిన అనుభూతినిస్తుంది
హెచ్చరిక వారెంటు భూతమై వెంటాడుతుంది
అప్పటివరకు మనలో బంధీ అయి ఉన్న 'నీవూ', 'నేను'
బంధ విముక్తుల మవుతాం
నీకూ నాకూ మధ్య ఉన్న ప్రపంచాన్ని వదిలి

నీవూ నేనూ తలో ప్రపంచమవుతాం
అప్పుడు మన చర్చల తలుపులన్నీ మూసుకుపోతాయి
ఇక ఎవరి తలపులు వారివై
తలుపుల్లేకుండా పారి గదినిండా వ్యాపిస్తాయి

ప్రపంచానికి నాలుగ్గోడలకు మధ్య
బాధామయ దృశ్యం కనబడదు
బాంబుపేలిన శబ్దం వినబడదు
పట్టపగలే దట్టమైన చీకట్లు కమ్ముకుంటాయి

నీకూ నాకూ మధ్య అవగాహన
సజీవ ప్రవాహ మైనప్పుడే
మబ్బు తెరలు ఒక్కొక్కటి విడివడి
మసకనుండి పారదర్శకం వరకు పాదరసంలా పారి
వెలుగు స్పష్టీకరించబడుతుంది

అప్పుడు ఆలోచన కళ్లకు రేడియం తొడుక్కుని
అన్ని వేళల్లోనూ 'నిన్నూ' 'నన్నూ' పోల్చుకుంటుంది
నీకూ నాకూ మధ్య మారుతున్న ప్రపంచంలో
నీవూ నేనూ ఎక్కడో ఏమిటో తేల్చుకుంటుంది

26 మే 1993

(పార్టీ కమిటీలు మిత్ర వైరుధ్యాలు వ్యక్తిగత పోకడలతో శత్రు వైరుధ్యాలుగా పొడసూపుతున్నప్పుడు, విప్లవ సమాచారాల మధ్య అనైక్యత చీకట్లో వెర్రితలలు వేస్తున్నప్పుడు...)

నీరూ - మీరూ

నీరూ మీరూ
ఎండే ఎడారి
పొంగే గోదావరి
కరువూ వరదల మధ్య
కన్నీళ్ల సమతూకం

నీరూ మీరూ
మోడువారిన జీవితం
తడ్పిమోపెడయ్యింది
నీరై పారిన చెరువుల్ని కూల్చి
నీటి గుంటలు తవ్వడమొక కళ
తడారని కుంటల్ని కడతేర్చి
వాటర్ షెడ్లంటూ కోట్లు దిగమింగడమొక విషాదం

నీరూ మీరూ
పాపమో శాపమో
చెట్లు నరికే వన సంరక్షణ ముందు
ఋతువులే క్రతువులైన
భూగర్భ శోకం

వినండి!
భూమిని కబళించిన 'జన్మభూమి'
నీటిమూటల ఆదేశం
రండీ! నీళ్లను నీరుగార్చిన సేవకులారా
నింగి నేలకు నిచ్చెన వేసిన
వాన చినుకుల్ని బంధించండి–
వరసలు మారి వరదలే జీవితాల్నీ ముంచేస్తే
కుర్చీకిందకు నీళ్లు రాకుండా
వరద సహాయం ఎరవేయండి

నీరూ మీరూ
అంతా కట్టగట్టుకుని కొట్టుకుపోయింది
కరెంటు కాళ్లను కట్టెయ్యడానికి
కట్టలు తెగిన నీరు కూడా తోడయ్యింది
పోటెత్తిన నీళ్లతో
కాటెయ్యబడ్డ జీవితాలపై
పీపాలకొద్ది మొసలి కన్నీళ్లు కార్చండి
మానవ (సం)'హారమే' ఆహారమైన ప్రపంచ బ్యాంకు ఖాతాలో
మరో సరికొత్త అకౌంటుకై త్వరపడండి

('నీరు - మీరు' పేరిట ప్రచార ఆర్భాటాల మోసం ప్రపంచబ్యాంకు పాలన రాష్ట్రాన్ని ఏలుతున్నపుడు)

పిరికి

పోరాడే వారికి
పిరికి తన మెప్పుడూ
ఆక్సిజన్ కాదు
కార్బన్ డై ఆక్సైడ్‌లా
అది చైతన్యాన్ని చంపేస్తుంది

ఒక్కోసారి అది
విప్లవానికే రియాక్షనిస్తుంది

కాపాడుకున్న కన్నులను
రెప్పలతోనే పొడి చేయిస్తుంది

గుండె కవాటాలకు కొవ్వయి అడ్డుకుంటుంది
తన స్పందనలకు తానే బంధీ
తనలోనే ఉంటూ తనువును వేరు చేస్తుంది
మనతోనే వస్తూ మనస్సును కోల్పోతుంది

1984

పునాది

మేఘాల నుండి రాలుతున్న చినుకుల్లో కూడా
నాకు ఆవిరైన నదీనదుల కన్నీళ్లే కనిపిస్తున్నాయి

చీకటిని జయించిన దీపం ప్రక్కన
పండిపోయి మౌనంగా రాలిపడ్డ
అగ్గిపుల్ల ఆత్మ బలిదానం కనిపిస్తుంది

జీవితాన్ని అగ్గిపెట్టెగా మార్చి
చెమటంతా గంధకపు పూతయి పూసిన
శివకాశి తమ్ముళ్ల చేతివేళ్లు
మాంసంలేని బొక్కల్లా తెల్లగా
నాకు అగ్గిపుల్లలై కనిపిస్తున్నాయి

కొమ్మలను రెమ్మలను పూస్తున్న పువ్వులను
మోస్తూ కనబడ్తున్న చెట్టు కింద
నిక్షిప్తమై ఉన్న వేర్లలో
నాకు అలుపెరుగని కావడిగాళ్లు కనబడ్తున్నారు

రంగు రంగుల మేడల క్రింద
కనిపించే గోడల క్రింద
రహస్య జీవితం గడుపుతున్న పునాదులే కనిపిస్తున్నాయి

రాజుకుంటున్న ప్రతి మంటలో
ఊపిరితిత్తులే గొట్టాలయి
ఊదిన దృశ్యం కనిపిస్తుంది –

ఒక ప్రతిస్పందన వెనుక
ఆగిపోయిన వేల హృదయ స్పందనలు కనిపిస్తున్నాయి –

3.7.93

పులి - మనిషి

పులికి ఒక జీవితం
మనిషికీ ఒకే జీవితం
పులి ఆహారం కోసం వేటాడితే
మనిషి బతుకు వేటలో మునిగాడు

లాభాల కోసం సాటి వాడినే వేటాడే 'నాగరికత'కు
'సాకి'మృతి ఒక సానుభూతి సాకయి దొరికింది -
ఒలిచిన పులితోలు 'పాపం' ఏ మేకలు తొడుక్కున్నాయో గానీ
మేకవన్నె పులులన్నీ ఠకీమని సాధు జంతువులయినాయి
జనారణ్యపు బందీలై సగం చచ్చిన పులులు, సింహాలపై
మహా నగరం ఎన్ని ఆనందాలు మూటగట్టుకుందో
విషపు కోరల్ని నోట్లోనే దాచుకుంటూ
పాలకుల కళ్లల్లో ఎన్ని దోసిళ్ల నీళ్లు మీడియాను ముంచెత్తాయి
మనుషుల నెత్తురు పులుముకున్న ముఖాలపై
ఎన్ని విచారముద్రలు అలుముకున్నాయి
'మానవత్వం' ఉప్పొంగి ఎన్ని న్యాయవిచారణలు
ఊపందుకున్నాయి

సాకీ...!
పసందైన పక్షులు, లేళ్లు, దుప్పులయి
మంత్రుల విందు భోజనం కానందుకు
నీ కెంత మూల్యం దక్కిందో కదా!

'శాంతి' భద్రతల దూతలకు
'అహింసా' కారుణ్య ప్రదాతలకు
నీ చావు ఎంత అపచారం తప్పించిందో
రొమ్ము పాలుపిండి అమ్మనని నిరూపించుకోవాల్సిన చోట
పులీ! నీకు జనారణ్యవాసం తప్పదు
మనిషీ!! నీకు అరణ్య న్యాయమైనా దక్కదు

నవంబర్, 2000

(హైదరాబాద్ జూలో 'సాకి' హత్య తర్వాత)

పేటెంట్

భూమిని చాపచుట్టవలె చుట్టుకుని
చంకలో పెట్టుకుని ఉడాయించాడంటున్న
హిరణ్యాక్షుని కథవింటూ
భూమి కంపించి కలియుగం అంతమవుతుందన్న
అత్యంత భయాల మధ్య
తన బతుకు తానయి పెరిగిందో వేపచెట్టు

దళితుల్లాగే తన బతుకు చేదయినా
దాని శక్తిని చూసి అచ్చెరువొందాడో డంకెల్

ఆర్థిక రోగాలతో పుచ్చిపోయిన తన దేహానికి
వేపమందు కావాలట
దేశంలోని వేపలన్నీ ఇక వాడే వేపుకు తింటాడట

మన పళ్లగ్రను, ముల్లుగ్రను లాక్కుని
వాడు మన పండ్లు రాలగొడ్తాడు
మన బువ్వను, బుద్ధిని, చేనును, చెమటను
సర్వస్వం హరించ మరిగినవాడు
భూమిని గుండ్రంగా మలిచి
కోట్లాది బోయీల వీపుల పైకెత్తే ఆధునికతగా ఎదిగి
భూమిని వీడి గాలిలో ఎగుర్తున్నాడో కలియుగ హిరణ్యాక్షుడు

వాని గాలిబరువును కూడా మోయాలంటూ
ముల్లు గర్రతో పొడిచి పొడిచి చంపుతాడు
పేటెంట్ల పేర జీవితాలు కబళిస్తున్న వానికి
మనమే కొన్ని అదనపు హక్కుల్నిద్దాం

ఇదిగో
ఈ భూకంపాలను పేటెంట్ చేసుకో
గూడు చెదిరి వల్లకాడులే మిగిలి అన్నీ కోల్పోయి అనాథలైన
జీవచ్ఛవాల విషాదాన్ని పేటెంట్ చేసుకో
కరువు కాటకాలను, కష్టాలను, కన్నీళ్లను
దమ్ముంటే పేటెంట్ చేసుకో
లేదంటే నీ చావును మేమే పేటెంట్ చేస్తాం

2 అక్టోబర్ 1993

*(గుజరాత్ భూకంపం సందర్భంగా పేటెంట్ హక్కులు,
డంకెల్ ప్రతిపాదనలను నిరసిస్తూ...)*

ప్రాణం

పదహారు వసంతాల అజ్ఞాత సూర్యుడు
అలిసిపోని నిత్యయవ్వన తేజుడు

ఆగిపోయిన ఆ గుండె చప్పుడు
అడ్డగలదా అతని స్ఫూర్తినెప్పుడు

బాణమై బ్రతికినోడు
ప్రాణమాయెను ప్రజాపోరుకు

1985

(సి.పి.స్మృతిలో...)

ఫలితమెవరిది

మోడువోయిన నేలతల్లి
వానజల్లుతో పులకరించెను

బీడు భూములన్ని తడిసి
పచ్చదనముతో విస్తరించెను

గొంతులెండిన గోండ్రుకప్పలు
బెక బెకలతో పలకరించెను

వరద నీటిలో పిల్లజెల్లా
సరదాల ఆటలాడెను

అంకురించిన రైతు ఆశలు
లేలేతగ చిగురించెను

మూలపడిన నాగళ్లు
పుడమిపైన అడుగుమోపెను

డొక్కలెండిన గోదలన్ని
లెంకపెట్టి ఆటలాడెను

సుడిగట్టిన బర్లు ఆవులు
లేగ దూడల వెంట దెచ్చెను

మొఖము వాసిన జున్నుపాలు

కడుపునింపగ కదిలివచ్చెను

నల్లేరి నాట్లేసి కలుపు మొక్క లేరివేసి
వరికోసిన రైతు కూలి వరాల పంట దీసెను

గుండె అలసలు నిండిపోవగ
గొంతులెన్నో పాటపాడెను

పంట రాజుకు మోకరిల్లి
పొట్టేలును కోత పెట్టెను

పిట్టనుండి పితకనుండి
పైరునంత రక్షించెను

ఆరుగాలపు చెమట నెత్తురు
ఫలితమ్ముగ పంట దీసెను

కర్మజీవై మర్మ మెరుగని
రైతు నిర్భాగ్య జీవియాయెను

కష్టమెరుగని భూస్వామి ఫలితమంతా తన్నుకెళ్లెను
రైతు కన్నీరు తగిలి పొలం ఎర్రబారెను

1982

బంతిపూవై వికసించు

నిన్నటి పడమటి శిఖరాల అంచులపై నిలబడి
రేపటి నూతన భానూదయానికి ఆహ్వానం

గతకాలపు చీకటి కోణాల చిక్కుముడిని
రేపటి ఉషస్సు కాంతిలో విప్పే ప్రయత్నం

నిర్జీవపు నిరాశలను దునుమాడి
భవిష్యత్ ఆశా కుసుమాలను విరబూస్తూ
కదలిరా కొత్తకాలమా

క్రాంతికి వినూత్న నిర్వచనమై
మా లోగిళ్ళ ముద్ద బంతివై వికసించగా

1 జనవరి 1989

బాటే స్నేహం

జీవితం ఏక గవాక్షం కాదు
స్వనిర్ణితం అసలే కాదు
ఒకే గమనంలో పయనిస్తున్నా
రెండు తీరాల మధ్య నిర్మించుకున్న వారధి అది

రెండు తీరాలు వేరైనా
వాటి దూరం మాత్రం సమాంతరమే
రెండు గొంతులు వేరైనా
వాటి గానం ఒక్కటే
మమతల కోనలో కురుస్తున్న చిరుజల్లులు
అగ్ని గుండాలై రగలొద్దు మిత్రమా...!

గుండెలవిసినప్పుడు
కలేజా కదిలినప్పుడు
కళ్లల్లో వేడికన్నీళ్లయి పరామర్శించేది నీవే
మదినిండా వెన్నెలలు కురిపించేది సహచర్యమే
ఇక ఇక్కడ వెతుక్కోవడానికి
వేరే దారులు లేవు
ఎంచుకున్న దారిలో
కడదాకా కలసి ప్రయాణించడమే స్నేహం

14 అక్టోబర్ 1991

(కా॥ శశికి వ్రాసిన లేఖల్లో ఒకటి)

బాబన్నా....

బాబన్నా...
మన అడుగులతో పదునెక్కిన రహదారిలో
ఇంకా సుదూర యానం మిగిలే ఉంది
నెత్తుటి చారికలే రేడియమై మెరుస్తున్న మైలురాయి
మన గమ్యం దూరాల్ని కొలుస్తున్నది

త్యాగమే ఆయుధమై అందివచ్చినప్పుడు
నీ ముందు త్యాగమే పరుచుకుంది
మానేటి ప్రవాహమై అది
పల్లెల్ని ఎల్లల్ని తాకి వస్తుంది

బంధీయైన అర్థ ప్రపంచం హక్కులను
కాలరాస్తున్న రాజ్యమే
నీ జీవించే హక్కులను బంధీ చేసింది
జీవితాన్ని బంధ విముక్తం చేయడానికి
అందుకున్న బందూకుతో
ఎండిన మానేరు నిండా
తొలకరి జల్లయి కురుస్తూ
బాబన్నా...!
కదిలిరా మేఘమై వేగంగా...

మే, 1999

(తన జీవిత సహచారి అరెస్టు వార్త తెల్సి రాజన్నపేటకు వెళ్లిన సందర్భంగా పోలీసులు పట్టుకొని తను పుట్టి పెరిగిన గ్రామంలోనే కాల్చి చంపారు.)

మరణ గానరాగం

ఈ కోణంలోంచి
జీవితం పలికేది మరణ సందేశమే
మరణాన్ని శాసిస్తూ జీవించమని
నూరేండ్ల జీవిత రహస్యాన్ని మూటగట్టి ప్రకటిస్తున్నా

పరుచుకున్న దారిలో
పాదాలలో కంటకాలు
కళ్ళలో మాత్రం అలక్ష్యత లేని లక్ష్యం
దారి తప్పని చూపే జీవిత రహస్యం
దరిలేని వ్యవస్థే మరణ సందేశం

జీవితం ఆకారంలా గాకుండా
ఆనవాలుగా వర్ధిల్లుతుంది
పడవకు ప్రయాణమే జీవితం
పడవ ఆగినా ప్రయాణం ఆగదు

పునర్జన్మ కలకోసం
ఈ జన్మ వృధాకానివ్వను
మరణ గాన రాగాల్ని కూడా
జీవితమే మ్రోగిస్తుంది నలుదిక్కులా!

1998

(అమ్మ జ్ఞాపకంలో)

మరణం లేని పోరాట జీవితం

పరాయీకరించబడ్డ బతుకుల మధ్య
పరాజితులు కాకుండా జీవిస్తున్న వాళ్ళం
పొంచి ఉన్న మరణంతో
ప్రతిపూట పోరాడుతుంటాం
అప్రతిహత జీవితానికై
అనుక్షణం ఆరాటపడుతుంటాం

జీవన్మరణ పోరాటంలో
మరణించిన వారి జీవితం మనం
మరణం లేని పోరాటం మనం

కాటువేసే కాలనాగు పక్కన
బారులుదీరిన చీమలదండు మనం
మనపుట్టలో దూరే వానితో
మనల్ని వేటాడి చంపే వానితో
పోరాడకుండా బ్రతకలేని వాళ్లం

పాములకు భయపడి చీమలపుట్టలు అదృశ్యం కాలేదు
పుట్టలేకుండా పాములతో పోరాటమే లేదు
మందబుద్ధిని చంపుకుని

ముందుచూపుతో బ్రతుకడమే చీమ జీవితం
కండ్లముందున్న ప్రపంచాన్నే చూద్దాం

ప్రతిజాలరి పడవ కడలి కెరటాల్లో ఊగుతూ
ప్రమాదం పైన్నే ధీమాగా సాగిపోతుంది
తాటిచెట్టు ఎక్కేవాడు రోజూ మృత్యువు దాకా పాకి
మృత్యుంజయుడయి తిరిగివస్తాడు

ఎవ్వరూ జీవితాన్ని గ్యారంటీగా కొని తెచ్చుకోలేరు
ఎవరూ మరణానికి దూరంగా దడికట్టుకోలేరు
జీవించడం కోసం శ్రమించడం
మరణం మధ్య జీవించడమే నిత్య జీవితం....

త్యాగం ఒక జీవిత సత్యం అయ్యింది
నేలనంటే బిడ్డ నెత్తుర్లలోనే జనిస్తుంది
కాలం లోకం చుట్టే పరిభ్రమిస్తుంది
త్యాగం కూడా లోకాన్నే వరిస్తుంది
త్యాగాల ఊటగాపుట్టి ఉద్యమ సాగరమై పొంగినవాళ్లం
గూటినుండి ఎదిగి కోటలో పాగా వేసినవాళ్లం

మనకు ఏ జీవితం నిశ్చలంగా లేదు
మనకు ఏ మరణం దుర్భరంగా లేదు
ఎవడూ కూల్చలేని జీవితాలు మనవి
ఎవరూ వెలగట్టని మరణాలు మనవి

జీవన్మరణ వైరుధ్యం సమాంతర ఫలితమైనచోట
మరణమెప్పుడూ తెరచాటునే ఉంది
జీవితమే ఒక యుద్ధ రంగమయ్యింది....

ఒక్క నీవూ నేనే కాదు
యావత్ప్రపంచం
అసహజ మరణాల కత్తి అంచుపై నిలబడ్డది

నిండు నూరేళ్లు బ్రతకమని దీవించడం హాస్యాస్పదమైంది
గాయపడ్డ గుండెల సాక్షిగా
సహజ జీవితాల్ని జయించడానికి బ్రతక్క తప్పదు

చావు బతుకుల మధ్య సంఘర్షణలో
ఒక తరమెప్పుడూ మరణించిన వారి
నిజ జీవితమై ఎదుగుతుంది
మరణం లేని పోరాట జీవితమై వెలుగుతుంది

20 సెప్టెంబర్ 1994

మేడే

పెట్టుబడి ప్రపంచాన్ని ఉగ్రూతలూగించి
పనిగంటల తగ్గింపుకు రణగంటలు మ్రోగించి
కార్మిక జన సందోహం తమ నెత్తుర్లను చిందించి
అమరవీరుల సాక్షిగా అరుణపతాక మెగిరించి
చికాగో కార్మిక వీరులు పోరి హక్కుల్ని సాధించి
ప్రపంచ కార్మిక ఐక్యతకై మే-డే అట నినదించి
చిగురించిన చైతన్యం ప్రపంచాన్ని ఆవరించి
ఒక శతాబ్ది మే-డే యుగమట్టే గతియించె

కమ్యూనిస్టు మేనిఫెస్టో వర్గ విముక్తి సూచన
మే-డే ఆ పోరాటపు ఆచరణాత్మక సాధన
పారిస్ కమ్యూన్ ప్రజల తొలి విజయ కేతనం
రష్యా, చైనాల్లో నిలిచె ప్రజారాజ్య స్థాపనం
ఆర్.ఎన్.ఐ విజృంభణ షోలాపూర్ కమ్యూన్
రగిలే ఉద్యమాలు కూడా ఈ భరత గడ్డన

గత శతాబ్ది సమరంలో పదునైన మే-డే
పాలకవర్గం చేతజిక్కి అదుపు తప్పి వాడె
దోపిడిపై శ్రమశక్తి గర్జించిన నాడే
రాజ్యహింస పడగవిప్పి కార్మికున్ని చెండాడె

అనునిత్యం శ్రామికున్ని అణచి వేయు పాలకుడే
అపసవ్యపు రాగాలతో మే-డే గీతిక పాడె

యజమానికి, కార్మికునికి మూడు ముళ్లు వేయగ
పరస్పర సహకారం మారుమ్రోగె జోరుగ
ప్రచార సాధనాలు అధికారపు దరువేయగ
మే-డే ఇక మారిపోయె శివరాతిరి జాతరగ
రక్తాలతో రాసుకున్న ఘన చరితకు మారుగ
అధికోత్పత్తంటూ చేసిరి కార్మికులను దగా

హే మార్కెట్‌లో హోరెత్తిన తిరుగుబాటు సంకేతం
మే-డే పోరాట దీక్షగ ఉదయించెను ప్రభాతం
తుపాకి గుళ్లకు చిందిన జనరక్త సింధూరం
ఉరికొయ్యల ఎదుట నిలిచి విశ్వసించె భవితవ్యం
ప్రపంచ కార్మిక ఐక్యత దాని గమ్యస్థానం
సామ్రాజ్య వాదాన్ని చేద్దాం భూస్థాపితం

మే-డే ఝుం ఝూ మారుతం వెలసిన ఈ విశ్వం
శ్రమజీవులకే తుదకు అవుతుంది స్వంతం
మే-దినపు ద్రోహుల మోసాన్ని ఓడిద్దాం
వాడుతున్న మే-డేను వాడి జేయ కదులుదాం
సమరాలను సాగించి సాధించిన మే విజయం
త్యాగనిరతి దీక్షలతో వెలిగిద్దాం ప్రతిదినం

18 మే 1986

మొలైసె ఉరి

నల్లజాతి ప్రజలపైన ప్రకటించి యుద్ధం
శ్వేత జాత్యాహంకారంతో నిలువగలదా రాజ్యం

నలుపు, తెలుపు మనిషిలోన ఎరుపే కద రక్తం
దోపిడి సంరక్షణకు రంగేనా మీకడ్డం

మొలైసె ఉరితీతతో కార్చిన కన్నీళ్లు
మీ దుర్నీతిని చెండాడగ పొంగే ప్రవాహాలు

(ప్రిటోరియా ప్రభుత్వం మొలైసెను ఉరితీసిన సందర్భంగా)

యుద్ధవీరుడు

యుద్ధ వీరుడెపుడూ నేల విడిచి సాము చేయడు
భూమి యుద్ధరంగమే కాదు
భూమే యుద్ధమైన వేళలో
తనను ఖండించే ప్రతి అంగం ఆయుధం కావడానికి
తానే ఆ నేల కావాలని వేనవేల కలలు కన్నాడా యోధుడు

భూమ్యాకాశాల మధ్య ఆవరించిన అడవిపై
కాచిన వెన్నెలకాంతుల్ని ఆస్వాదించి
కలువల్లా గిరిజనుల కన్నుల్ని పూయించి
విప్పారిన వారి హృదయాల మధ్య తనువిత్తయి
గుత్తులు, గుత్తులుగా పండిన ధాన్యరాశి మన వీరుడు

భూమి, పంటా, అడవి అన్నీ తమవై
అన్నింట్లో తాము పరాయి వాళ్లమవుతున్న అడివి బిడ్డలతో
ఆక్రమిత భూముల స్వాధీనంకై దండయాత్ర నడిపిన
యుద్ధ వీరుడెప్పుడూ నేల విడిచి సాము చేయడు

పెట్టుబడి పొగచూరి అడవి మోడయి పోతున్నప్పుడు
కంపెనీల కబంధ హస్తాల్లో చిక్కి శల్యమౌతున్నప్పుడు
సంస్కృతి, సంపదా పరాయీకరణ చెందుతున్నప్పుడు
అడవుల్ని మింగి పోడుల్ని నేరస్థులుగా ప్రకటించి
అభయారణ్యాల పేర అరణ్యాల్ని బంధీ చేస్తుంటే
తల్లి పాలకు కూడా వెలకట్టే అధికారపు కైంకర్యం

తల్లి ఒడినుండి తనయున్ని వేరు చేస్తుంటే
నేలై వారిని హత్తుకున్నవాడు
ఆయుధంగా వారు ఎత్తుకున్నవాడు
అడవి బంధనాలపై ఎక్కుపెట్ట బడ్డ
విలుకాడే మన చెలికాడు

తలవంచిన వెదురును గోటితో సంధించి
తల తెంచడం నేర్పిన మొనగాడు మన శంకరన్న
పిల్లన గ్రోవిలా దేహమంతా గాయాలైనా
గాయాలతో గానం చేసి
జనగానం అయినవాడు మన శంకరన్న
ఆకుల కన్నీళ్లు తుడిచి పువ్వుల కండగా నిలిచి
అన్నింటిని గుండె కద్దుకోవడానికి
తానే ఆ నేల కావాలని కలయిపండిన నిజం మన శంకరన్న

తానే భూమయి చెట్టును చేవను
ఫలాన్ని - ఫలితాన్ని అందిస్తూ
అనంతమయిన ప్రకృతిగా మనముందే సంచరిస్తూ
మన యుద్ధ వీరుడెప్పుడూ నేలవిడిచి సాముచేయలేదు
తనే నేలయి ప్రజా యుద్ధానికి భూమికయినాడు.

15-7-92

(కా॥ కృష్ణారెడ్డి (శంకరన్న) అమర స్మృతిలో...)
(1987లో పార్టీ పిలుపునందుకుని తన అనారోగ్యాన్ని సైతం లెక్కచెయ్యకుండా గోదావరిలోయ కెళ్ళి, ఆదివాసుల చెలికాడుగా, సహచరులకు ఆత్మీయుడిగా, శత్రువులకు సింహస్వప్నంగా మారి ప్రమాదవశాత్తు అమరుడయినాడు)

యుద్ధాక్షరాలు

నా కాలేయంలో అంతర్గత ఆలయమై
నా గుండెలో రక్త ప్రసరణా ధమనియై
నా ఊపిరితిత్తుల్లో నిండిన ప్రాణవాయువై
నా కదలిక వేగం పెంచే ఉత్ప్రేరకమై
నాతో తొణక కుండా నడుస్తున్న నేస్తానివై
నా ప్రియమిత్రుడు నిర్మిస్తున్న ఉద్యమం
తీరానికి నడిపించే విశ్వాసం

అతడు విద్యుత్ పుష్పాలను సృష్టిస్తూ
అతడు మేఘ సంద్రాలను శాసిస్తూ
అతడు కష్టాల్లో కన్నీళ్ళను త్యజిస్తూ
అతడు కదనంలో పిడికిళ్ళను బిగిస్తూ
అతడు గోదావరి నదిలో ఈదుతూ
ప్రవాహాల్ని ఆవాహన చేస్తూ
అతడు అడవి తల్లి ఒడిలో ఎదుగుతూ
మేటి విలు విద్యలు నేరుస్తూ
అతడు మృత్యుకొండల్లో నిలబడి
శతృగుండెల్లో మృత్యువై జీవిస్తూ...

నా చైతన్యపు సంగీతాన్ని సహస్ర బాణీల్లో మ్రోగిస్తున్నాడు
నా విప్లవస్ఫూర్తి చుట్టూ చెరగని రక్షరేఖలు గీస్తున్నాడు
నా కలం సిరా నుండి యుద్ధాక్షరాల్ని అందిస్తున్నాడు

(ఆదిలాబాద్ జిల్లా అడివిలో పనిచేస్తున్నప్పుడు కా॥ 'శశి'కి రాసిన లేఖ - 1986)

రాజన్నపేట మృత వీరులకు

ఎండల ఎడారులు దాటి పచ్చని వనం నిండా
పూసిన పువ్వులు మీరు

ఎండిన మానేరు నిండి అలలై పొంగి
అలలపై మెరిసే వెలుగులు మీరు

నిద్రలోసైతం నిప్పులు చెరిగి కారిన నెత్తురుసాక్షిగా
కడదాకా పోరాడిన వీరులు మీరు

ఇక మేము కన్నీరు కార్చం
కసితో రగిలి కన్నీళ్లతో కత్తులు ఝుళిపిస్తాం

అవ్వల అన్నల ఆరాటమంతా మూటగట్టుకుని
మేము మానేరు దళమై వస్తాం
మహాజన ప్రభంజనమై లేస్తాం

ఏప్రిల్, 1994

(రాజన్నపేటలో ఆరుగురు వీరులు పోరాడి నేలకొరిగినప్పుడు)

రైతు కన్నీరు తగిలిన పొలం?

జీవితాన్ని బంధీ చేసి
జీవన విలువల్ని ధ్వంసం చేసి
చెట్టుకు వేలాడుతున్న గబ్బిలాల్లా
తలక్రిందులుగా 'బ్రతుక'మంటున్నాడు వాడు
చీకటి తప్ప వెలుగుల్ని కోరవద్దని శాసిస్తున్నాడు

వాడు జీవించమని సృష్టించిన కొట్టం
మృత కళేబరమై పగుళ్ళు బారింది
అది పైన సాలెగూళ్లకు, కింద పందికొక్కులకు స్థావరం
జీవన విలువల బంధీ ధిక్కరిస్తే
వాడు మరణ వాంగ్మూలం మిగలకుండా
జీవితంతో చావు క్రీడలాడుతున్నాడు

జీవితాన్ని నియంత్రిస్తున్న వాన్ని ధిక్కరిద్దాం
జీవితాన్ని తలక్రిందులుచేసి ఆడిస్తున్న వాణ్ణి
నిటారుగానే ఎదుర్కొందాం
మనం సహజంగా నిలదొక్కుకోవడంలోనే
నిజజీవితాన్ని ఆవిష్కరించుకొందాం

22.5.92

*(కా॥ ఎం. శ్రీనివాస్ స్మృతిలో... శ్రీను మెదక్ చిట్కాపూర్‌లో పుట్టి
చిన్నతనంలోనే అనేక సంఘర్షణలు ఎదుర్కొని విప్లవోద్యమంలోనికి వచ్చాడు.
జంగుపెల్లి ఎన్‌కౌంటర్‌లో కన్నుమూశాడు.)*

వర్తమానం

వర్తమానం పరావర్తనం చెంది
అస్తమానం సరికొత్తగా ఉదయిస్తున్న
విద్యార్థులారా విజృంభించండి –

ఐదు అసమవేళ్ల పుక్కిటి పురాణాల్ని పుక్కిలించి ఉమ్మేసి
ఐదు నూతన సామాజికాస్త్రాల హస్తంలోని
ఒక్కొక్క వేలును ఉక్కు పిడికిలిగా మలవండి

ఇక కూడికలు, తీసివేతలు
దేశంనుండే కానీ దేహం నుండి కారాదు
చేయి నరుక్కునో వేళ్లు నరుక్కునో
వికలాంగులుగా మిగలొద్దు

నెత్తురోడుతున్న తల్లి ఒడిలో కూర్చుని
కత్తులు దూసుకుందామా...?
కన్నీళ్లే చూడాలనుకుంటె కళ్లల్లో పొడుచుకోనక్కరలేదు
బొక్కనై మిగిలిన తల్లిని ఎక్కడ రక్కినా కన్నీళ్లే...

అసమానతలను గుర్తించడంలో
చూపుకోల్పోని సహచరులారా!
మీ తోడుకై కండ్లు కాయలు గాసేలా చూస్తూ

నెత్తుటి ముద్దయిన వర్తమానంపై కర్తవ్యాలు రచించండి

నరకానికి వేసిన నిచ్చెన మెట్లను తెగనరుకుతూ
కాలుజారి పామునోట్లో పడగలమా?
సజీవ చర్చల్లో సంఘర్షించడమంటే
చీకట్లో తడుముకోవడము కాదు

ప్రియనేస్తాల్లారా!
తెల్లవారకముందే లేచి తెల్లబోవద్దు
ఎన్నో ఉదయాలను మోసుకుంటూ
వర్తమాన పరావర్తన రేఖలతో రక్తాక్షరాలు చెక్కండి
ప్రవాహాలు పాయలు పాయలుగా ఆవిరయ్యేచోట
పాయలే ప్రవాహమై సజీవనదిలా పారండి

1 ఫిబ్రవరి 1997

(నిజామాబాద్ పట్టణంలో జరిగిన రాష్ట్ర సదస్సులో విప్లవ విద్యార్థుల మధ్య చెలరేగిన ఘర్షణకు చలించి)

వంచిన శిరసుతో...

కరీంనగర్ జిల్లాలో
కర్కోటక భూస్వాముల
కెదురునిలిచి మెడలువంచి

ఖాకిరంగు అణిచివేత
కర్కశత్వ మెదిరించి
కాల్చేసిన కూల్చేసిన
కమ్యూనిస్టుగ జీవించి

పోరాటం డైరెక్షన్‌లో
చెదరని అమరత్వమ్మీది

సాగుతున్న సమరంలో
అమరులైన వీరులారా
అందుకోండి
అడుగడుగున రెడ్ శాల్యూట్స్

(1985లో 'క్రొన్నెత్తుటి దారుల్లో' అమరవీరుల చరిత్ర పుస్తకం నుండి)

వారసత్వం

మీ నెత్తుటి ధారలలో
ఎఱ్ఱజెండ ఎరుపెక్కె

మీత్యాగపు దారులలో
ఉద్యమాలు జీవించే

పీడితుల గుండెల్లో
మరుపురాని స్మృతిమీదే

అడుగడుగు మీ బాటల్లో
సాగుతున్న వారసులం మేమే

విజయం విజృంభిస్తున్న వాడిదే

ప్రవహించే కడలినుండి
పాయొక్కటి విడిపోయిన
కడలి చేరునూ గమ్యం
కదలి పోవునూ సత్యం –

అమరుల అరుణారుణ రక్తం
అందించెను ఒక మార్గం
దోపిడి బంధీఖాన చేధించగ
సంధించుము నీ బాణం –

వికసించిన ఈ పుష్పం
ఉషోదయాల్లోనే గానీ...
చీకటి మబ్బుల్లో గాదు
చిగురించిన ఈ అడవి
వసంత కాలంతో గానీ...
ఎండమావుల్లో గాదు
జ్వలిస్తున్న ఈ మార్గం
వీరుల త్యాగాలతో గానీ
పారుబోతు రాజకీయాల్లో గాదు

చేసిన ప్రతిజ్ఞలకీ
తీర్చాల్సిన నెత్తుటి బాకికి
మేం బాధ్యులం కాదనే కదా
ఎమర్జెన్సీ కష్టాల్లో
ఈనాటి సమస్యల్లో
వికృత అవతారాలెత్తావ్
అనవసర రాగాలు తీస్తూ
దరులు వెతుక్కుంటున్నావ్
పసలేని నీ రాగానికి
ఎన్నో శృతుల్ని కలుపుతున్నావు
అయినా అవి అపశృతులే

జార్జ్ నుండి చాంద్ వరకు
జంపాల శ్రీహరి రమణ సాంబన్నల
త్యాగం నుండి త్యాగం వరకు
కోదాడ నుండి సూర్యపేట వరకు
హైద్రాబాద్ నుండి ఖమ్మం దాకా
ప్రజ్వరిల్లిన ఈ విజృంభణ
పోరాడే వాడికే స్వంతం

నీ కుట్రలకు హారతి పట్టలేదని
కట్టుకున్న కోటగోడల్ని
నిష్కర్షగా కూలగొట్టాలనుకున్నావ్
మళ్లీ ఉట్టుట్టి మట్టిపెల్లల్ని పేర్చి
వాటికి రంగులు పూసి

పై పై షైనింగ్ లిచ్చి
ఓ నవ నిర్మాతగా, తిరుగుబాటు దారుడిగా పేరు పెట్టుకున్నావ్

తప్పు నీకున్న శక్తిదిగాదు
విచ్ఛిన్నం చేయగలనన్న నీ నమ్మకానిది
తప్పు పోరాటానికి ప్రతిరూపాలైన
విజృంభణ, తిరుగుబాటు లాంటి
విప్లవ పదజాలానిదికాదు
నీ పుర్రెల్లో మొలిచిన అన్య ధోరణులది

కామ్రేడ్స్!
కాషాయం కాకి రంగులో
మన కంఠాలకు ఉచ్చు బిగిస్తుంది
మతోన్మాదులు మనపై
కత్తులు దూస్తున్నారు
మనోల్లే అనుకున్నోళ్లు
మన బలాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారు

సంధి కాలాన్ని ఎరగా జూపి
మన గృహాలు నోర్లు తెరుస్తున్నాయి
వేటాడ్డానికి వెంబడిస్తున్నాయి
తస్మాత్ జాగ్రత్త –
ఈ ఉచ్చులో పడితే
ఉద్యమానికి ఉరి తప్పదు

అమరుల త్యాగాన్ని నెమరేసుకో
దోసిళ్ల నిండా రక్తాల్ని చిందించింది

కష్టకాలాల్లో చతికిల బడటానిక్కాదు
నీ గుండెల్ని దిటీవు చేసుకో
గుండె బరువుల్ని దించేసుకో
నీ ఉక్కు పిడికిళ్ల తాకిళ్లను
దోపిడి గుండెలకేసి సరిచూసుకో

ఈ వ్యవస్థ చావుని నీ గెలుపుని నిజం చేసుకో
విజయం విజృంభిస్తున్న వాడిదే –
విజృంభణ ప్రజ్వలింప జేస్తున్న మనదే.

28 ఏప్రిల్ 1984

(1984 సూర్యాపేట పి.డి.ఎస్.యు
జనరల్ కౌన్సిల్‌లో చదివిన కవిత. 'విజృంభణ'లో ముద్రితం)

పై పై షైనింగ్ లిచ్చి
ఓ నవ నిర్మాతగా, తిరుగుబాటు దారుడిగా పేరు పెట్టుకున్నావ్

తప్పు నీకున్న శక్తిదిగాదు
విచ్ఛిన్నం చేయగలనన్న నీ నమ్మకానిది
తప్పు పోరాటానికి ప్రతిరూపాలైన
విజృంభణ, తిరుగుబాటు లాంటి
విప్లవ పదజాలానిదికాదు
నీ పుర్రెల్లో మొలిచిన అన్య ధోరణులది

కామ్రేడ్స్!
కాషాయం కాకి రంగులో
మన కంఠాలకు ఉచ్చు బిగిస్తుంది
మతోన్మాదులు మనపై
కత్తులు దూస్తున్నారు
మనోల్లే అనుకున్నోళ్లు
మన బలాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారు

సంధి కాలాన్ని ఎరగా జూపి
మన గృహాలు నోర్లు తెరుస్తున్నాయి
వేటాడ్డానికి వెంబడిస్తున్నాయి
తస్మాత్ జాగ్రత్త -
ఈ ఉచ్చులో పడితే
ఉద్యమానికి ఉరి తప్పదు

అమరుల త్యాగాన్ని నెమరేసుకో
దోసిళ్ల నిండా రక్తాల్ని చిందించింది

కష్టకాలాల్లో చతికిల బడటానిక్కాదు
నీ గుండెల్ని దిటివు చేసుకో
గుండె బరువుల్ని దించేసుకో
నీ ఉక్కు పిడికిళ్ల తాకిళ్లను
దోపిడి గుండెలకేసి సరిచూసుకో

ఈ వ్యవస్థ చావుని నీ గెలుపుని నిజం చేసుకో
విజయం విజృంభిస్తున్న వాడిదే -
విజృంభణ ప్రజ్వలింప జేస్తున్న మనదే.

28 ఏప్రిల్ 1984

(1984 సూర్యాపేట పి.డి.ఎస్.యు
జనరల్ కౌన్సిల్‌లో చదివిన కవిత. 'విజృంభణ'లో ముద్రితం)

పై పై షైనింగ్ లిచ్చి
ఓ నవ నిర్మాతగా, తిరుగుబాటు దారుడిగా పేరు పెట్టుకున్నావ్

తప్పు నీకున్న శక్తిదిగాదు
విచ్ఛిన్నం చేయగలనన్న నీ నమ్మకానిది
తప్పు పోరాటానికి ప్రతిరూపాలైన
విజృంభణ, తిరుగుబాటు లాంటి
విప్లవ పదజాలానిదికాదు
నీ పుర్రెల్లో మొలిచిన అన్య ధోరణులది

కామ్రేడ్స్!
కాషాయం కాకి రంగులో
మన కంఠాలకు ఉచ్చు బిగిస్తుంది
మతోన్మాదులు మనపై
కత్తులు దూస్తున్నారు
మనోల్లే అనుకున్నోళ్లు
మన బలాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారు

సంధి కాలాన్ని ఎరగా జూపి
మన గృహాలు నోర్లు తెరుస్తున్నాయి
వేటాడ్డానికి వెంబడిస్తున్నాయి
తస్మాత్ జాగ్రత్త –
ఈ ఉచ్చులో పడితే
ఉద్యమానికి ఉరి తప్పదు

అమరుల త్యాగాన్ని నెమరేసుకో
దోసిళ్ల నిండా రక్తాల్ని చిందించింది

కష్టకాలాల్లో చతికిల బడటానిక్కాదు
నీ గుండెల్ని దిటవు చేసుకో
గుండె బరువుల్ని దించేసుకో
నీ ఉక్కు పిడికిళ్ల తాకిళ్లను
దోపిడి గుండెలకేసి సరిచూసుకో

ఈ వ్యవస్థ చావుని నీ గెలుపుని నిజం చేసుకో
విజయం విజృంభిస్తున్న వాడిదే –
విజృంభణ ప్రజ్వలింప జేస్తున్న మనదే.

28 ఏప్రిల్ 1984

(1984 సూర్యాపేట పి.డి.ఎస్.యు
జనరల్ కౌన్సిల్‌లో చదివిన కవిత. 'విజృంభణ'లో ముద్రితం)

విషవాయువు

నా ప్రియతమ భారతావని
నీ నేత్ర సాగరంలోని కన్నీళ్లింకిపోయాయా
నీ కంచుకంఠం మూగ పోయిందా

ముప్పదేళ్ల కిందటి మాట
నీ సంకెళ్లను తెంచారట...
నీకు 'స్వరాజ్య' కిరీటం తొడిగారట
కానీ తల్లీ...
నిన్ను స్వతంత్రించామనే పేర మంత్రించి
కాళ్లూ చేతులూ శరీరమంతా
సామ్రాజ్యవాద విపణిలో చిక్కి
కన్నీళ్ల పర్యంతం రోదించి గొంతు మూగబోయిందా...

చీకటి గదుల్లో
స్వేచ్ఛా గాలి పీల్చకుండా
భోపాల్ విషవాయువుల్ని
ప్రాణవాయువుగా అందించారా
బహుళజాతి కంపెనీల దోపిడి భాగోతంలో
పాత్రలన్నీ నిర్జీవమైపోయాయి
ప్రేక్షకులంతా క్షతగాత్రులయ్యారు

భోపాల్ శ్మశాన వాటికల్లో
సజీవ శవాలు వెంపర్లాడుతున్నాయి

పట్టపగలే అమావాస్య చీకట్లు
వాడు చూపుల్ని సైతం దోచుకెళ్లాడు -
మృతకళేబరాల బేరంపై రాజకీయ రాబందులు
విషవాయువు అండర్సన్ అరెస్టు నాటకాలు

జీవచ్ఛవాల్లో మిగిలిన ఓటు జీవాన్ని లాక్కుని
రాజీవుడు రాజై పోయాడు
విషమెవరికో వికారమెవరికో
తగు వాటాల్లోనే పంపిణీ అయ్యింది
మంచి చెడు కనటానికి చూపులుంటే గదా!

విషాన్ని విషాదాన్ని జీర్ణించుకుని
బడబాగ్నులై కదుల్తూ...

విషం

నేను విషం తాగలేదు
అమృతమే తాగాను
కానీ మరణించాను

విషతుల్యమైన అమృతం కన్న
విషం తాగడమే మిన్న

1995

వెలుగురేఖ

చెక్క పెల్లికి మెట్టు పెల్లికి
గీచిన పోరాట రేఖలు
చెరిగి పోక నిలుచునులే

అక్కడికి ఇక్కడికి పోరాటాల వారధేసి
బక్క బడుగు జనాన్నంతా ఒక్క తాటిపై నిలిపితే
చుట్టుముట్టి పోలీస్
పట్టు పట్టి కాల్చుతున్నా
నువ్వురిమిన నినాదాలు
కొవ్వూరిన దొరలకు కంపరాలు

చావు నీ కళ్లముందు కరాళనృత్యం చేసిన
చచ్చిబతుక సాహసంతో సాగిముందుకేగినోడ
చిరంజీవై నిలిచినోడా వీరుడా నరేంద్రుడా

కనికరం లేని వ్యవస్థకు
హానికరమట నీవు
గుండెల్లేని గూండాలకు
గుండె తీసిన మొనగాడవు

ఉండదులే ఈ చీకటి
కలకాలం పాతుకుని
చిందిన నీ నెత్తురులో
ఉదయించును వెలుగురేఖ

1985

(కా॥ రామస్వామి (నరేందర్) స్మృతిలో...)
క్రొన్నెత్తుటిదారులో పుస్తకంలోంచి

వైఫల్యం

వైఫల్యం
తెరచాపలేని నావలో
సుడిగుండాన్ని దాటడం

మనిషి కృషి పట్టుదల
తెడ్డయి కదిలి తెరచాపై ఎగిరేప్పుడు
అంగుళం పొరపాటుకూడా

తిమింగిల మంతటదై
నావను మింగేంత నోరు తెరుస్తుంది

ఫిబ్రవరి, 1992

సముద్రునికై

చేతులు కలువకుంటేనేం
చెక్కిళ్లు నిమురుకోకుంటేనేం
తడారని చూపుల్లో
చిరునవ్వుల్నెలా మరువగలం

రోడ్డు శవమై కూడా పాంబండకు నడిచి వెళ్లినపుడు
నిజాల్నెలా శిలక్కొయ్యకు వెయ్యగలం

గతం గీసుకున్న గాయాలనుండి
వర్తమానాన్నెలా జమగట్టగలం
క్షణకాలం మూతబడ్డ కనురెప్పలను
కనిపెట్టిన శత్రునిఘామృగం
ఒళ్ళంతా జల్లెడ చేసి
అణువణువూ అస్త్రగాలంపట్టినా
ఎన్ని అక్షరాలు ఉప్పొంగి
వెన్నెల కాంతుల్ని వెదజల్లాయి

కదుల్తున్న అలలపై ప్రసరించిన స్మృతులు
నీ నెత్తుటి సంతకాల చిరునామాల్ని వెతుకుతున్నాయి

సముద్రుడా నీ కలం తెరచాపలేని నావకాదు
సముద్రాన్నే సిరాగా నింపుకున్న ఎడతెగని ప్రవాహం
వాడు గుండె మీద చెయ్యేసుకుని నిద్రపోకముందే
హోరెత్తే చప్పుళ్లకు గుండెజారిపోయి బేజారవుతాడు
నీ లోతును వెతికే గజ ఈతగాళ్ల మధ్య
నిత్య చలనాన్ని ఎత్తిపాడటానికి నా గొంతు పెగలట్లేదు

నీ జీవితాన్ని నింపుకున్న నా కలం
అనంతమైన అమరాక్షరాలుగా కదిలింది
తరగని విప్లవైక్యతా శక్తినందించి
జనపదాలలో నీతో కల్సినడవాలని

20-3-91

(పీపుల్స్‌వార్ మెదక్ జిల్లా నాయకుడు విప్లవ కవియైన కా॥ కనకరాజు (సముద్రుడు)ను పోలీసులు తూఫ్రాన్‌లో పట్టుకుని పాంబండ దగ్గర ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపిన తర్వాత)

సహచరుడు

రక్తం పంచుకోకున్నా
అనుబంధాల్ని పంచుకునేవాడు
ఆశయాల కన్నతల్లిపై
అనురాగం పెంచుకునే వాడు
ప్రతి విషాదానికి కరిగి
కన్నీళ్లై మరిగేవాడు
ప్రతిమూలమలుపుల్ని ఎరిగి
కనుచూపై నడిచేవాడు
చీకటి వెలుగుల్లో
చీకటిని దాచుకుని
వెలుగునందించే వాడు
చినుకుల్ని మింగి
ఆణిముత్యాల్ని రాల్చేవాడు
కష్టాల్ని ఏరుకుతిని
సుఖాల్ని విసర్జించేవాడు

జీవితాన్ని త్యజించి
త్యాగంతో జీవించే కామ్రేడే
నిజమైన సహచరుడు

15.7.93

సహదేవ్ కోసం...

నీ మెత్తని అడుగుల చప్పుడుకోసం
ఆత్రంగా నేను ఎదురు చూస్తున్నాను

నీ జాడ గురించిన నీలి నీడలు
నా మనసులో మబ్బులై ముసురుకుంటున్నా
కండ్లు నీ కోసం ఆత్రంగా వెతుకుతున్నాయి

చిరునవ్వుతో పిడుగులు కురుస్తున్నా
పిడికిలి బిగించి రెడ్ శాల్యూటనే
పలకరింపులనే చెవులు నెమరేసుకుంటున్నాయ్ –

పిడుగు లాంటి వార్త ....
శత్రువు వలలో చిక్కి వాడి హింసలనే ధ్వంసించావని...
నీ చివరి ఉచ్ఛ్వాస
ఎన్‌కౌంటర్లదయ్యిందన్న వార్త!

సహదేవుడా నీవింక రావని గాలి ఊసులాడిపోయింది
మరణం మహా వృక్షమై కూలి భూమిని కంపింప జేయకున్నా
ఎండిన ఆకులా గల గలా ఊగుతూ
చిరునవ్వులై పలకరిస్తూనే ఉన్నావు –
మనం ఎడతెగని దమనకాండనే ఎజెండాగా
పని విధానపు వ్యూహాన్ని రచిస్తున్నాం

ప్రియనేస్తం
మన ఉనికినే ప్రశ్నిస్తున్న వాళ్ళు
ఉద్యమ సజీవతను చూడలేనివాళ్లు
నీ త్యాగాన్ని దేనితో కొలుస్తారు?

ఏ కదలిక లేకుండానే
దోపిడికాళ్ల కింది మట్టి లేచి వాడి కళ్లల్లో పడుతుందా?
ఏ ఉద్యమ సజీవత లేకుండానే
వాడికి నిర్జీవపు ఆలోచన మొలకెత్తుతుందా?
మన పేరును కూడా వాడు సహించనప్పుడు
మనం ఊరికొక పేరై జీవించడం ఒక అనుభవం
వాడు పన్నిన కత్తుల బోనుదాటి
సుడిగాలిలా విస్తరించడమే సజీవత
పదమూడు వసంతాల్లో చిగురిస్తున్న నెత్తుటి త్యాగాలపై
కామ్రేడ్ సహదేవొక అగ్ని పుష్పమైరాలాడు

ఎమర్జెన్సీ ఉక్కుపాదాన్ని సవాల్ చేసిన
జంపాల శ్రీహరుల సరసన సహదేవుడి సంకల్పం
రక్తచలన సంగీతమై ఎడతెగని పాటను ఆలపిస్తుంది!
ఎదురులేని చరిత్రను లిఖిస్తుంది.

సందేశం

జీవితానికొక మరణ సందేశం
మరణాన్ని శ్వాసిస్తూ జీవించమని
నూరేండ్ల ఆయుష్షు మూట గట్టుకున్నా

కంటకాలు కాళ్లకు నాటుకున్నా
దారి దోపిడిగాళ్ళ మధ్యే కదా ప్రయాణం

కళ్లను పొడుస్తున్నా
దారితప్పని చూపేనమ్మా జీవిత రహస్యం
దరిలేని మనసేనమ్మా మరణ సందేశం

1 అక్టోబర్ 1997
అర్ధరాత్రి

స్మృతి గానం

ఒక కల...
కన్నీటి పొరల వెనుక మసకమసకగా కదలాడినప్పుడు
కన్నీళ్లే ప్రవహిస్తున్న పాదరసంలాగా
ఎన్నెన్నో జ్ఞాపకాలై మా చెక్కిళ్లను తాకుతుంటాయి

శోకాన్ని వారించి దుఃఖాన్ని నివారించే
నీ మెత్తని మనసులో ఎన్ని వెన్నెలలు వేడిమంటలు!
జీవితం వైవిధ్యమైన చోట సంఘర్షణగా మొలకెత్తావు

ఒక అర్ధరాత్రి 'స్వాతంత్ర్యం'
57వ సారి వేడుకల్లో మునిగి తేలుతున్నప్పుడు
మాకు రాజ్యం మృత్యుఘంటికలు వినిపిస్తాయి
'నాగరికత' అధర్మయుద్ధాల గాయాలు చేసినప్పుడల్లా
ప్రతిఘటన ఆంటీబయాటిక్‌వై నయం చేస్తుంటావు

కామ్రేడ్ సుభాష్
నీ యుద్ధగీతాల్లోని శాంతి సందేశం మోసుకెల్తున్నాం -

నిరాయుధుడిగా బంధీ చేసిన జనావాసాల మధ్యనే
ఇప్పుడు మన ఆయుధాల చర్చ జరుగుతోంది
నిన్ను హింసించి చంపిన వాడికి బేడీలు వేయకుండానే
ఆయుధాలకు ఆశయాలకు సంకెళ్లు వేస్తామంటున్నారు

హంతకుడే హతులకు ఉరిశిక్షలు వేసే చోట
పీడిత వర్గ న్యాయం కోసం నిన్ను స్మరించుకుంటున్నాం
ఆత్మరక్షణ కోసం నీ త్యాగాన్నే ఆయుధంగా సంధిస్తున్నాం

నీవిప్పుడు మసక మసకగా కరుగుతున్న కలవి కాదు
తిరిగి తిరిగి విన్పిస్తున్న స్మృతి గీతానివి
తిరుగుబాటు సంకేతానివి

16 ఆగస్టు 2004

(ఆగస్టు 27, 2004న కా॥ సుభాష్ ప్రథమ వర్ధంతి సందర్భంగా)

స్త్రీ మేధం

ఎక్కడకు చెల్లీ వెళ్లావు
ఏ అనుమానాల ముళ్ల కంచెకు తట్టుకుని
ఇలా శవమై మిగిలావు –

వంచకుడొకడు దర్జాగా మిగిలితే
ఎందుకమ్మా నీకీ శవ సౌభాగ్యం
అర్థ ప్రపంచానికి తెల్లారని
ఈ కపటనీతి పటాపంచలై పోని!
పులీ మేకల పుంజీతంలో
మేకకు తోడైన
తోడేళ్లలాంటి పురుషాధిక్యత
ఇక పురుగులు పడి చావనీ

ఎందుకు చెల్లీ వివక్షకు బలయ్యావు
ఏ అవమానాల వరదల్లో కొట్టుకుని
ఇలా శవమై తేలావు –

ఆడది అందంగా ఉంటే ఓర్వలేని లోకంలో
తల్లిగాక పోవడమే తప్పనే కాకుల మధ్య
సూటిపోటి శూలాలు గుచ్చుకోగా

అందీ అందని ఆలోచనల్లో పడ్డ నింద
ఎందాక మోయాలంటూ ఎందుకిలా బలయ్యావు

ఏ అవమానాల ఉరితాడుకు బిగుసుకుని
ఇలా శవమై చెట్టుకు వేలాడావు –
ఇరవై ఏండ్లు చేసిన కాయకష్టం
అర నిముషంలోనే పనికి రానిదై పోయిందా...?
ఏడేండ్లు తనువు పంచినప్పుడు లేని అపవిత్రత
రెండుక్షణాల్లోనే అంటుకుందా...
మగరాయునికే మలినం అంటుకోదా?
మనిషి... మనిషికీ ఎందుకీ వివక్ష
అడుగడుగునా ముంచేసే అత్యాచారాల్లో చిక్కి
ఎక్కడకు చెల్లీ వెళ్లావు

ఏ అవమానాల ముళ్ల కంచెకు తగుల్కొని
మా హృదయంలో వేళ్లు పెట్టి కెలికావు
మా కండ్లల్లో కన్నీళ్లై తిరిగావు
మా మస్తిష్కాల్లో తుఫానువై రేగావు –

(28.8.89 నాడు మెదక్ జిల్లా లింగుపల్లి గ్రామంలో వెంకట లక్ష్మి ఆత్మహత్య తర్వాత రాసింది. తర్వాతి విచారణలో ఇది దారుణమైన హత్యగా మానవ సంబంధాల వికృత చేష్టగా తేలింది)

హృదయమా....

నా అపురూప దృశ్యంగా
ఆవిష్కరించుకున్న హృదయమా

మంచులా కరిగిపోతున్నావా
మ్రానులా విరిగిపోతున్నావా
మసిబట్టి మసక బారుతున్నావా
ఏమైపోతున్నావు హృదయమా...
మది అడిగే ప్రశ్నలకు బదులైనా ఇవ్వవా?

చవుడు చాకిర్ల కెత్తి తనువుల్ని పిండుకున్నాం
బీడు నేలలకు రాకి ఆలోచనల్ని పదును చేసుకున్నాం
పచ్చని పత్రహరిత దేహాలపై ఊరిన ఉప్పులోనే
జీవన విలువల్ని దర్శించాం -
కంపు గొడ్తున్న పరిసరాల్ని పరిమళంగా మార్చి
హృదయాల్లోకి పీల్చుకున్నాం
ఆంక్షల ముళ్ల కంచెల్లో రాలిన పూలనేరి
మన ఆకాంక్షల దండలల్లుకున్నాం
కలల జలపాతాల్లో కదలాడి
అలల అక్షరాల్ని ఒడుపుకున్నాం
హృదయాన్ని మెదళ్లో పొదుగుకుని

ఆలోచనలతో సాయుధమయ్యాం
దేహమంతా గుండెలకిముద్దుకుని
గుండె గుండెంతా కళ్లు చేసుకుని చూసినా
ఏమిటీ కనిపించవు?

ఎందుకీ అదృశ్య విద్య నభ్యసిస్తున్నావు -
ఈ యాంత్రిక మంత్రోచ్ఛయాన్ని దాటి

నా దృశ్య నేత్రంతో ఒక్కసారి చూడు
నా సజీవ జ్ఞాపకాల్ని నీకు ధారబోస్తా
కనుమరుగు కాకముందే వెనుదిరిగి చూడు

రేపటి సమాధి ముందు మోకరిల్లకు
నేటి సజీవతతో జతకలువు...

ఏప్రిల్, 1993

ఎదురీత

ఆకాశం కింద నల్లటి తడి తడి మేఘం
అంతులేని ప్రయాణంలో కొండను ఢీకొన్నప్పుడల్లా
ఎడతెగని కన్నీళ్లు
కాలం నడిచి నడిచీ అలసటెరుగదు
కాలం గడిచినా భవిస్యత్తు తరుగదు
అమ్మా! ఇప్పుడొక మజిలీ చేరాను
రెండేండ్ల అగాధాన్ని పోగేసుకుని
ఒంటరిగా కలగంటున్నాను
సహదేవుని సహచర్యం పిల్లనగ్రోవైంది
కల్లల్లో దిగిన వేల్లు పెకిలించి వేసి
సంజీవం ఆశల్ని బతికించింది
అమ్మా కొన్ని మనుసుల్లో కట్టుకున్న గోడల్ని దాటి
ముందుకువళ్ళలేము-వెనక్కురాలేము
అవసరాలకు కొలతలు వేసుకుని
పెదవులతో మాటలు-గాలిలో చేతులు
ఆర్థిక సంబంధాల బాంధవ్యాల్లో
ఆత్మీయత శాశ్వతం కాదు
ఐక్యత-పోరాటం-ఐక్యత
రాజకీయ వరుసలు తారుమారై

స్నేహంకై రెండు చేతులు అందించినా
అందుకనే వారు లేరు
కూడికలు - తీసివేతలు - గుణింతాలు లేవు
అమ్మా ! రెండేండ్లుగా నిన్ను చూడాలని
నీతో మాట్లాడాలని
ఆశ చిటారుకొమ్మకు చేరింది
పై నుండి కిందికి దిగలేని కోరిక బంధించబడి
ప్రపంచాన్ని చూశాను.
అమ్మా ! స్వేచ్ఛను కట్టేసుకుని
ప్రపంచమంతా కదులుతున్న జైలు
బహుళజాతి కంపెనీల ముళ్ల తీగలల్లుకుని
నదీనదాలు-నాగరికతా-ఆశలు-ఆకలి
బ్యారక్‌లో బంధించబడి
ప్రపంచమంతా కునారిల్లుతున్న జైలు-
అయినా ఊచలవెనుక ఊపిరితిత్తులు
కొలిమి రాజేస్తాయి
ఉరితాడుకు సైతం చావుభయం రేపి
అంతిమ శ్వాసను సాయుధం చేస్తాయి
అమ్మా ! ప్రేమే ప్రపంచమై నీకు దూరమయ్యాను
ప్రపంచమంతా ప్రేమై నీకు దగ్గరయ్యాను
ఆకాశాన్ని కప్పుకుని భూమిపై నిద్రించడం
ఆకునీల్ల గిలిగింతల్లో తారల్ని ముద్దాడటం
ప్రమాదాల చుట్టూ పరిభ్రమించడం
అమ్మా ! కలలోసైతం ఒక కంటనీళ్ల
మరోకంట ప్రజ్వలన మంటలు

పయిలం బిడ్డా అంటూ నువ్వందించిన సద్దిమూట
అందుకున్ననో లేదో
కలచెదిరింది
చెట్టు రాల్చిన నీళ్లో
చెమ్మ గిల్లిన కళ్ళల్లో ఉబికిన కన్నీళ్లో...
అమ్మా ! ఇక అనంతయానం
గుండె తేలికై మేఘాల్ని మోసుకుంటూ
మేఘాల్ని దూసుకుంటూ...

తాత కథ / కల సాకారం కావాలి

అరికాలు కింది మట్టికి ఆటలు నేర్పి
కవ్వాన్ని చిలికీ చిలికీ పాటల వెన్నదీశావు
బంధాలను, నిర్బంధాలను ఛేదించి
శ్రామికుల కచేరి చేశావు
భాగోతాల కోలాటాల చెంత చేరి
పల్లెల్లో పద్యాల్ని పరవళ్ల తొక్కించావు
చెంప ఛెళ్లు మనిపించే హస్తాల్తో ఓలలాడించి
వ్యంగ్యాలలో చండశాసనుల తిత్తి వలిచావు
తాతా జీవితం అంత విప్లవమే
జీవితం కథలా గడిచిపోయింది
విప్లవమూ కథలా నడిచిపోతుంది
నిలువెత్తు విశ్వాసాల దేహంలో
చిరకాల విప్లవ ఆశ చిక్కిశల్యమవుతుంది
అయినా సుదీర్ఘ ప్రయాణం నిట్టూర్వదు
మానవత్వం-సమానత్వం కొట్టు మిట్టాడుతున్న చోట
కళల అంచుదగ్గర కత్తి పట్టి నిలిచావు
పిరికితనాన్ని జయించి కమ్యూనిస్టు వయ్యావు
తామరాకుపై నీటి బిందువయ్యావు
వర్గం, కులం, ప్రాంతం, మతం ఆసాంతం
ఒకే మూసలో పోసి ఎంత వేడితో రగిలించావు

సుడిగాలై తిరిగిన అనుభవాలను సద్దిగట్టి
మాసిపోని గాయాలకు మొలాం అద్దుతూ మాకో కథ జెప్పావు
తండ్రీ సామ్యవాద సమ్మోదగీతాలాపనల కథ(ల)
ఖరారుగా మాకిప్పుడు విప్లవ గీతమే మిగిలింది
... ...
తెలుగుతనాల కోడూరు అక్షర అందియలు
ఓరుగల్లు జిల్లాలో ఘల్లుమని మోగాయి
విశ్వవిద్యాలయాలు, వీథులు, గ్రామాలు, అడవులు,
మైదానాల్లో
మూడుతరాల అరంగేట్రం ఇంకా ముస్తాబవుతోంది
తల్లి కోడయి కొలువు దీరిన శిబిరంలో
గద్దలు తన్నుకెళ్లగా మిగిలిన పరివారమిది
ముక్కులు తవ్విచ్చి నేర్పినా, మొక్కజొన్నలు పోసిపెంచినా
విశ్వమోహపు మార్కెట్ ఆరగించిన దానికిక లెక్కలేదు
అరుణ తారలకు జోహారుల తాళం వేస్తూనే
ఉబికివచ్చిన జ్ఞాపకాల చెలిమిల్లోంచి
ఒక ప్రేమల తల్లిని అమ్మగా అందించావు
పుట్టెడు దుఃఖాల ఎడబాటుల ఎదకోతలు
పాడటానికి సరిగమలు చాలవు తండ్రీ సరిగమలు చాలవు
... ...
ఎప్పటికీ కలువలేని కళాలు-గళాల మధ్య
తండ్రీ ! ఎందుకీనీడల యుద్ధం...
నీళ్లను, కన్నీళ్లను ఎంతకాలం రుచి చూద్దాం
తాళంలేని గొంతును తరిమేసిన కళాపిపాసికి
సోషలిజం గాలేసోకని ఉచ్ఛ్వాస-నిశ్వాసల
వేడెట్ల చల్లారుతోంది ?

సంకల్పాల జడివానలో నిలువు నిట్టారం తడ్సినవాళ్లం
ఇక ఎడారుల్ని, ఎండమావుల్ని ఒయాసిస్సు దగ్గర
వాటేసుకుందాం
సాగరమథనాల హాలాహలం
ముప్పయ్యేళ్లుగా భోళాశంకరుల కంఠాల్ని మండిస్తూనే ఉంది
శంభూకుల తలలు వేలాదిగా కోట గుమ్మానికి
వేలాడుతూనే ఉన్నాయి
అపజయాల సాక్ష్యం విజయాల్ని కాంక్షించడం లేదా ?
తండ్రీ అమరమూర్తుల చేతుల్లో అక్షయ పాత్రలమై
విప్లవాన్ని యాచిద్దాం
తెలంగాణా, నక్సల్బరిల కలలను వలపన్ని పట్టుకుందాం
తాతా ! కొన ఊపిర్ల కోరికను పంచుతూ
అరవయ్యేళ్ల ఆర్తితో ఆలింగనం చేసుకో
కాలానికి కళ్లెం వేసే నవతరానికి
జరూరుగా విప్లవం కావాలి
విజయమూ కావాలి
కథలూ, కల(ళ)లూ సాకారమయ్యే మార్గం కావాలి

- జూలై, 2006

... ...

(కానూరి తాతగారి "కథగాని కథ" చదువుతూ మధ్యలోనే కన్నీళ్లు తుడుచుకుంటూ రాసిన అక్షరాలివి. మాచర్ల విరసం మహాసభలో తాతగారిని ప్రత్యక్షంగా చూశాను. కోరస్‌లో శ్రుతి తప్పిపాడినందుకు వేదికమీది నుండి నిర్దాక్షిణ్యంగా నెట్టివేయబడ్డాను. అప్పుడది బాధే అనిపించింది. కానీ అదొక అనుభూతి. రాగం, తాళంపట్ల తాత నిక్కచ్చిగా వ్యవహరిస్తారనడానికది నిదర్శనం. ఆనాటి నుండి ఈనాటి వరకు తాతగారితో ప్రత్యక్షంగా మాట్లాడలేక పోయాను. 'కథగాని కథ' ను సమీక్షించే సాహసం చేయలేక నా ఈ చిరుస్పందనను కానూరి గారికి అంకితమిస్తున్నాను.)